ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

fb.com/vaartha Digital

కపిల్ చిట్స్ తోడుంటే కనక మహాలక్ష్మి మీ వెంటే
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-11-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 276 పేజీలు: 10+4 వెల: 6.50



గురువారం ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నిమ్మల

## రెండేళ్లలో కీలక ప్రాజెక్టులు పూర్తి

### సిఎం చంద్రబాబు త్వరలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిశీలన: మంత్రి నిమ్మల

**విజయవాడ,నవంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్రప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజె క్టుల సమీక్షను ఈ నెలలో సిఎం చంద్రబాబు నాయుడు నిర్వహిస్తారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటించి పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసేలా అధికారులకు దిశా, నిర్దేశం చేయనున్నారని తెలిపారు గురువారం సచివాలయంలో ఉత్తరాంధ్రఇరిగేషన్ ప్రాజెక్టులపనుల పురో >>2

# ఇక 'వన్ విజన్.. వన్ డైరెక్షన్'

గ్రామ సచివాలయాలు విజన్ యూనిట్లుగా మార్పు

ప్రభుత్వ పౌర సేవలకు రేటింగ్‌లు ఇస్తాం

ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం చేయొద్దు

సచివాలయంలో 'డేటా ఆధారిత పాలనపై సదస్సులో సిఎం చంద్రబాబు



గురువారం సచివాలయంలో డేటా ఆధారిత పాలనపై సదస్సులో ప్రసంగిస్తున్న సిఎం. చిత్రంలో మంత్రులు లోకేష్, అనిత, అచ్చెన్నాయుడు, సిఎస్ విజయానంద్ తదితరులు

**విజయవాడ,నవంబరు 6,ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామ సచివాలయాల వ్యవస్థ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించే విధంగా రూపకల్పన చేయాలి. అందుకే వాటిని విజన్ యూనిట్స్‌గా మారుస్తున్నామని సిఎం చంద్రబాబు అన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో డేటా ఆధారిత పాలనపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో డేటా ఆధారిత పాలనపై సదస్సును ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తూ దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలన్నారు. సాంకేతికత ఆధారంగా సుపరిపాలన అందించాలన్నారు. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. దానికి అనుగుణంగానే విజన్ ప్రణాళికలను రూపొందించామని తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రాధాన్యత కావాలి అన్నారు. అంతా కలిసి కట్టుగాపనిచేసి ఇటీవలవచ్చిన తుఫాన్‌ను టెక్నాలజీ వినియోగంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని బాగా తగ్గించ గలిగామన్నారు. డేటా ఆధారిత పాలన అనేది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారింది. క్వాంటం కంప్యూటర్‌ను వచ్చే జనవరి నుంచే అమరావతిలో ప్రారంభించబోతున్నాం అన్నారు. సిఎఫ్‌ఎంఎస్ వ్యవస్థ ద్వారా సమర్థంగా వనరుల్ని వినియోగించగలుగుతున్నాం అన్నారు. గత ప్రభుత్వ చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం అన్నారు. 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కోరుతున్నాను. నెలవారీ, త్రైమాసిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఫలితాలను సాధించాలని సూచిస్తున్నాను అని అన్నారు. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగానే ప్రభుత్వం పౌరసేవలు అందించాల్సి ఉందన్నారు. ప్రతీ నియోజకవర్గానికీ ఓ సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేస్తాం >>2



## బీహార్‌లో తొలివిడత 64.66 శాతం పోలింగ్

### చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ఎన్నికలు

**పాట్నా, నవంబరు 6:** బీహార్ తొలిదశ ఎన్నికల్లో రికార్డుస్థాయి పోలింగ్ నమోదయింది. మొదటి విడతగా జరిగిన 121 నియోజక వర్గాల పోలింగ్‌లో గురువారం 64.66శాతం నమోదయింది. అంతకుముందు బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు 2000వ సంవత్సరంలో మాత్రమే 62.57శాతంగా పోలింగ్‌వస్తే ఈసారి ఆ గణాంకాలను అధిగమించి పోలింగ్ >>2

# డ్రగ్స్‌ను తరిమి కొట్టండి

- ముఖ్యమంత్రి దిశా నిర్దేశంతో 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదాన్ని స్కూలు స్థాయికి తీసుకువెళ్లాం
- 50 వేల స్కూళ్లలో అవగాహన కార్యక్రమాలు
- ఈగల్, టాస్క్‌ఫోర్స్, రైల్వే సమన్వయంతో కృషి: మీడియాతో హోంమంత్రి అనిత



**విజయవాడ,నవంబర్ 6,ప్రభాతవార్తప్రతినిధి:** నేటి యువతే రేపటి భవిష్యత్తు అని నమ్మిన సైద్ధాంతికుడు సిఎం చంద్రబాబు నాయుడు అని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ యువత భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర ప్రజాప్రతినిధులంతా ఏకమై విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయిని సమూలంగా అంతమొందించాలని కట్టుబడి ఉన్నారని అన్నారు. గురువారం టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉంది, అందుకే గత ఒకటిన్నర సంవత్సరంగా ఈ దిశలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వారికి భరోసా, ధైర్యం కల్పించడమే ఎన్డీఏ కూటమి లక్ష్యం. ఇందులో భాగంగా ఈగల్ వ్యవస్థను స్థాపించాం, దీని ఫలితంగా గంజా సాగును జీరో స్థాయికి తగ్గించాం. ముఖ్యమంత్రి దిశానిర్దేశంతో 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదాన్ని స్కూల్ స్థాయికి తీసుకెళ్లాం. 50వేల స్కూళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, డ్రగ్స్ నష్టాలు, ఎన్డీపీఎస్ చట్టాల గురించి విద్యార్థులకు తెలియజేశామని వివరించారు. కూటమి ప్రభుత్వం 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటుంటే, 'డ్రగ్స్ తీసుకో బ్రో' అని యువతను నాశనం చేస్తున్నది వైఎస్సార్సీ అని దుయ్యబట్టారు. అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చి, పాఠశాల విద్యార్థుల బ్యాగుల్లోకి డ్రగ్స్ కల్చర్ తీసుకొచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీ విద్యార్థి విభాగం విశాఖ జిల్లా అధ్యక్షుడు పులగం కొండారెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులను టార్గెట్ చేసి డ్రగ్స్ దందా నడిపిస్తూ ఈగల్ విభాగానికి పట్టుబడ్డాడు. ఇది జగన్‌కు తెలియదా? ఆయనకు తెలియకుండానే విద్యార్థి విభాగాధ్యక్షుడు దందా నడిపాడా అని ప్రశ్నించారు. ఒక్క రోజైన యువత భవిష్యత్తు కోసం ఆలోచించాడా జగన్మోహన్ రెడ్డి అని ప్రశ్నించారు. ఇలాంటి వారితోనే గంజాయిని పెంచి పోషిస్తున్నారు. సిగ్గులేకుండా యువతతో మీటింగ్ పెట్టుకుంటున్నాడా జగన్ అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ఆరుగురు మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేసి, ఈగల్, టాస్క్‌ఫోర్స్, రైల్వేలతో సమన్వయంతో పనిచేస్తున్నామని తెలిపారు. డ్రగ్స్, గంజా ఎక్కడ దొరికినా పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విశాఖను ఎకనామిక్, ఇండస్ట్రియల్ హబ్‌గా తయారు చేయడానికి ముఖ్యమంత్రి, ఐటీమంత్రి లోకేష్ ప్రపంచ దేశాలు తిరిగి కంపెనీలు తీసుకొస్తున్నారని ప్రస్తావించారు. టిసిఎస్, స్టీల్ ఫ్యాక్టరీ, ఎటిసి టైర్స్ వంటి సంస్థలతో లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. వైఎస్సార్సీ లాంటి పార్టీలు, వ్యక్తులతో పిల్లలను దూరంగా ఉంచండని ఆమె హితవు పలికారు. ఎవరైనా డ్రగ్స్‌తో దందా నడిపిస్తే ఈగల్ కన్ను గమనిస్తుందని ఆమె హెచ్చరించారు.



## క్రికెటర్లు సురేష్ రైనా, శిఖర్ ధావన్‌ల ఆస్తులు ఇడి జప్తు

**ముంబయి, నవంబరు 6:** భారత మాజీ క్రికెటర్లు సురేష్ రైనా, శిఖర్ ధావన్‌లకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాక్ ఇచ్చింది. బెట్టింగ్ యాప్ కేసులో ఇద్దరికి చెందిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ సైట్ వన్ ఎక్స్‌బెట్‌కు సంబంధించిన కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ధావన్‌కు చెందిన రూ.4.5 కోట్ల విలువైన స్థిరాస్తిని, రూ.6.64 కోట్ల విలువైన రైనా మ్యూచువల్ ఫండ్స్‌ను జప్తు చేసేందుకు ఇడి ఉత్తర్వు జారీ చేసింది. బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మాజీ క్రికెటర్లు సురేష్ రైనా, శిఖర్ ధావన్‌లను ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రశ్నించింది. >>2



## అనిల్ అంబానీకి మరోసారి ఇడి సమన్లు

**ముంబయి, నవంబరు 6:** రిలయన్స్ ఏడీఏ గ్రూప్ చీఫ్ అనిల్ అంబానీకి ఈ నెల 14న విచారణకు హాజరుకావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మరోసారి గురువారంసమన్లు జారీ చేసింది. బ్యాంకు మోసం, మనీ లాండరింగ్ కేసులో వచ్చేవారం విచారణకు రావాలని సమన్లు జారీచేసింది. అనిల్ అంబానీని ఆగస్టులో కేంద్ర దర్యాప్తు సంస్థ ప్రశ్నిం >>2

# ఉల్లి రైతులకు ఆందోళన వద్దు

### ప్రభుత్వం భారీగా కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ. 10 కోట్లు జమ

### ప్రతి హెక్టారుకు రూ. 50 వేలు అందజేయాలని నిర్ణయం: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ నవంబరు 6, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ఉల్లి రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం పక్కా చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఉల్లి ధరలు పతనమైనప్పుడు రైతులు పడిన శ్రమ వృథా కాకుండా ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా ఉల్లిని కొనుగోలు చేసింది. రాష్ట్రంలోని ఉల్లి రైతులు ఏ విధంగానూ నష్టపోకుండా రక్షించాలనే భావనతో సిఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారని, ఒక క్వింటాకు..1200 పెట్టి మార్కెటింగ్ శాఖ మరియు మార్క్‌ఫెడ్ ద్వారా కర్నూలు మార్కెట్‌లో సుమారు 18 కోట్ల విలువగల ఉల్లిని ప్రభుత్వం సేకరించిందని, ఇప్పటికే 10కోట్ల నగదును రైతుల ఖాతాలలో జమ చేసామని, మిగిలిన 8 కోట్లను అతి త్వరలోనే రైతులకు అందచేయనున్నట్లు మంత్రి తెలిపారు. కేవలం మార్కెట్ జోక్యం ద్వారా >>2





# ఇది మోడీ, షాల జంగిల్ రాజ్

### బీహార్ ఎన్నికల్లో ఓటు చోరీకి బిజెపి యత్నం

### బూత్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి: ఎన్నికల ర్యాలీలో రాహుల్

**అరారియా(బీహార్), నవంబరు 6:** ఎన్నికల సంఘం, బిజెపి హర్యానాలో ఎలా ఓట్ చోరీ చేసిందో, బీహార్ ఎన్నికల్లోనూ ఓట్ చోరీ పాల్పడేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. వారు ఎక్కడ ఎన్నికల్లో పోటీ చేసినా, ఓట్లను దొంగలించడం ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారు. బిజెపి, ఎన్నికల సంఘం హర్యానా ఎన్నికల్లో ఓట్ చోరీకి సంబంధించిన వందశాతం రుజువులతో నిన్నటి రోజు బహిర్గతం చేశామని ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ గుర్తుచేశారు. ఈసారి ఓట్ల దొంగతనాన్ని అనుమతించకూడదు, దీనికి వ్యతిరేకంగా యువత పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అరారియాలో నిర్వహించిన ఎన్నికల సభలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ... బిజెపి ప్రతి ఎన్నికల్లో ఓట్లు చోరీ చేసి గెలుస్తుందని విమర్శించారు. యువతకు ఉపాధి కల్పించకుండా మోడీ కోటీశ్వరుల కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. బీహార్ యువతను కార్మికులుగా మారుస్తున్నారని ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పైనా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సిఎం నితీశ్‌ను ప్రధాని మోడీ రిమోట్ ద్వారా నియంత్రిస్తున్నారని రాహుల్ పునరుద్ఘాటించారు. "బీహార్ మళ్లీ అభివృద్ధి చెందాలి. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రులను బీహార్‌లో స్థాపించబడాలి. బీహార్ పర్యాటక, పరిశ్రమలకు ప్రపంచ కేంద్రంగా మారాలి. కానీ ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి నితీశ్ దీన్ని చేయలేరు. ప్రధాని మోడీ రిమోట్ ద్వారా నియంత్రించబడుతున్నందున నితీశ్ కుమార్ ఏమీ చేయలేదు. నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని నడపడం లేదు. దీనిని బీహార్, ఢిల్లీకి చెందిన అధికారులు, ప్రధానమంత్రి మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్వహిస్తున్నారు" అని రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. అంతకు ముందు పూర్ణియాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ... దేశాన్ని జంగిల్ రాజ్యంగా మార్చారని ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై మండిపడ్డారు. నితీశ్ కుమార్ బీహార్‌లోని జంగిల్ రాజ్ >>2



ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన బస్సు

## విశాఖ-ఒడిశా ఆర్టీసి బస్సుకు మంటలు

### సకాలంలో డ్రైవర్ అప్రమత్తం, తప్పిన ప్రాణ నష్టం

**పాచిపెంట (పార్వతీపురం మన్యం జిల్లా) నవంబరు 6, ప్రభాతవార్త :** పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలో ఒడిశాకి చెందిన ఆర్టీసీబస్సు దగ్ధమైంది. విశాఖ నుంచి ఒడిశాలోని జైపూర్‌కి వెళుతున్న ఈ బస్సు గురువారం ఉదయం సుమారు ఏడున్నర గంటల సమయంలో మండలం >>2



దర్యాప్తు చేస్తున్న సిఐడి బృందం

## 'పరకామణి'పై వడివడిగా దర్యాప్తు

### రవికుమార్ వ్యవహారంపై క్షేత్రస్థాయిలో సిఐడి అధ్యయనం

### చోరీతీరు, లోక్ అదాలత్‌లో రాజీ అంశాలపై సిఐడి లోతుగా విచారణ

**తిరుమల,నవంబరు 6ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో 2023 ఏప్రిల్‌లో జరిగిన చోరీ ఘటన,తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాలతో సిఐడి బృందం దర్యాప్తు వేగవంతం చేసింది. నిందితుడైన సివి రవికుమార్ వ్యవహారంపై పూర్తి ఆధారాల కోసం సిఐడి చీఫ్ రవిశంకర్అయ్యన్నార్,ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు మొత్తం 20మంది బృందం ఐదు టీమ్‌లుగా విడిపోయి క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేస్తున్నారు. గురువారం ఉదయం తిరుమలకు వచ్చిన సిఐడి డిజి అయ్యన్నార్ తమ బృందంతో పరకామణి భవనం, కమాండ్ కంట్రోల్‌రూమ్, సిసిటివి దృశ్యాలు పరిశీలించారు. రవికుమార్ పాత్ర, 2023 ఏప్రిల్‌లో చోరీ జరిగిన ప్రాంతం, ఎలా పట్టుబడ్డాడు అనే వివరాల ఆధారాలు సేకరించారు. రవికుమార్‌పాత్ర, పాత్రధారులుగా, సూత్రధారులుగా సహకరించిన వారి విషయాలు, ఆధారాలపై లోతుగా విచారణ మొదలుపెట్టారు. తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, టిటిడి విఎస్‌ఓ ఎస్టీవి >>2

ఇక న్యూయార్క్ ప్రజలు ఫ్లోరిడాకు పారిపోవలసిందే..
-మమ్దానీ మేయర్ కావడంపై ట్రంప్ వ్యాఖ్యలు

భాగల్పూర్ ఊచకోత మరకలను తుడిచేయలేం

కర్ణాటక సిఎం సిద్ధరామయ్యకు ఎదురు దెబ్బ

5లో



మహిళా క్రికెట్ టీమ్ సభ్యులు గురువారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్మును మర్యాదపూర్వకంగా కలుసుకున్న దృశ్యం

# పట్టాలెక్కనున్న నరసాపురం-చెన్నై తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్

## ఫలించిన కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కృషి

**భీమవరం, నవంబర్ 6: ప్రభాతవార్త :** కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ గత కొన్ని నెలలుగా చేస్తున్న అవిశ్రాంత కృషి ఫలితంగా నర్సాపురం పార్లమెంటు నియోజకవర్గానికి తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు చెన్నై (ఎంజీఆర్ చెన్నై సెంట్రల్) నుండి విజయవాడ వరకు నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్లు: 20677/20678)ను నర్సాపురం వరకు పొడిగిస్తూ కేంద్ర రైల్వే శాఖ నుండి దక్షిణ మధ్య రైల్వేకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నర్సాపురం ప్రాంతానికి తీసుకురావడం కోసం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, రైల్వే ఉన్నతాధికారులతో శ్రీనివాస వర్మ పలుసార్లు సమావేశమై నర్సాపురం ప్రాంతానికి వందే భారత్ ఆవశ్యకతను బలంగా తెలియజేశారు. సాంకేతిక ఇబ్బందులు పరిష్కారం అయ్యేలా అధికారుల మధ్య సమన్వయానికి కృషి చేశారు. ఈ రైలు పొడిగింపుతో పశ్చిమ గోదావరి జిల్లా వాసులతోపాటు కోనసీమ వాసులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. నర్సాపురం వరకు పొడిగించిన ఈ మార్గంలో గుడివాడ, భీమవరం టౌన్ స్టేషన్లలో ఈ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఆగుతుంది. రైలు నంబర్ 20677 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుండి నర్సాపురం వరకు, అలాగే రైలు నంబర్ 20678 నర్సాపురం నుండి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వరకు నడవనుంది. చెన్నై లో 5.30 గంటలకు బయలుదేరి (20677 నెంబర్) రైలు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలి స్టేషన్లో ఆగుతూ విజయవాడలో 11.45 గంటలకు, మధ్యాహ్నం 12:34 గంటలకు గుడివాడ, 1:29 గంటలకు భీమవరం టౌన్ చేరుకుని మధ్యాహ్నం 2:10 గంటలకు నర్సాపురం చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో 20678 నెంబర్ రైలు నర్సాపురం నుండి మధ్యాహ్నం 2:50 గంటలకు బయలుదేరి 3:19 గంటలకు భీమవరం టౌన్ చేరుకుని, 4:09 గంటలకు గుడివాడ చేరుకుని, 4:50 గంటలకు విజయవాడ కు చెన్నైకు రాత్రి 11.45 గంటలకు చేరుకుంటుంది. అధికారిక ప్రారంభ తేదీని రైల్వే శాఖ అతిత్వరలో తెలియజేయనుంది. నర్సాపురం తొలి వందే భారత్‌కు కేంద్ర రైల్వే శాఖ ఆమోదం తెలపడంతోపాటు ఈ రైలు సర్వీస్ ప్రారంభించవలసిందిగా ఉత్తర్వులు జారీ చేయడం పట్ల నరసాపురం ప్రాంత ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నరసాపురం ప్రాంతానికి తొలి వందే భారత్ రైలు తీసుకురావడానికి కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ చేసిన కృషిని వారు అభినందిస్తున్నారు.

# ఆస్తులు ఇడి జప్తు

>> దర్యాప్తు సమయంలో వారి వాంగ్మూలాలు నమోదు చేసింది. అక్రమ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన పలు కేసులను ఇడి ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్నది. ఇలాంటి బెట్టింగ్ యాప్స్ చట్టవిరుద్ధం మాత్రమే కాకుండా పెద్ద ఎత్తున మనీలాండరింగ్‌కు దోహదపడతాయని కేంద్ర దర్యాప్తు సంస్థ భావిస్తున్నది. ఈ యాప్‌లో లక్షలాది మంది వ్యక్తులు, పెట్టుబడిదారులను రూ.కోట్లు మోసం చేశాయని, పెద్ద మొత్తంలో పన్ను ఎగవేస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. బెట్టింగ్ యాప్స్‌కు మద్దతుగా పలువురు ప్రముఖ సినీతారలు, క్రికెటర్లు ప్రచారం నిర్వహించిన విషయం తెలిసిందే.

ఈ క్రమంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఇప్పటికే నమోదైన కేసుల ఆధారంగా రంగంలోకి విచారణ జరుపుతున్నది. ఇందులో భాగంగా పలువురు సినీ తారలు, మాజీ క్రికెటర్ల పాత్రపై ఇడి దర్యాప్తు చేస్తున్నది. ఇప్పటికే పలువురు నటీనటులు, క్రికెటర్లకు నోటీసులు ఇచ్చి విచారణ జరిపింది. బెట్టింగ్‌ను ప్రోత్సహించేలా ఇద్దరు మాజీ క్రికెటర్లతో ఎండార్స్‌మెంట్ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లుగా ఇడి దర్యాప్తులో తేలింది. ఈ ఇద్దరితో పాటు ఇదే బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో గతంలో మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, నటీనటులు సోనుసూద్, ఊర్వశి రౌతేలా, మిమి చక్రవర్తి, అంకుష్ హాజ్రాతో పాటు పలువురిని ప్రశ్నించిన విషయం తెలిసిందే.

# మోడీ, షాల జంగిల్ రాజ్

>> గురించి మాట్లాడుతున్నారని, కానీ ప్రధాని మోడీ, షా ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా అలాంటి పరిస్థితిని తెచ్చారని ఆరోపించారు. ఇడి, సిబిఐ, ఐటీ దాడులతో పాటు నిరుద్యోగం, విద్వేషాలు రెచ్చగొట్టి దేశంలో జంగిల్ రాజ్‌ను సృష్టించారని విమర్శించారు. బీహార్‌తో పాటు దేశ ప్రజల మధ్య ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారని అన్నారు.

**పారదర్శకంగా ఎన్నికల నిర్వహిస్తే ఎన్‌డిఎకు ఓటమే: ప్రియాంక గాంధీ**

బీహార్‌లో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తే ఎన్‌డిఎ కూటమి పరాజయం పాలవుతుందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. ఈస్ట్ చంపారణ్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ప్రియాంక మాట్లాడుతూ, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ చోరీతో బిజెపి గెలిచిందని, రాహుల్ గాంధీ ఆరోపణలను సమర్థించారు.

బీహార్‌లో ఇటీవల ఎస్ఐఆర్ పేరుతో ఎన్నికల సంఘం దాదాపు 65 లక్షల ఓట్లను తొలగించిందని ప్రియాంక ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఓట్ల దొంగతనానికి తావివ్వకుండా మహాకూటమి బూత్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రచారంలో ప్రజాస్పందన చూస్తే, మహాకూటమి ఖచ్చితంగా విజయం సాధించి, అధికారంలోకి వస్తుందనే ధీమా కనపడుతోందన్నారు.

# బస్సుకు మంటలు

>> లోని లొడ్డవలస వద్ద అగ్ని ప్రమాదానికి గురైంది. బస్సు ఇంజన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం వలన బస్సులో మంటలు చెలరేగిన విషయాన్ని గ్రహించిన డ్రైవర్ రోడ్డు పక్కన ఆపి అప్రమత్తయ్యాడు. బస్సులో ఉన్న పది మంది ప్రయాణికులను అలెర్ట్ చేశాడు. దీంతో ప్రయాణికులు కూడా హుటాహుటిన బస్సు నుంచి కిందకి దిగేశారు. అదృష్టవశాత్తూ ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కాగా ఈ విషయం తెలుసుకున్న పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి రోడ్డవలస ఘాట్ రోడ్‌లో సంఘటన జరిగిన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. బస్సు డ్రైవర్ పాచి పెంట పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాడని ఎస్పై వెంకట సురేష్ చెప్పారు. వెంటనే, అగ్రిమాపక కేంద్రానికి తెలియచేశామని, తక్షణమే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేసినట్టు తెలిపారు.

# ఇడి సమన్లు

>> చిన విషయం తెలిసిందే. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)లో జరిగిన రుణ మోసంతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో నవంబర్ 14న విచారణకు హాజరు కావాలని అనిల్ అంబానీని కోరినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అంబానీ గ్రూప్ కంపెనీలపై దర్యాప్తులో భాగంగా ఈ ఏజెన్సీ ఇటీవల రూ.7,500 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. పలు సెక్షన్ల కింద సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ రంగంలోకి దిగి విచారణ జరుపుతున్నది. అనిల్ అంబానీ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసిన ఆస్తుల్లో ఎక్కువ భాగం రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు చెందినవని తెలిపాయి. ఈ కంపెనీ ప్రస్తుతం రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని రుణదాతల కమిటీ నియంత్రణలో ఉందని గ్రూప్ పేర్కొంది.

## వారం - వర్జ్యం

07-11-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, కృష్ణ పక్షం
విదియ ఉ.11.07
రోహిణి రా.12.35, విశాఖ కార్తె
వర్జ్యం : తె.5.37-7.03
దు.ఉ.8.26-9.12, 2) మ.12.15-1.01
శుభసమయం : ఉ.5.30-6.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు. కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం. ఆస్తి తగాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**వృషభం:** అందరిలోనూ ప్రత్యేక గుర్తింపు పొందుతారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మిథునం:** రాజకీయ, పారిశ్రామిక రంగాల లోని వారికి అన్ని విధాలా ప్రోత్సాహం లభిస్తుంది. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కర్కాటకం :** ఆస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. మానసిక ప్రశాంతత పొందుతారు. ఇంటాబయటా మీదే పైచేయిగా ఉంటుంది.

**సింహం:** ఆరోగ్యం, వాహనాల విషయాలలో మెలుకువ పాటించండి. సన్నిహితుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**కన్య:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కోప తాపాలకు దూరంగా వుండండి. రాజకీయరంగాల లోని వారికి యోగ దాయకమైన కాలం.

**తుల :** కొన్ని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. శ్రమకు తగిన ఫలితం ఉండదు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**వృశ్చికం:** పాత మిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. వాహన సౌఖ్యం. ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**ధనుస్సు:** దూరపు బంధువుల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. హోదాలు, ఉన్నత పదవుల్లో ఉన్నవారితో పరిచయాలు.

**మకరం:** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఋణాలు తీరి ఉరటచెందుతారు. బంధువుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు.

**కుంభం:** భూములకు సంబంధించిన విషయాలలో నూతన నిర్ణయాలు కుదురుతాయి. ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తిచేస్తారు.

**మీనం :** పదవులు, హోదాలు లభిస్తాయి. పొదుపు పథకాలు అవలంభిస్తారు. సంఘసేవా కార్య క్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



దగదర్తిలో మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి లోకేష్

# కార్యకర్తలకు అండగా టిడిపి

## దగదర్తిలో మాలేపాటి సుబ్బానాయుడు, భానుచందర్ చిత్రపటాల వద్ద నివాలళులర్పించిన మంత్రి లోకేష్

## కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన మంత్రి

**దగదర్తి (నెల్లూరు), నవంబరు 6, ప్రభాతవార్త :** నాడు, నేడు ఎప్పుడు కార్యకర్తలకు అండగా నిలిచేది తెలుగుదేశం పార్టీనే అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం దగదర్తిలో ఇటీవల అనారోగ్యంతో మరనించిన టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన సోదరుని కుమారుడు భానుచందర్ చిత్రపటాలకు పూలదండ వేసి మంత్రి నారా లోకేష్ నివాళులర్పించారు. సుబ్బానాయుడు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ దేశంలో అనేక ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. కానీ కేవలం ఒక్క తెలుగుదేశం పార్టీకే బలమైన కార్యకర్తలు ఉన్నారు. ఆ పసుపు జెండా చూస్తేనే తెలుగుదేశం కార్యకర్తలకు ఒక ఎమోషన్. మొన్నటి మహానాడులో కూడా కార్యకర్తే మా అధినేత అని ప్రకటించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ. నాడు, నేడు ఎప్పుడూ కార్యకర్తలకు అండగా నిలబడేది తెలుగుదేశం పార్టీ. 2014లో కార్యకర్తల కోసం ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటు చేశాం. ఇప్పటికే కార్యకర్తల సంక్షేమం కోసం రూ.135 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. అంతే కాకుండా గతంలో ఫ్యాక్షన్ దాడుల్లో చనిపోయిన కార్యకర్తల పిల్లల కోసం హైదరాబాద్‌లో ఓ మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి కార్పొరేట్ విద్య అందిస్తున్నాం. అందులో చదువుకున్నవారు ప్రయోజకులుగా మారారు. నా యువగళం పాదయాత్రలో కూడా కళ్లారా చూశా. ఆనాడు ప్రభాకర్ అన్నను వారి పిల్లల ముందే నరికి చంపితే.. పిల్లలను పార్టీ చదివించింది. వారు డెలాయిట్‌లో, యాక్సెంచర్ కంపెనీల్లో పని చేసే పరిస్థితి ఉందన్నారు.

**క్రమశిక్షణ, పట్టుదలకు మారు పేరు మాలేపాటి సుబ్బానాయుడు:**

సుబ్బానాయుడు అన్న ఈరోజు మనమధ్యలేరు. క్రమశిక్షణ, పట్టుదలకు మారుపేరు సుబ్బానాయుడు. నేను ప్రత్యక్ష రాజకీయాల్లోకి 2013లో వచ్చాను. సుబ్బానాయుడు నాకు దగ్గరగా ఉండేవారు. ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుకునే వాళ్లం. మొన్న కేబినెట్ మీటింగ్‌లో ఉన్నప్పుడు సుబ్బానాయుడు అన్నకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని, ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారని సమాచారం తెలిసిన వెంటనే వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించాను. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు చెప్పాను. ఆయన్ను కోల్పోవడం చాలా బాధాకరం. భానుని కూడా తెలుగుదేశం పార్టీ కోల్పోవడం చాలా బాధాకరం. రాష్ట్రంలో నియోజకవర్గంలో బలమైన నాయకుడిని కోల్పోయాం. ఆనాడు సుబ్బానాయుడు నాయకత్వంలో మేమందరం ఆ కుటుంబానికి అండగా నిలిచాం. ఎవరి దగ్గర భూమి పత్రాలు తాకట్టు పెట్టించారో దానిని సుబ్బానాయుడు సొంత నిధులతో విడిపించారు. తర్వాత చంద్రబాబునాయుడు నియోజకవర్గానికి ఎప్పుడు వచ్చినా, ఏ కార్యక్రమం చేసినా పెద్ద ఎత్తున జయప్రదం చేసేందుకు ఒక ఇన్‌చార్జిగా ఆయన చాలా కష్టపడ్డారు. జిల్లాలో ఎక్కడ పాదయాత్ర చేసినా నాతో కలిసి నడిచారు. పది రోజులకు ఒక సారి వచ్చి పాదయాత్ర ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకునే వారు.

**సుబ్బానాయుడు కుటుంబానికి అండగా నిలిచి రాజకీయంగా పైకి తీసుకుస్తాం:**

ఇది మాకో పరీక్ష, కుటుంబానికో పరీక్ష. మాకు దేవుడు జయించే శక్తిఇచ్చాడు. సుబ్బానాయుడు కుటుంబానికి అండగా నిలబడటమే కాదు. కుటుంబాన్ని రాజకీయంగా పైకి తీసుకువచ్చే బాధ్యత తెలుగుదేశం పార్టీ తీసుకుంటుంది. జాతీయ ప్రధాన కార్యదర్శిగా నా బాధ్యతలు నిర్వర్తిస్తా. కుటుంబానికి అండగా నిలబడతాం. రాజకీయంగా పైకి తీసుకువచ్చే బాధ్యత వ్యక్తిగతంగా తాను తీసుకుంటానని చెప్పారు.

# తొలివిడత 64.66 శాతం పోలింగ్

>> నమోదయింది ఒకదశలో 1998లో కూడా ఒకసారి 64.6శాతం నమోదయింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఈసందర్భంగా ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. భారీ సంఖ్యలో పోలింగ్‌కు హాజరయి తమ ఓటుహక్కు వినియోగించుకోవాలన్న బాధ్యతతో వచ్చారని ఆయన ప్రశంసించారు. ఓటర్ల జాబితాలోనిర్వహించిన ప్రత్యేక రివిజన్ కారణంగానే ఈ పోలింగ్‌పెరిగిందని చెపుతున్నారు. ఎన్నికలకు ముందు 47 లక్షల ఓటర్లను తొలగించిన సంగతి తెలిసిందే. సర్‌కుముందు 7.89 కోట్లు ఉంటే రివిజన్ తర్వాత 7.42 కోట్లు వచ్చాయి.

తొలివిడత ఎన్నికల్లో ఎన్డీయే కూటమినుంచి జెడియు 57స్థానాలు, బిజెపి 48 స్థానాలు, ఎల్జేపీ 14, ఆర్‌ఎల్‌పీ రెండుస్థానాల్లోపోటీచేస్తోంది. ఇక మహాఘటబంధన్ నుంచి ఆర్జేడి 73 స్థానాలు, కాంగ్రెస్ 24, సిపిఐఎంఎల్ 14 మంది అభ్యర్థులు పోటీచేసారు. ప్రశాంత్‌కిశోర్ స్థాపించిన జనసురాజ్‌పార్టీనుంచి 119 మంది పోటీలో ఉన్నారు. తొలిదశలో ఆర్జెడినేత తేజస్వియాదవ్, జనశక్తి జనతాదళ్‌నేత లాల్లూ యాదవ్ పెద్దకుమారుడు తేజ్‌ప్రతాప్ యాదవ్, ఉప ముఖ్యమంత్రి బిజెపినేత సామ్రాట్‌చౌదరి తదితరులున్నారు. తొలివిడతలో 3.75 కోట్లమంది ఓటుహక్కు వినియోగించుకోగా మొత్తం 1314 మంది అభ్యర్థులు బరిలోనిలిచారు. మొత్తం 45,341 పోలింగ్‌కేంద్రాల్లో తొలివిడత పోలింగ్‌ఝరిగింది. వీటిలో 36,733 గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి.

# రెండేళ్లలో కీలక ప్రాజెక్టులు పూర్తి

>> గతిపై సంబంధిత అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్ష, సమావేశం నిర్వహించారాయన. గత 5 యేళ్ల వైఎస్సార్సీ పాలనలో ఉత్తరాంధ్రలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా, నాడు 2014-19 టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు చేపట్టిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులను సైతం జగన్ నిలిపేశాడు అని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిఎం చంద్రబాబు ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, రాబోయే రెండేళ్లలో రూ.2వేల కోట్లు పైగా ఖర్చు చేసి, కీలక ప్రాజెక్టులు పూర్తి చేయాలని సూచించారని తెలిపారు మంత్రి నిమ్మల రామానాయుడు. బిఆర్ఆర్ వంశధార, తోటపల్లి, వంశధారనాగావళి లింక్, జంఝావతి రిజర్వాయర్, హిరమండలం లిఫ్ట్, నాగావళి చంపావతి, మహేంద్ర తనయ, తారకరామతీర్థసాగర్, మద్దువలస రిజర్వాయర్, వంటి కీలకమైన ప్రాజెక్టులను పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం అని అన్నారు.

ఈ 9 ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా గుర్తించి, ఆయా ప్రాజెక్టుల పనులతో పాటు, ఆర్అండ్ఆర్ మరియు మిగిలిన పనులపై సైతం ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు మంత్రి నిమ్మల రామానాయుడు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా ఉత్తరాంధ్రలో 1.24 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి రావడంతో పాటు, మరో 2.48లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమోతుంది అని గుర్తించామన్నారు. ఇలా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగులోకి తీసుకురావడంతో పాటు, కరువుప్రాంతాలకు ప్రయోజనం కల్గించే ఈ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు సిఇ, ఎస్ఇలు, ఇఇలు మరియు ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉల్లి రైతులకు ఆందోళన వద్దు

>> ఉల్లి కొనుగోలు ఒక్కటే రైతులుని ఆదుకోలేదని సీఎం చంద్రబాబు గ్రహించి గతంలో ఏ ప్రభుత్వం తీసుకోనటువంటి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని ప్రతి హెక్టారుకు 50 వేలు అందచేయాలని నిర్ణయించారని, దీనితో వేలాది మంది ముఖ్యంగా కర్నూలు,కడప రైతులు పంట పాడై భారీ నష్టాల బారిన పడకుండా ప్రభుత్వం ముందుగానే చర్యలు తీసుకుందని వివరించారు. ఈ నిర్ణయంతో కర్నూలు జిల్లాలో 15232 హెక్టార్లలో, 23316 మంది రైతులకు 76.16 కోట్లు, కడప జిల్లాలో 5681 హెక్టార్లలో, 6400 మంది రైతులకు 28.41 కోట్లు మొత్తంగా 20,913 హెక్టార్లలో, 29,716 మంది రైతులకు ..104.57 కోట్ల రూపాయల లబ్ధి పొందబోతున్నారని, త్వరలోనే డబ్బులను రైతులకు అందచేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఉల్లి పంటకు సంబంధించిన సమస్యలను ఆయా జిల్లాలో ప్రత్యేకంగా మానిటర్ చేయడానికి ప్రక్రియ మొదలుపెట్టామని అన్నారు. ఉల్లి రైతులు ధైర్యంగా ఉండాలి. మీ సమస్యలు మా సమస్యలే. పంటకు తగిన రక్షణ, సరైన ధర కల్పించేందుకు ప్రభుత్వం మీతో ఉంది అని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

2020లో వైఎస్సార్సీ ప్రభుత్వం ఉల్లి ధర పడిపోయినప్పుడు కేవలం క్వింటాకు ..770 మద్దతు ధర ప్రకటించి రైతులు దగ్గర ఉల్లి కొనుగోలు చేయకుండా మోసం చేశారు అని మంత్రి విమర్శించారు. గత ప్రభుత్వం క్వింటాకు 770 రూపాయలు నిర్ణయిస్తే , రైతుల శ్రేయస్సు కోసం సిఎం చంద్రబాబు ప్రత్యేక నిర్ణయంతో క్వింటాకు ..1200 పెట్టి మార్క్‌ఫెడ్ ద్వారా భారీగా కొనుగోలు జరిపించారని అది సరిపోదని హెక్టార్‌కి రూ.50,000 సహాయంగా ఇస్తున్నాము అని మంత్రి గుర్తుచేశారు.

# ఇక 'వన్ విజన్.. వన్ డైరెక్షన్'

>> అన్నారు. ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి ఆయా శాఖలకు అప్పగిస్తున్నామని అన్నారు. అంగన్‌వాడీల స్థాయి నుంచే విద్యార్థుల డేటా అనుసంధానం కావాలని అన్నారు.అవేర్ ద్వారా విస్తృతమైన డేటాను సమన్వయం చేసుకుని వేగంగా నిర్ణయాలు తీసుకోవాలి అన్నారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన సమాచారం ఒక్క చోటే క్రోడీకరించి నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కల్పిస్తున్నాం అన్నారు. ఈ డేటా ద్వారా రియల్ టైమ్‌లోనే అనలటిక్స్ చేసి వాటి ద్వారా తక్షణ నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఉందన్నారు. ప్రిడిక్టివ్ అనలటిక్స్‌కు కూడా టెక్నాలజీ ద్వారా సాధ్యం అవుతోంది అన్నారు. గతంలో ఒక్క చదువుకే కులం, స్థానికత, ఆదాయం ఇలా వేర్వేరు ధృవపత్రాలు 10 రోజులు ఆఫీసుల చుట్టూ తిరిగి తీసుకోవాల్సి వచ్చేదన్నారు.ఈ పరిస్థితి అంతా మారిపోవాలి, కేంద్రం తీసుకొచ్చిన డిజి లాకర్‌ను సమర్ధంగా వినియోగించాలన్నారు. ఇటీవల జరిగిన బస్సు ప్రమాదాల వల్ల చాలా ప్రాణాలు పోయాయి అన్నారు,శ్రీకాకుళంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాటి ప్రమాదం జరిగిందన్నారు. ఒక సంఘటన తర్వాత ఆయా తప్పులు దిద్దుకోవాల్సి ఉందన్నారు.ఓఎస్ఓపీ ఉన్నా దానిని ఎందుకు పాటించలేకపోతున్నామన్నారు.పీపుల్స్ పాజిటివ్ పర్సెప్షన్ కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి,.గత పాలకుల హయాంలో ఎక్సైజ్ లో తీవ్రమైన అవకతవకలు జరిగాయన్నారు.వాటన్నిటినీ సరిచేస్తుంటే మళ్లీ మనపై బ్లేమ్ గేమ్ వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్నారు.పారదర్శకత పాటించటంతో పాటు దానిని ప్రజలకు కూడా సరిగ్గా చెప్పుకోవాలి పోలీసు విభాగానికి సంబంధించిన వివరాలు కూడా డేటా లేక్‌కు అనుసంధానం కావాలి అన్నారు. దానికి అనుగుణంగానే నిర్ణయాలు వేగంగా తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, పట్టణాల్లో వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. వాటిలో ఒక్కో దాంట్లో పదమూడు మంది సిబ్బందిని నియమించారు. పంచాయతీ కార్యాలయాలు చేయాల్సిన పనులన్నీ గ్రామ, వార్డు సచివాలయాలు చేయడం ప్రారంభించాయి. అదే సమయంలో సిబ్బందికి పని ఉండటం కష్టమయింది. నియామకాలపైనా ఎన్నో వివాదాలు వచ్చాయన్నారు. ప్రభుత్వం మారినతరవాత సచివాలయ ఉద్యోగుల్ని ఎక్కువగాఎలా ఉపయోగించుకోవాలన్నదానిపై కసరత్తు జరిపామన్నారు. వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తూ వస్తున్నారు. కొంత మందితో పెన్షన్ల పంపిణీ చేయిస్తున్నారు. మిగిలిన వారికి కొత్త బాధ్యతలు అప్పగించాలని.. మొత్తం వ్యవస్థను సంస్కరించాలని నిర్ణయించారు. అందుకే విజన్ యూనిట్స్ గా మార్చాలని నిర్ణయించారు.

ఆర్టీజీఎస్ సమాచారం మేరకు వేగంగా నిర్ణయాలు తీసుకోవాలి. రియల్‌టైమ్ గవర్నెన్స్‌లో పౌరుల డేటా పొందుపరిచాం. పింఛన్లు సహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల డేటా పొందుపరిచాం. అంగన్వాడీల్లోకి ఎంతమంది పిల్లలు వస్తున్నారో తెలుస్తుంది. పాఠశాలలు, రోడ్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మొత్తాన్నీ పొందుపరిచాం. వాతావరణ సమాచారం కోసం అవేర్ వెబ్‌సైట్ తీసుకువచ్చాం. 42 విభాగాల్లో డేటా మొత్తం అందుబాటులోకి తెచ్చాం. డేటా లేక్‌లో అన్ని విభాగాల డేటా తెలుసుకోవచ్చు అని చంద్రబాబు తెలిపారు. నీటి వనరుల విషయంలోనూ రియల్ టైమ్‌లోనే నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం. రీఛార్జి చేయటంతో పాటు భూగర్భజలాలను పెంచుకుంటే కరవు అనే పరిస్థితే ఉండదు. ఉచిత విద్యుత్ నిమిత్తం రైతులకు రూ.9 వేల కోట్ల సబ్సీడీ ఇస్తున్నాం. భూగర్భజలాలు పెరిగితే విద్యుత్ వినియోగం తగ్గి రూ.4500 కోట్ల వ్యయం తగ్గించుకోవచ్చు. అలాగే వైద్యారోగ్య శాఖలోనూ వనరుల సమర్ధ నిర్వహణ ద్వారా ప్రిడిక్టివ్ అనాలసిస్ ద్వారా వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకునే అవకాశం ఉంది. భూ సంబంధిత వ్యవహారాల్లో లిటిగేషన్లు పెరుగుతున్నాయి. ఉన్నతాధికారులు సైతం కోర్టుకు వెళ్లే పరిస్థితులు వస్తున్నాయి. ఎఐ వాడితే జీవోల ద్వారా లిటిగేషన్లు రాకుండా నివారించవచ్చు. బాధ్యతగా పనిచేస్తూ ముందుకెళ్దాం. రాష్ట్ర అభివృద్ధి, విజన్ లక్ష్యాల సాధనలో అన్ని శాఖలూ సమన్వయంగా పనిచేయాలి. రాష్ట్ర స్థూల ఉత్పత్తిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ముందుకు సాగాలి. సామాజిక, శాంతిభద్రతల ఇండికేటర్లు కూడా విశ్లేషించి తగిన నిర్ణయాలు తీసుకోవాలి అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. టెక్నాలజీని వినియోగించుకుని... విశ్లేషణలు చేసుకోవడం ద్వారా జీఎస్టీ వసూళ్లు గణనీయంగా పెరిగాయని అధికారులు వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఎగవేతలు లేకుండా పర్యవేక్షణ చేస్తున్నామ్నని వెల్లడించారు. ఇక ఈవేబిల్స్ ద్వారా ఎక్కడా ఎగవేతలు లేకుండా చూస్తున్నామని... రెవెన్యూ లాస్ లేకుండా సిసి కెమెరాలు వినియోగిస్తున్నామని చెప్పారు. గడచిన 25 రోజులుగా సురక్షా యాప్ స్కాన్ చేస్తూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు వివరించారు. ఇప్పటి వరకూ ఒక్క నకిలీ బాటిల్ కూడా లభ్యం కాలేదని చెప్పారు. మద్యం కొనుగోళ్లు చేసే సమయంలో యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకోవాలనే అంశాన్ని మరింతగా ప్రచారం చేస్తామని అధికారులు సిఎంకు వివరించారు. మైనింగ్ ఆదాయం మరింతగా వృద్ధి చేసుకునే విషయంలో టెక్నాలజీని అనుసంధానిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

# 'పరకామణి'పై వడివడిగా దర్యాప్తు

>> రామ్‌కుమార్‌ను వెంటబెట్టుకుని సిఐడి డిజి అవసరమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. లోక్‌అదాలత్‌లో మధ్యవర్తిత్వం, రాజీచేసుకోవడం వరకు సమగ్రంగా సమాచారం తెలుసుకున్నారు. అంతేగాక తిరుమలలోనే ఫిర్యాదిదారుడు శ్రీనివాసులును కూడా పిలిపించుకుని చోరీ కేసు విషయం ఎలా తెలిసింది, రాజీచేసుకోవడం వెనుక ఉన్న మతలబుఏంటి అనే విషయాలు రాబట్టినట్లు సమాచారం. తిరుమల,తిరుపతిలో ఐదు బృందాలు తొలిరోజు గురువారం రాత్రి వరకు పూర్తిగా నిమగ్నమయ్యారు. రవికుమార్‌కు సంబంధించి ఉన్న రికార్డుల మేరకు తిరుపతి, హైదరాబాద్, తమిళనాడు,కర్ణాటకలో 50కోట్లరూపాయలకుపైగా విలువైన ఆస్తులున్నట్లు సమాచారం రాబట్టారు. పరకామణిలో కొందరి సిబ్బంది విధుల విషయంలో పర్యవేక్షణ లోపం ఉందనేది స్పష్టంగా తెలుస్తోందని డిజి వ్యాఖ్యానించడం విశేషం. అన్ని కోణాల్లో దర్యాప్తు మొదలుపెట్టామని, డిసెంబర్ 2వతేదీకి హైకోర్టుకు నివేదిక సమర్పిస్తామని డిజి రవిశంకర్‌అయ్యన్నార్ మీడియాకు తెలిపారు. ఈ కేసులో విచారణ, దర్యాప్తుపై ఊహాగానాలు వద్దని, మరింతగా సమాచారం హైకోర్టుకు అందజేస్తామన్నారు. అయితే రవికుమార్ విషయంలో సహకరించిన విజిలెన్స్, టిటిడి పెద్దలు, గత అధికారులు, పోలీస్ అధికారుల పాత్రపై కూడా లోతుగా దర్యాప్తు జరుగుతుందని చెప్పారు.

మూడుసంవత్సరా క్రిందట జరిగిన ఈ చోరీ కేసులో తిరుమల వన్‌టౌన్ పోలీస్‌లు ఎఫ్ఐఆర్ చేయడం, ఆ తరువాత నిందితుడైన సివి రవికుమార్‌ను విచారణ చేయకపోవడం,గత టిటిడి బోర్డు పెద్దలు, ఉన్నతాధికారులు, పోలీస్ అధికారులు 2023 సెప్టెంబర్‌లో లోక్‌అదాలత్‌ద్వారా రాజీచేయడం, నిందితుడినుండి ఆస్తులను శ్రీవారికి కానుకగా ఇప్పించడం వంటివి జరిగిపోయాయి. వీటన్నిటిపై కొందరు పెద్దలు లబ్ధిపొందారనే ఆధారాలతో శ్రీనివాసులు అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించడంతో ఇప్పుడు మళ్లీ దర్యాప్తు మొదటికొచ్చింది. తిరుమల పెద్దజీయర్ మఠంలో గుమస్తా అయిన రవికుమార్ 1985వ సంవత్సరం నుండి విధుల్లో ఉన్నాడు. పరకామణిలో ఆయన లెక్కలు రాసేవాడని టిటిడి సమాచారం. 2023 ఏప్రిల్‌లో 920 అమెరికన్ డాలర్లు చోరీ చేస్తూ అప్పట్లోనే విజిలెన్స్ ఏవిఎస్ఒకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడటం పెద్ద సంచలనంగా మారింది.ఇప్పుడు సిఐడి అధికారుల బృందం వారంరోజుల్లోనే మరింత సమాచారం సేకరించనుందనేది స్పష్టమవుతోంది.

**పరకామణి కేసు వివాదం ఎందరి మెడకో!? :**

భక్తులు మొక్కుబడుల్లో భాగంగా కానుకలుగా హుండీకి సమర్పించుకునే కరెన్సీ నోట్లు,నాణేలు వేరుచేసి లెక్కించే పరకామణిలో 2023లో జరిగిన చోరీ ఉదంతం, తదనంతరం పరిణామాలు సిఐడి రాకతో ఇప్పుడు ఎందరి మెడకు చుట్టుకోనుందనేది ఆందోళన సర్వత్రా మొదలైంది.

ఈ వ్యవహారంలో తొలినుండి అటు టిటిడి విజిలెన్స్, గత టిటిడి బోర్డుపెద్దలు, టిటిడి ఉన్నతాధికారి, కొందరు పోలీసు అధికారులు కలసి క్రిమినల్ కేసును లోక్‌అదాలత్‌లో మధ్యవర్తిత్వం జరిపి రాజీకుదుర్చడం వెనుక పెద్ద తతంగమనే నడిచిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు వందకోట్లరూపాయలుపైగానే పరకామణిలోనుండి అమెరికా విదేశీ డాలర్లు చోరీ చేసి అక్రమంగా ఆస్తులు కూడగట్టినట్లు ఆరోపణలు వినిపించడం, ఇందులో కేవలం 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను నేరస్తుడి నుండి వేంకటేశ్వరస్వామికి విరాళంగా అందించినా, వాటి విలువ మార్కెట్లో 40కోట్లు చేస్తుందని సిఐడి డిజి మీడియాకు వెల్లడించడం విశేషం. దేవుని సోమ్ము కాజేసిన రవికుమార్‌కు వత్తాసు పలికిన గత టిటిడి వర్గాలు, పోలీసు అధికారులపై వేటు తప్పదా? అనేది అందరిలోనూ ఉత్కంఠరేపుతోంది.

# రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం: సిఎస్



గ్రీన్ హైడ్రోజన్ అడ్వైజరీ కమిటి సమావేశంలో మాట్లాడుతున్న ఏపిసిఎస్ విజయానంద్

**సచివాలయం,నవంబర్ 6,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్ గా తీర్చిదిద్దేందుకు శరవేగంగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెపా ్పరు.ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలి అడ్వైజరీ బోర్డు మొదటి సమావేశం గురువారం ఏపి సచివాలయంలో జరిగింది.ఈ సమావేశంలో ఏపిలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ప్రభుత్వ తీసుకుంటున్న చర్యలు అందుకు సంబంధించి చేపట్టిన ప్రాజెక్టులు తదితర అంశాలపై ఈ అడ్వైజరీ కమిటి చర్చించింది.ముఖ్యంగా 2030నాటికి ఏపిని గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో భారతదేశాన్ని అగ్రగామిగా చేయాలనే లక్ష్యంతో ఏపి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్ ప్రకటించడంతో పాటు ప్రత్యేకంగా ఒక అడ్వైజరీ కమిటీని కూడా ఏర్పాటు చేయడం జరిగింది.2027నాటికి 2గిగావాట్ ఎలెక్ట్రోలైజర్ తయారీ సామర్ధ్యం ఏర్పరచడం,2029నాటికి సుమారు 1.5మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యంతో పనిచేయడం జరుగుతోంది.ఈ సందర్భంగా నీతి ఆయోగ్ సభ్యులు మరియు ఏపి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డాక్టర్ వి.కె.సరస్వత్ మాట్లాడుతూ ఏపి బయోమాస్ విషయంలో దేశంలో మొదటి స్థానంలో ఉందన్నారు.గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి బయోమాస్ ఎంతో ఉపయోగపడుతుందని తద్వారా రైతుల ఆదాయం పెరగడంతోపాటు ఉపాధి అవకాశాలు కూడా మరింత పెరుగుతాయని పేర్కొన్నారు.గ్రీన్ హైడ్రోజన్ ను స్థానికంగా గల స్టీల్ ప్లాంట్లు,ఎరువుల తయారీ పరిశ్రమలు,ఓడరేవులు పెద ్దఎత్తున వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.గ్రీన్ హైడ్రోజన్ వినియోగించే పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం కూడా నేషనల్ హైడ్రోజన్ మిషన్ కింద తగిన ప్రోత్సాహకాలను అందించేందుకు సిద్దంగా ఉందన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ఏపి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ అడ్వయిజరీ బోర్డు కో చైర మ్రన్ కె.విజయానంద్ మాట్లాడుతూ ఏపిని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్ ను చేయడం జరిగిందని తెలిపారు.ఏపిలో సోలార్, విండ్,పంప్డ్ ఎనర్జీ స్టోరేజీకి పుష ్కలంగా అవకాశాలు ఉన్నాయని వివరించారు.అదేవిధంగా 974కిమీ ల సుదూర సముద్రతీరాన్ని కలిగి ఉండడం కూడా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఒక మంచి అవకాశంగా పేర్కొన్నారు.ఇప్పటికే కరూ ్నల్లో ఒక గిగావాట్ సామర్ధ్యంతో కూడిన పంప్డ్ సో ్టరేజీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ద్వారా విశాఖపట ్నం సమీపంలోని "పూడిమడక" వద్ద హైడ్రోజన్ హబ్ రూపొందించబడుతోంది.రూ.1.85లక్షల కోట్ల పెట్టుబడితో 20 జీడబ్ల్యూ రీన్యూవబుల్ ఎనర్జీ సామర్ధ్యంతో రోజుకు సుమారు 1,500టన్నుల "గ్రీన్ హైడ్రోజన్" ఉత్పత్తికి కృషి జరుగుతోందని పేర్కొన్నారు.గ్రీన్ హైడ్రోజన్‌ను దేశీయంగా ఉత్పత్తి చేయడం ద్వారా విదేశీ దిగుమతులు తగ్గి స్థానిక వినియోగం గణనీయంగా పెరిగే అవకాశలు ఉన్నాయని తెలిపారు.అదే విధంగా రీన్యూవబుల్ ఎనర్జీ వనరులు అధికంగా ఉన్న రాష్ట్రంగా ఏపికి మరింత గుర్తింపు వస్తుందని సిఎస్ విజయానంద్ పేర్కొన్నారు. ఏపి గ్రీన్ కో ఎయం డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ కాకినాడలో ఎన్ఎఫ్సీఎల్ ఎరువుల కర్మాగారాన్ని 1 మిలియన్ టన్నుల అమోనియా ప్లాంట్‌గా కన్వర్ట్ చేయడం జరిగిందని తెలిపారు.అదే విధంగా కాకినాడ కేంద్రంగా గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు.ఈనెల 14,15తేదీల్లో విశాఖలో జరిగే సిఐఐ సదస్సులో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి సంబంధించి కొన్ని ఎంఓయులు జరగనున్నట్లు చెప్పారు.

అంతకుముందు ఎపి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్ దాని రోడ్ మ్యాప్ (2025-29) గురించి మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ డి.నారాయణరావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఇంధన ఉత్పత్తికి గల అవకాశాలు తదితర అంశాలను వివరించారు.సమావేశంలో అడ్వైజరీ బోర్డు సభ్యులు డాక్టర్ ఆర్కే మల్హోత్రా ,డాక్టర్ ఆశిస్ లెలే, సుజిత్ పిల్లై,జెకె శ్రీవాస్తవ,తదితరులు హైడ్రోజన్ ఇంధన ఉత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

ఇంకా ఈ సమావేశంలో న్యూరెన్యూవల్‌ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఏపి (నెరెడ్‌క్యాప్) విసి అండ్ ఎండి డాక్టర్ కమలాకర్‌బాబు,రాష్ట్ర ఐ అండ్ ఐ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్,డిఎంఆర్ పాండా తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఎస్ఎఇఎల్ రూ.22వేల కోట్ల పెట్టుబడులు

### భాగస్వామ్య సదస్సులో ఎంఒయూ కుదుర్చుకోనున్నట్లు వెల్లడి

**విజయవాడ,నవంబరు 6,ప్రభాత వార్తప్రతినిధి:** రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్తు, బయోమాస్,డేటా సెంటర్లు,పోర్టుల రంగాల్లో రూ.22వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రత్యక్షంగా 7వేల మందికి,పరోక్షంగా 70వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. విశాఖలో ఈ నెల 14,15 తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సులో ప్రభుత్వంతో పెట్టుబడుల ప్రతిపాదనలపై ఒప్పందన్ని కుదుర్చుకోనున్నట్లు తెలిపింది. ఎట్టుబడుల ప్రతిపాదనలు. మేరకు కడప, కర్నూలు జిల్లాల్లో 1,750 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి సిస్టం(బెస్) ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రతిపాదన ఉంది. ఎన్‌హెచ్‌పీసీ,సెకి లింక్డ్ టెండర్లలో వాటిని సంస్థ దక్కించుకుంది. ఒక్కొక్కటి 25 మెగావాట్ల సామర్థ్యంతో 8 బయోమాస్ ప్లాంట్ల ఏర్పాటు.వాటి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు. రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న డిజిటల్ అవకాశాలు వినియోగించుకొని రూ.3వేల కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు మారిటైం రంగంలో లాజిస్టిక్స్‌ను బలోపేతం చేసేందుకు రూ.4వేల కోట్ల పెట్టుబడితో పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటారు.

## వీరేపల్లి వద్ద రోడ్డు ప్రమాదం - డ్రైవర్ మృతి

**ఉలవపాడు (నెల్లూరు), నవంబర్ 6, ప్రభాతవార్త :** కావలి వెళ్తున్న పాల వ్యాను ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో పాల వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం ఉలవపాడులోని వీరేపల్లి జాతీయ రహదారి వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే. సంతమాగులూరు నుంచి కావలికి వెళ్తున్న పాలు వ్యాను వీరేపల్లి వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న లారీని వెనకవైపు నుంచి ఢీకొట్టింది. ఈ సంఘటనలో డ్రైవర్ మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పాల వ్యాన్ లో ఇరుక్కుపోయిన మహేష్ ను స్థానిక పోలీసులు బయటకు తీసి ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పజెప్పారు. జరిగిన ప్రమాదంపై ఎస్సై అంకమ్మ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## రెడ్‌క్రాస్, మనోబంధు సేవలు ప్రశంసనీయం: కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,నవంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏ ఒక్క మానసిక రోగీ నిరాశ్రయులుగా రోడ్లపై ఉండకూడదని.. అందరూ సురక్షి తంగా ఆసుపత్రుల్లో లేదా షెల్టర్ హోమ్స్‌లో ఉండాలనే లక్ష ్యంతో రెడ్‌క్రాస్‌సొసైటీ, మనోబంధు సంస్థలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీ ్మశ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీ ్మశ.. రెడ్‌క్రాస్ సొసైటీ, మనోబంధు ఫౌండేషన్ ప్రతినిధులు, అధికారులతో కలిసి మానసిక ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీ ్మశ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని.. ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలను సమాజం సానుకూల దృక్పథంతో చూడాలని.. బాధితులను ఆదరించడం, వినడం, ప్రోత్సహించడం

## అమరావతి ఔటర్‌రింగ్ రోడ్ నిర్మాణంలో ప్రభుత్వం కీలక అడుగు

### - భూ సేకరణ ప్రక్రియకు పల్నాడు జిల్లాలో గ్రామాలు, సర్వే నెంబర్లతో గెజిట్ ప్రచురించిన కేంద్రం - నెలాఖరులోపు మిగిలిన 5 జిల్లాల గెజిట్

**విజయవాడ,నవంబరు 6,ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్) నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. జిల్లాల వారీగా భూ సేకరణకు కేంద్రం గెజిట్‌లు ప్రచురిస్తోంది. తొలుత పల్నాడు జిల్లా లోని ఆయా మండలాలు,గ్రామాలు,సర్వే నెంబర్లు, రైతుల పేర్లతో గెజిట్‌ను ప్రచురించింది. ఓఆర్‌ఆర్ ప్రాజెక్ట్‌కు భూసేకరణ చేయనున్నామని, ఆయా సర్వే నెంబర్లలో భూమి అవసరమవుతుందని తెలిపేలా గెజిల్ నోటిఫికేషన్ (3ఏ)లో పేర్కొంది. పల్నాడు జిల్లాలోని 2 మండలాల్లోని 12 గ్రామాల పరిధిలో చేపట్టబోయే భూసేకరణకు సంబంధించిన వివరాలు అందులో ఉన్నాయి. జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు ఒకటి,రెండు రోజుల్లో గెజిట్ ప్రకటన రూపంలో పత్రికల్లో ఇవ్వనున్నారు. కలెక్టర్,ఆర్డీఓ,తహసీల్దారు కార్యాలయాల్లోనూ కాపీలను అందుబాటులోకి తేనున్నారు. అభ్యంతరాలు ఉంటే 21 రోజుల్లో భూసేకరణ అధికారికి తెలియచేస్తే పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నారు. నెలాఖరులోపు మిగిలిన జిల్లాల్లో భూసేకరణ చేస్తారు,. అమరావతి ఓఆర్‌ఆర్ 6 వరుసలతో 190 కి.మీ నిర్మించనున్నారు. ఓఆర్‌ఆర్‌లో తెనాలి సమీపం లోని నందివెలుగు నుంచి చెన్నై-కోల్‌కత్తా హైవేలో కాజా వరకు 17.5 కి.మీ ఓ లింక్ రోడ్డు,నారా కోడూరు నుంచి గుంటూరు శివారు లోని బుడంపాడు వరకు 5.5 కి.మీ మరో లింక్ రోడ్డు నిర్మిస్తాఇందుకు ఎన్టీఆర్,ఏలూరు,కృష్ణా, గుంటూరు,పల్నాడు జిల్లాల పరిధిలోని 23 మండలాల్లోని 121 గ్రామాల్లో భూసేకరణ చేయనున్నారు. ప్రస్తుతం పల్నాడు జిల్లా గెజిట్ రాగా...ఏలూరు జిల్లాది ఈ వారంలో,మిగిలిన జిల్లాలవి ఈ నెలాఖరు లోపు ప్రచురణ కానున్నాయి.గెజిట్‌లో గ్రామాల పేర్లు,సర్వే నెంబర్లు,రైతుల పేర్లు ఉంటాయి.

సపె సర్వే నెంబరులో ఎంత విస్తీర్ణం సేకరిస్తారనేది మాత్రం క్షేత్రస్థాయిలో సర్వే చేసి, పెగ్ మార్కింగ్ వేశాక తేలనుంది.

ఆ వివరాలతోనే 3డి నోటిఫికేషన్ జారీ చేస్తారు. కేంద్రం అమరావతి ఓఆర్‌ఆర్ ప్రాజెక్ట్‌కు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చిన తర్వాత...3డి నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

## జల్‌జీవన్ మిషన్‌లో పెండింగ్ పనులకు రూ.10 వేల కోట్ల రుణం


### - మూడు దశల్లో రుణం విడుదలకు ప్రాథమిక అంగీకారం

**విజయవాడ,నవంబరు 6,పభాతవార్త ప్రతినిధి:** గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల ద్వారా మంచినీటిని అందించేందుకు చేపట్టిన జలజీవన్ మిషన్(జేజేఎం)లో పెండింగ్ పనుల పూర్తికి జాతీయ ఆర్థిక,మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంకు(ఎన్ఏబీఎఫ్ఐడీ) నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్ల రుణం తీసుకోనుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే రెండు సార్లు బ్యాంకు ప్రతినిధులతో చర్చించారు. మూడు విడతల్లో రుణాన్ని విడుదల చేసేందుకు బ్యాంకు ప్రాథమికంగా అంగీకరించింది. బ్యాంకు సాంకేతిక కమిటీ పరిశీలనలో ప్రభుత్వ ప్రతిపాదనలు ఉన్నాయి. పాలకమండలి ఆమోదం తర్వాత తొలి విడత రుణం నెలాఖరులో విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.జలజీవన్ మిషన్‌లో కేంద్ర ప్రభుత్వం మొదట ఆమోదించిన రూ.27వేల కోట్ల ప్రాజెక్టును పూర్తి చేయడంలో వైకాపా ప్రభుత్వం విఫలమైంది. రాష్ట్రప్రభుత్వ వాటా నిధులు సరిగా కేటాయించకపోవడంతో 2019-24 మధ్య రూ.4వేల కోట్లకు మించి వినియోగించుకోలేకపోయింది. పనులు కూడా అరకొరగా చేపట్టిన కారణంగా కుళాయి కనెక్షన్లు అనేక ప్రాంతాల్లో అలంకారప్రాయంగా మిగిలిపోయాయి.ఈ పథకంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పెండింగ్ లోని రూ.23 వేల కోట్ల విలువైన పనులు పూర్తి చేసి ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేలా యత్నిస్తోంది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద సమకూర్చాల్సిన రూ.10వేల కోట్లను బ్యాంకు నుంచి రుణంగా తీసుకుంటోంది. మరో రూ.13వేల కోట్లను కేంద్రం సమకూర్చనుంది.పెండింగ్ లోని పనులు వచ్చే రెండు మూడేళ్ళలో పూర్తి చేసి మిగిలిన 25 లక్షలకు పైగా ఇళ్ళకు కుళాయి కనెక్షన్లు జారీ చేయాలని ప్రభుత్వ భావిస్తోంది.

## పరిశ్రమల స్థాపనకు మంచి అవకాశాలున్న ఆలోచనలను గుర్తించేందుకు అవుట్ రీచ్ కార్యక్రమం

**విజయవాడ,నవంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యాపారం, వాణిజ్యం పరంగా పరిశ్రమల స్థాపనకు మంచి అవకాశాలున్న ఆలోచనలను గుర్తించేందుకు అవుట్ రీచ్ కార్యక్రమాలను నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు డాక్టర్ జి. లక్ష్మీ ్మశ సూచించారు.ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ విజయవాడ నగరంలోని ఎనికేపాడులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్) స్పోక్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. స్పోక్ ద్వారా కొనసాగుతున్న ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్ కార్యక్రమాలను సమీక్షి ంచారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్యూచర్ ఫౌండర్స్ (ప్రీఇంక్యుబేషన్ ప్రోగ్రామ్), లీడర్స్ లెన్స్ కార్యక్రమాల గురించి స్పోక్ బృందం కలెక్టర్ లక్ష్మీ ్మశకు వివరించింది. ప్రారంభ దశ వ్యవ స్థాపకులు, స్థానిక వ్యాపారాలను శక్తివంతం చేయడం లక్ష ్యంగా త్వరలో ప్రారంభించనున్న స్పార్క్ (ఎక్స్‌ప్లోరేషన్ ప్రోగ్రామ్), రైజ్‌అప్ ఎంఎస్ఎంఈ ప్రోగ్రామ్ గురించి కూడా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త

## బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌పోటీల్లో మొదటి స్థానం కైవసం చేసుకున్న ఈస్ట్ గోదావరి, కృష్ణా జిల్లాలు



**తిరుపతి క్రీడ, నవంబర్ 6, ప్రభాతవార్త** బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 17 బాల బాలికల పోటీల్లో ఈస్ట్ గోదావరి, కృష్ణా జిల్లాలు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. 13 జిల్లాల నుంచి 130 మంది క్రీడాకారులు, 26 మంది కోచ్, మేనేజర్‌లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. ఈ 13 జిల్లాల్లో గెలుపొందిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ బాలురు, బాలికల విభాగంలో ఎంపిక చేసారు. ఈ ఎంపిక అయిన క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున వచ్చే నెల డిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారు. టీమ్ ఈవెంట్‌లో బాలురు వెస్ట్ గోదావరికి చెందిన ఎస్. హేమంత్ శ్రీ, అన్నమయ్య జిల్లాకు చెందిన జి. సాయి వేదవ్యాస్ వర్మ, కాకినాడకు చెందిన వి. హరికృష్ణ, డా. బిఆర్ అంబేద్కర్ కోనసీమ బి. అభిషేక్, గౌతమ్ కుమార్, బాలికలు కృష్ణా జిల్లాకు చెందిన తేజశ్విని, తన్వి, వాశ్విత్ సాయి, నెల్లూరు జిల్లాకు చెందిన సుష్మ రెడ్డిలు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలు తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శిలు కిషోర్, భార్గవి ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా అన్నమయ్య జిల్లా సెక్రటరీ నాగారాజు, చిత్తూరు జిల్లా సెక్రటరీ బాబు పాల్గొన్నారు. అలాగే చిత్తూరఉ జిల్లా బ్యాట్‌మెంటన్ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్, వెంకటముని, సతీష్, అపర్ణ, ప్రభాకర్, వెంకటేశ్, నందా, జయచంద్ర, తేజ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వసతి గృహాల విద్యార్థులకు నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్

### ఎన్‌టిఆర్ జిల్లా డిసిఒ ఎ.మురళీకృష్ణ

**విజయవాడ,నవంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్, ఏపీ టీడబ్ల్యూఆర్, ఎస్‌డబ్ల్యూ, టీబ్ల్యూ గురుకులాలు, వసతి గృహాల్లో ఇంటర్మీడియెట్ చదివి, నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డీసీవో ఎ.మురళీకృష్ణ ప్రకటనలో తెలిపారు.

## శాస్త్రీయ కులగణన చేసి, చట్టబద్ధ బిసి రిజర్వేషన్లివ్వాలి :కేసన శంకరరావు

**విజయవాడ, నవంబర్ 6, ప్రభాతవార్త** రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయంగా కులగణన చేసి బిసిలకు చట్టబద్దంగా రావాల్సిన రిజర్వేషన్లు అందించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. విజయవాడలో బిసి ల సమస్యలపై సమగ్ర చర్చ కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానమైన 33శాతం బిసిల రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి రాజ్యాంగబద్ధంగా ఆటంకాలు రాకుండా కులగణన సమగ్రంగా చేయాలన్నారు. సుప్రీంకోర్ట్ పరిమితి అధిగమించడానికి బిసిలకు 50శాతం రిజర్వేషన్లిచ్చేలా మరోచట్టం చేయాలన్నారు. కేంద్రంలో బిసిలకు ప్రత్యేకమంత్రిత్వ శాఖ ఏర్పాటు, ఓబిసి సబ్‌ప్లాన్ రూపకల్పనతో పాటు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, మహిళాబిల్లు సవరించి ఓబిసి మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని, చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లివ్వాలని, ఎన్నికల వాగ్దానం మేరకు 50 ఏళ్లకు బిసిలకు పెన్షన్లివ్వాలని, ఓబిసి రిజర్వేషన్ల అమలుకు ఆటంకంగా వున్న క్రిమిలేయర్‌ను ఎత్తేయాలన్నారు. కార్యక్రమంలో బిసి నేతలు కుమ్మరి కొంగు మారేడి, సాము మహేశ్వరరావు, చిప్పాది చింగారు తదితరులు పాల్గొన్నారు



మీడియాతో మాట్లాడుతున్న కేశన శంకరరావు

# తిరుమల సమాచారం

## పద్మావతిదేవికి సారె - ప్రయోగాత్మక పరిశీలన



**తిరుమల,నవంబర్ 6ప్రభాత వార్తప్రతినిధి:** తిరుమలేశుని బ్రహ్మోత్సవాల తరహాలో దేవేరి తిరుచానూరు పద్మావతిఅమ్మవారి కార్తీకబ్రహ్మోత్సవాలను టిటిడి అత్యంత వైభవంగా నిర్వహిస్తుంది. ఈనెల 17వతేదీ నుండి 25వరకు జరగనున్న పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్స వాల్లో చివరగా పంచమీతీర్థంకు తిరుమల శ్రీవారి నుండి సారే తీసుకెళ్ళడం సాంప్రదాయం. ఇందుకు ముందుగానే టిటిడి అధికారులు సారేను అత్యంత భక్తితో,పవిత్రంగా తీసుకెళ్ళే ప్రయోగాత్మక పరిశీలన గురువారం చేపట్టారు. ఉదయం తిరుమల ఆలయియం నుండి పట్టువస్త్రాలు, పసుపు,కుంకుమ, పండ్లు, గాజులు, పూలు తదితర వస్తువులతో సారేను ఏనుగులపై పెట్టుకుని వెళ్ళే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. తిరుమల నుండి తిరుపతికి చేరుకున్న సారే తిరుపతి చెన్నారెడ్డికాలనీలో వినాయకస్వామి ఆలయం నుండి తిరుపతి పురవీధుల్లో ఊరేగింపుగా తిరుచానూరు పసుపుమండపం వద్దకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, తిరుచానూరు ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్, విఆర్ శాంతి, విఎస్ఒ గిరిధర్,ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## బాధ్యతతో విధులు నిర్వహించాలి

### - లోటుపాట్లు లేకుండా రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లు - టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,నవంబర్ 6ప్రభాత వార్తప్రతినిధి:** భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఈనెల 20,21 తేదీల్లో రెండురోజులు తిరుపతి,తిరుమల ఆలయాల సందర్శనార్థం విచ్చేస్తుండటంతో ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సూచించారు. ఎక్కడా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు.రాష్ట్రపతి పర్యటన విషయంపై ఏర్పాట్లు వసతి,దర్శనం ,భద్రత పై గురువారం తిరుమల పద్మావతివిశ్రాంతి భవనంలో టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎస్వీబిసి సిఇఒ ఫణికుమార్‌నాయుడు, సిఇ సత్యనారాయణ, అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, విఎస్ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్రతో కలసి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి సమావేశం నిర్వహించారు. రాష్ట్రపతి రెండురోజుల పర్యటనతో ఎటువంటి లోపం లేకుండా, పూర్తిస్థాయిలో సమగ్ర ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు.

## కల్తీనెయ్యి అక్రమాలపై మరింత నిశితంగా సిట్ బృందం దర్యాప్తు !

### - అప్పన్న కస్టడీ పిటిషన్‌పై తేలని నిర్ణయం



**తిరుమల,నవంబర్ 6ప్రభాత వార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరాచేసిన పాత్రదారులు, సూత్రదారుల వ్యవహారంపై సిట్ అధికారులు బృందం మరింత నిశితంగా దర్యాప్తు చేస్తోందని తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో మాజీ టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు చిన్నఅప్పన్నను కటకటాల్లోకి పంపిన సిట్ అతనిని కస్టడీకి తీసుకునే విషయంపై పిటిషన్ కోర్టులో వేసేందుకు కొంతవరకు మరిన్ని ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమైందనేది సమాచారం. గురువారం కూడా గత పదినెలలుగా సేకరించిన సమాచారాన్ని, ఇప్పటివరకు అరెస్ట్‌చేసిన నిందితుల నుండి రాబట్టిన వివరాలను పరిశీలించి తదుపరి అనుసరించాల్సిన వ్యూహంపై తీవ్రంగా చర్చించిందనేది సమాచారం. కల్తీనెయ్యి సరఫరాచేసిన పాపంలో అసలు సూత్రధారులైన గత టిటిడి పెద్దల అవినీతిగుట్టు రట్టయ్యే అవకాశం కూడా ఉండటంతో సిబిఐ సిట్ అధికారులు అన్ని కోణాల్లో కార్యాచరణ సిద్దంచేసుకొంటోంది. 2022లో అప్పటి టిటిడి బోర్డు లో కొందరు అక్రమాలు భారీగానే ఉన్నాయని సిట్ అధికారులు ఆధారాలు సేకరించారు.

మరింత కీలక సమాచారం సేకరించడానికి అప్పన్నను కస్టడీకి తీసుకునే విషయంలో మరోసారి ముందుకు కదలనుంది. బోలేబాబాడెయిరీతోబాటు ఏఆర్ డెయిరీ,వైష్ణవి డెయిరీ, ప్రీమియర్‌అగ్రిఫుడ్స్‌తో ఒప్పందంతో భారీగా కమీషన్లు 50లక్షల వరకు రాబట్టారనేది సిట్ విచారణలో వెలుగుచూసిన అంశాలు. అప్పన్న బ్యాంకు లావాదేవీలోల్ల 4.50కోట్ల రూపాయలు నిల్వ ఉండటం, ఆయనపేరున కొన్ని చోట్ల 14వరకు స్థలాలు, ప్లాట్లు ఉన్నాయని సిట్ విషయాలు రాబట్టింది. కల్తీనెయ్యి బాగోతంలో ముందుముందు ఎవరికి నోటీసులు వెళ్తాయో,ఎవరిని విచారణకు పిలిచి చర్యలు తీసుకుంటారనేది అందరిలో ఉత్కంఠే.

## శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల,నవంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీక మాసంలో గురువారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం మనస్సు ఆనందంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. ఉదయం విఐపి బ్రేక్‌లో తెలంగాణ హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఏపి మాజీ సిఎస్ నీరబ్‌కుమార్‌ప్రసాద్, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

### పాత పద్ధతిలోనే ఆన్‌లైన్‌లో అంగప్రదక్షణ టోకెన్లు జారీ

**తిరుమల,నవంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ (శుక్రవారం మినహాయించి)వేకువజామున భక్తులు ఎంతో పవిత్రంగా చేపట్టే అంగప్రదక్షణ టోకెన్లు ఆన్‌లైన్‌లో జారీచేసే విధానంలో టిటిడి మార్పు చేసింది. ఆన్‌లైన్ లక్కీడిప్ నుండి గతంలో పాతపద్ధతిలో ముందు వచ్చిన వారికి ముందు అనేలా టోకెన్లు కేటాయించాలని నిర్ణయించింది. ఈ నూతన విధానం పాత పద్ధతి అమలులోకి రావడంతో భక్తులు మరింత సులభంగా అంగప్రదక్షణ టోకెన్లు పొందేందుకు వీలుకలిగింది. ప్రతిరోజూ 750మంది భక్తులకు ఈ అవకాశం కల్పిస్తోంది. లక్కీడిప్ విధానం రద్దుచేసి పాతపద్ధతిలోనే మూడునెలల ముందుగానే ఆన్‌లైన్‌లో విడుదలచేస్తారు. ఈ మార్పును భక్తులు గమనించి అంగ్రపదక్షణ టోకెన్లు బుక్‌చేసుకోవాలని టిటిడి తెలియజేసింది.

### ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్లు జైలు - రూ.6లక్షలు జరిమానా

**తిరుపతి,నవంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అటవీప్రాంతం నుండి ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన స్మగ్లర్లలో ఇద్దరికి ఐదేళ్ళు జైలుశిక్ష, ఆరులక్షలురూపాయలు జరిమానా .

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా & పారిశుధ్య విభాగం
No. TO/39/2025, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 28.10.2025
కడప జిల్లా పులివెందుల RWS & S డివిజన్‌లో 1 పని కొరకు రూ.6.00 లక్షలు అంచనా ధరతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్‌దారులు టెండర్ షెడ్యూల్స్‌ను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా https://tender.eprocurement.gov.in లో 03.11.2025 మ.3.00 గం. నుండి 17.11.2025 మ.3.30 గం. వరకు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. ఫోన్ నం. 9989480457. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, RWS & S డివిజన్, పులివెందుల
DIPR.No.17961/CL/Advt/1/1/2022-23, తేది: 06.11.2025

వార్త


గొప్ప మనస్సుగలవారు ఆశయాల గురించి చర్చిస్తారు. మామూలు మనస్సున్నవారు సంఘటనలను గురించి చర్చిస్తారు. సంకుచిత మనస్కులు మనుషుల వ్యక్తిగత జీవితాలు, లోటుపాట్లు గురించి చర్చిస్తారు.

-ఐ.జాన్సన్

# పటిష్టమైన విత్తన చట్టమెప్పుడు?

బాధపడడమే తప్ప బాధించడం తెలియని అన్నదాతల్లో ఇటీవల కాలంలో సహనం, ఓర్పు సన్నగిల్లి ఆందోళనల బాటలుపడుతున్నారు. తమ కెంతటి నష్టం జరిగినా ఎవ్వరు, ఎంతగా మోసగించినా తమలో తాము కుళ్లికుళ్లి మనసులో బాధపడి, చివరకు ప్రాణత్యాగం చేయడానికి అయినా సిద్ధపడతారు తప్ప తమను దగా చేసినవారిపై కక్ష కట్టి దాడులు చేసేందుకు సాహసించకపోయేవారు. పంటలకు గిట్టుబాటు ధర రాకపోయినా, దళారుల హస్తలాఘవంతో కోలుకోలేని దగాకు గురవుతున్నా తమ కర్మకు తామే బాధపడుతూ మౌనరోదనతో ఇంటి ముఖం పట్టేవారు. కానీ ఇటీవల కాలంలో రోడ్లపైకి రావడం, ధర్నాలు,నిరసనలు లాంటి కార్యక్రమాలు తెలిపేందుకుస్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. అవి అక్కడక్కడ అప్పటికప్పుడు జరుగుతున్నాయే తప్ప సంఘటితంగా జరుగుతున్న సందర్భాలు లేవని చెప్పొచ్చు. ఆరుగాలం అష్టకష్టాలు పడి తెచ్చిన పంటలను అమ్ముకోవడంలో వారుపడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. దేశంలో చూసినా అధికశాతం మార్కెట్ యార్డుల్లో దళారులే రాజ్యం. కొలతల్లో మోసం, ధరలను నిర్ణయించడంలో దగా, ఒక్కటేమిటి ఎక్కడ వీలైతే అక్కడ చేతివాటం ప్రదర్శించేందుకు దళారులు నిత్యం పొంచి ఉంటూనే ఉంటున్నారు. రైతులు మోసాలకు గురవుతూనే ఉన్నారు. మోసపోయేవారు ఉన్నంతకాలం మోసం చేసేవారు ఉంటారన్నట్టే ఈదళారీ వ్యవస్థ ఉన్నంత కాలం రైతులకు ఈ బాధలు తప్పవు. విత్తే దగ్గర నుంచి విక్రయించేవరకు అన్ని స్థాయిల్లో దగా జరుగుతున్నది. దీనిని నిరోధించేందుకు పాలకులుఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నా ఆశించినఫలితాలు కన్పించడం లేదు. వ్యవసాయానికి మూలం విత్తనాలు.ఆ విత్తనాలే నకిలీవో, నాసిరకం అయితే రైతులు కుప్పకూలిపోతారు. నకిలీ, నాసిరకం విత్తనాలు సరఫరా చేసి రైతులను నిలువునా మోసం చేసినవారిని ఏ పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తి లేదని, పిడి చట్టాన్ని ప్రయోగించి కటకటలా వెనక్కి పంపేందుకు వెనుకాడమని హెచ్చరికల మీద హెచ్చరికలు పాలకులు చేస్తున్నా ఈ నకిలీ విత్తన వ్యాపారులు అవేమీ పట్టించుకునే పరిస్థితుల్లో లేవు. యేడాది యేడాదికి నకిలీ విత్తనాల వ్యాపారం దేశవ్యాప్తంగా ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో అంతకంతకు పెరిగిపోతున్నది. అంతర్జాతీయ మార్కెట్లను దృష్టిలో ఉంచుకొని పత్తికి మంచి ధర వస్తుందనే అంచనాలతో ప్రభుత్వాలు కూడా పత్తి సాగును ప్రోత్సహిస్తున్నాయి. డిమాండ్‌ను ఆసరాగా తీసుకొని రకరకాల విత్తనాలు భారీ ఎత్తున సరఫరా అవుతున్నాయి. రసీదులు, బిల్లులు ఎలాంటి ఆధారాలు లేకుండా వేలాది క్వింటాళ్ల కూరగాయల విత్తనాలు ఇతర రాష్ట్రాల నుంచి వివిధ మార్గాల ద్వారా తెలుగు రాష్ట్రాలకు చేరుకుంటున్నాయి. వీటికి రైతులు అడిగిన ఎలాంటి రసీదులు కానీ, ఆధారాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ వ్యాపారం బాహాటంగా జరుగుతున్నా, అధికారులకు అందరికి తెలిసినా, మౌనంగా ఉండిపోతున్నారు. రైతులు ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు అన్నదాతలనే సముదాయించి రాజీమార్గాలను అన్వేషిస్తున్నారే తప్ప నిర్దిష్టమైన చర్యలవైపు అడుగులు వేయలేకపోతున్నారు. ఎక్కడో మారుమూల గ్రామాల్లో ఈ నకిలీ వ్యాపారం జరగడం లేదు. అన్ని నగరాల్లో, పట్టణాల్లోనూ బాహాటంగానే జరుగుతున్నాయి. ఈ ఖరీఫ్‌లో కూడా పెద్దఎత్తున నాసిరకం కూరగాయల విత్తనాల కొని రైతులు మోసపోయారు. రాబోయే రబీలో పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు కృత్రిమ డిమాండ్‌ను సృష్టించి ఇష్టానుసారంగా రేట్లు పెంచుతున్నారు. ప్రభుత్వపరంగా ఎన్ని చర్యలు తీసుకుంటున్నా విత్తనాల కొరత దృష్ట్యా ఈ నాసిరకం విత్తనాల వ్యాపారంపై ఆధారపడక తప్పడం లేదు. ఈ వ్యాపారాన్నిఅడ్డుకునేందుకు గత రెండు,మూడు దశాబ్దాలుగా పాలకులు చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతం కావడం లేదు. పోలీసులన్నా, చట్టాలన్నా, వ్యవసాయ అదికారు లన్నా పాలకులు చేసే హెచ్చరికలు అన్నా భయభక్తులు లేకుండాపోయాయి. ఎందుకు ఇతర కారణాల కంటే విత్తన చట్టమే రైతుల కంటే దళారులకే ప్రయోజనకరంగా ఉండడం వల్లనే ఈ పరిస్థితి దాపురిస్తున్నది. కొత్త పటిష్టమైన చట్టం కావాలని ఏనాటి నుంచో రైతులు కోరుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. మనదేశంలో విత్తన చట్టం 1966 నాటిది. 1983లో విత్తన నియంత్రణ ఉత్తర్వులను అప్పటి కేంద్రప్రభుత్వం జారీ చేసింది. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు 1986లో మరొక చట్టాన్ని తీసుకువచ్చారు. ఇక నకిలీ,నాసిరకం విత్తనాలు పెద్ద ఎత్తున మార్కెట్లో వస్తున్న విషయాన్ని గుర్తించి ధృవీకరణ ప్రాధాన్యాన్ని గుర్తించిన పాలకులు 2016లో విత్తన సేంద్రీయ ధృవీకరణ ప్రాధికార సంస్థను ఏర్పాటుచేశారు. విత్తన పంటలను మూడు నుంచి నాలుగుసార్లు తనిఖీ చేయాలనే నిబంధనను విధించారు. పంట కోత తర్వాత పరిశ్రమల్లో శుద్ధి చేసిన విత్తనాలను, నమూనాలను తీసి ప్రయోగశాలలో నాణ్యతను పరిశీలించాలి. నాణ్యమైనవిగా తేలిన తర్వాత వాటికి ధృవీకరణ పత్రం ఇచ్చి విడుదల చేయాలి. కానీ ఈ ప్రక్రియ అంతా సక్రమంగా జరగడం లేదనే విషయం తెలియందికాదు. మనదేశానికి సేద్యమే జీవనాధారమన్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ మేరకు పాలకులు అడుగులు వేయాలి. ముందుగా అన్నదాతలను దగాచేస్తున్న ఈనకిలీ,నాసిరకం వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలి. రైతుల సంక్షేమమే తమ ధ్యేయమని వాచావాత్సల్యం చూపడం కావాల్సింది చేతల్లో చూపాలి.

చీకటిలో ఉన్నప్పుడు తచ్చాడి వెలుగు కోసం ప్రయత్నించాలి గాని, ఎవరో వెలుగును ప్రసాదిస్తారని ఉన్న చోటనే ఉండకూడదు.



జి.ముర్రే

దుష్టులకు బలం హింస, రాజులకు రక్షించడమే బలం, గుణవంతులకు సహనమే బలం.



హెచ్. లాంగ్‌ఫెలో

## ప్రజావాక్కు



### మద్యనిషేధంపై అవగాహన పెంచాలి

భారతదేశం వంటి విభిన్న సాంస్కృతిక దేశంలో మద్యం వినియోగం ఎప్పటి నుంచో సామాజిక, ఆరోగ్య, ఆర్థిక సమస్యలకు మూలమై ఉంది. మద్యం తాగడం వ్యక్తిగత నిర్ణయమని కొందరు అంటారు,కానీ దానిప్రభావం సమాజంపైతీవ్రమైనది.గృహహింస, రోడ్డుప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు, పేదరికం మద్యాసక్తి వల్లే పెరుగుతున్నాయి. మద్యం వ్యసనం మన సమాజాన్ని నిశ్శబ్దంగా కరిగిస్తున్న రుగ్మత. ప్రతి సంవత్సరం వేలాది మంది కాలేయ వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలతో మరణిస్తున్నారు.కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి, పిల్లలు విద్యకు దూరమవుతున్నారు. అయినా మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం కారణంగా ప్రభుత్వాలు పూర్తిగా నిషేధించడంలో వెనుకడుగు వేస్తుంటాయి. కానీ ఆర్థిక లాభం కన్నా ప్రజల ఆరోగ్యం, సామాజిక శాంతి ముఖ్యమైనవి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఆర్భాటపు ప్రచారం

జిఎస్టీ తెచ్చి గత పదకొండేళ్ల నుంచి ప్రజల నుంచి పన్నుల రూపంలో 200 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసినకేంద్రసర్కార్ ఏకారణంచేతనో హఠాత్తుగా వస్తువుల మీద పన్నులు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ప్రకటన వెలువడిన మరుసటి రోజు నుంచే ధరలన్నీ తగ్గిపోయినట్టు ప్రజలు తగ్గిన ధరలకే పెద్దఎత్తున నిత్యావసరాలు, మందులు కొనుగోలు చేస్తూ సంతోష పడుతున్నారని వారి మొహాలలో ఆనందపు వెలుగులు విరజిమ్ముతున్నాయని ప్రభుత్వం ప్రచారం చేయడం మొదలుపెట్టింది. అయితే ధరలు తగ్గిన మాట నిజమేనని కాని కొత్త సరుకు వచ్చే వరకు పాత ధరలకే విక్రయాలు చేస్తున్నారు.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### బస్‌పాస్‌ల జారీ వేళలు మార్చాలి

బస్సుపాస్‌లుఇచ్చే సమయపాలన ఉదయం 6 గంటలకు ప్రారంభం చేసి రాత్రి 9 గంటల వరకు ఇవ్వాలి. నిత్యం బస్సులలో ప్రయాణం చేసే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, కూలీలకు ఉపయోగం ఉండే సమయం ఉండాలి.వీరుప్రయాణం చేసేసమయంలోకౌంటర్ మూసి ఉండడం జరుగుతుంది. సమయ పాలన సరి చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### జాగ్రత్తే జీవరక్షణ

మన దేశంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య, వాటి కారణంగా జరుగుతున్న ప్రాణనష్టం ఇటీవల మరింత విపరీతంగా మారింది. చిన్న తప్పిదం, ఒక క్షణిక నిర్లక్ష్యం కూడా ఒక కుటుంబం జీవితాన్ని మార్చివేయగలదు. రోడ్డు ప్రమాదాలు సాధారణంగా ఒక్కొక్క కారణం వల్లనే కాకుండా పలు అంశాల సమ్మేళనంతో కలిగే భయంకర పరిణామాలు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, భారతదేశంలో రోడ్డుప్రమాదాలు సంవత్సరం నుంచి సంవత్సరం పెరుగుతున్నాయి. 2022 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 1,68,491మంది ప్రాణాలు కోల్పోయారు. 2024 నాటికి ఈ సంఖ్య మరింత పెరిగి సుమారు 1,80,000మందికు చేరింది. ఈ సంఖ్యలు రోడ్డు ప్రమాదాలు ఒకజాతీయ సమస్యగా మారుతున్నాయని స్పష్టంగా చెబుతున్నాయి. రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లో 24,118మంది,తమిళనాడులో 2025 జనవరిలోనే 1,295 మంది రోడ్డు ప్రమాదాలలో చనిపోయారు. తెలంగాణలో కూడా ప్రతీ సంవత్సరం వందలాది మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### మంచి వారికే టికెట్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ గెలవకుంటే ఆ పార్టీపై విమర్శలు తారాస్థాయికి చేరుకుంటాయి. కె.టిఆర్ తన నోటికి మరింత పదును పెడతారు. ఉప ఎన్నికలో తన పార్టీని గెలిపించుకోలేకపోయిన అసమర్థుడు రేవంత్‌రెడ్డి అని ఇదేకాదు మరో పదిస్థానాలకు కూడా త్వరలో ఉప ఎన్నికలు జరుగుతాయని ఆ స్థానాల్లో కూడా ఇవే ఫలితాలు వస్తాయని ఓటమికి నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని కెటిఆర్ అనకుండా ఉండరు. అలా జరగకుండా ఉండాలంటే ప్రజల్లో మంచి వాడని పేరున్న వాడిని, నియోజక సమస్యలు క్షుణ్ణంగా తెలిసి ఉన్న వారికి తప్పక గెలుస్తారనే అభ్యర్థినే ఎంపిక చేసి రంగంలోకి దించాలి.

-మిథునం, హైదరాబాద్

### నివారణ చర్యలు చేపట్టాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు సత్వరమే రోడ్లపై గుంతలు పూడ్చాలి, వాహనాలకు స్పీడ్ లిమిట్ ఏర్పాటు చేయాలి. మూల మలుపుల దగ్గర సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రోడ్ల విస్తరణ చేపట్టాలి. బస్సుల్లో కూడా సీటు బెల్టులు ఏర్పాటు చెయ్యాలి. అన్నిబస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉండాలి.

-పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# డిజిటల్ మోసాలకు అప్రమత్తతే ఆయుధం

**సైబర్ మోసగాళ్లపై కఠిన మైన శిక్షలు విధిస్తూ, వారి ఆర్థిక లావాదేవీలను తక్షణం ఫ్రీజ్ చేసే చట్టపరమైన విధానాలు రూపొందించాలి. సిబిఐ, సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీలు కలిసి విభిన్న రాష్ట్రాల్లో జరి గిన కేసులను సమగ్రంగా దర్యాప్తు చేయాలి. చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. మోసానికి గురైన వెంటనే డయల్ 1930 లేదా 100 కు సమాచారం ఇవ్వాలి.గుర్తు తెలియని లింకులు క్లిక్ చేయకూడదు.వాట్సాప్ లేదా మెయిల్ ద్వారా వచ్చిన తెలియని ఫైళ్లను తెరవకూడదు. సాంకేతిక సదుపాయా లు ఎంత పెరిగినా, మనజాగ్రత్తే చివరి రక్షక కవచం. డిజిటల్ అప్రమత్తత అనే ఈ సంస్కృతి ప్రతి ఇంటి నుంచి మొదలవ్వాలి. సైబర్ నేరాలు యుద్ధం మాదిరిగా మారు తున్నాయి. కానీ ఆయుధం అవసరం లేదు. అవగాహన, అప్రమత్తత, ధైర్యం చాలు. ప్రజలు తమ వ్యక్తిగత సమా చారం కాపాడుకుంటే, ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తే, ఈ మోసాలు ముగుస్తాయి. డిజిటల్ మోసాలపై అప్రమత్తతే అసలైన రక్షణ.**



మేకిరి దామోదర్

సైబర్ నేరాలు రూపాంతరం చెంది డిజిటల్ అరెస్ట్ పేరుతో దోపిడీలు తారాస్థాయికి చేరాయి. ఎంతగా అంటే? ఉన్నతవిద్యావంతులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, చివరికి బ్యాంకు అధికారులు సైతం వారి వలలో పడి డబ్బులు కోల్పోయి విలవిలాడుతున్నారు. నేరగాళ్లు వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి, మానసికంగా బెదిరిస్తూ బురిడీ కొడుతున్నారు. ఈ విధంగా డిజిటల్ అరెస్టుల ఘటనలు నానాటికి పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సైబర్ నేరాలపై ప్రజాచైతన్యం, అవగాహన పెరగాలి. పోలీసులు ఎప్పుడూ వీడియో కాల్స్‌లో అరెస్టులు చేయరని, డబ్బులు బదిలీ చేయమని బెదిరించరని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉండటం అత్యవసరం. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సైబర్ నేరాలపై ఉక్కు పాదం మోపాలి. అప్రమత్తతే ప్రజా ఆయుధం. మన దేశంలో జరుగుతున్న సైబర్ నేరాలు డిజిటల్ అరెస్టుల మోసాల తీవ్రత పరిశీలిస్తే ఆధునిక టెక్నాలజీ మూలంగా డిజిటల్ యుగం మన జీవితంలో సౌలభ్యాన్ని తెచ్చింది. కానీ అదే సాంకేతికత ఇప్పుడు మోసాలకు, ఆర్థిక నష్టాలకు కారణమవుతోంది. వాస్తవంగా ఆధునిక టెక్నాలజీ సామాన్యుడి ప్రగతికి, జీవన విధానం మెరుగుదలకు తోడ్పడితేనే దానికి సార్థకత. ప్రస్తుతం దీనికి విరుద్ధంగా టెక్నాలజీని వాడుకొంటూ నేరాలకు పాల్పడుతున్నారు. అలా సైబర్ నేరాల కొత్త రూపమే డిజిటల్ అరెస్టులు. మనసులనూ, మనీని కూడా కబళిస్తోంది. ఇలాంటి మోసాల నుంచి మనం రక్షించుకునే ఆయుధం ఒక్కటే అప్రమత్తత. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు భయానకర స్థాయికి చేరాయి. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ పేరిట జరుగుతున్న మోసాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఖాకీ బట్టలు వేసుకొని వీడియో కాల్స్ చేస్తూ, మీరు ఉగ్రవాదులతో సంబంధం కలిగారు, మాదకద్రవ్యాల కేసులో పేరు వచ్చింది, మనీలాండరింగ్‌లో పాలుపంచుకున్నారు అంటూ భయపెట్టేముఠాలు పౌరుల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నాయి. జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టులకు డిజిటల్ అరెస్టులపై




2022లో డిజిటల్ అరెస్ట్ మోసాలపై39,925 ఫిర్యాదులు నమోదైతే,2024లో అలాంటివి 1.23 లక్షలకు పెరిగాయి. బాధితులు కోల్పోయిన సొమ్ము విలువ రెండు సంవత్సరాల్లో 21 రెట్లు పెరిగింది. ఈ ఏడాది మొదటి రెండు నెలల్లోనే 17,718 కేసులు నమోదవడం చూస్తుంటే, నేరగాళ్లు ఎంతగా చెలరేగిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఉన్నత విద్యావంతులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, బ్యాంక్ అధికారులు కూడా ఈ వలలో చిక్కుతున్నారు. నకిలీ గుర్తింపులు, ఫోర్జరీ పత్రాలు, వాయిస్ క్లోనింగ్, సాంకేతిక నైపుణ్యంతో ఈ ముఠాలు నేరాలను కొత్త రూపంలో తీవ్ర స్థాయికి తీసుకెళ్తున్నాయి. బాధితులు ఆర్థిక నష్టంతో పాటు మానసికంగా కూడా కృంగిపోతున్నారు. ప్రత్యేకించి పెన్షనర్లు పెద్దగా ప్రభావితమవుతున్నారు. లైఫ్ సర్టిఫికెట్, పింఛన్ వెరిఫికేషన్ పేరిట వివరాలు సేకరించి మోసాలు చేస్తున్నారు. టెక్నాలజీ అవగాహన తక్కువగా ఉండటంతో వారు సులభంగా వలలో పడుతున్నారు. ఈ డిజిటల్ మోసాలపై ప్రధాన ఆయుధం అప్రమత్తత. ప్రభుత్వం, పోలీసులు, ప్రజలు ముగ్గురి సమన్వయం ద్వారానే మూలాలు గుర్తించి దీన్ని సమూలంగా అరికట్టవచ్చు. టీవీ, రేడియో, సోషల్ మీడియా ద్వారా డిజిటల్ అరెస్టులు చట్టంలో లేవు అనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. అపరిచిత నంబర్ల నుంచి వచ్చే కాల్స్, వీడియో కాల్స్, ఓటిపిలు, ఆధార్ వివరాలు పంచకూడదు. బ్యాంకులు, ప్రభుత్వాల సమన్వయంతో బ్యాంకులు తమ వినియోగదారులకు కాలానుగుణంగా సైబర్ సేఫ్టీ అలర్ట్స్ పంపాలి. ప్రభుత్వ సంస్థలు ప్రజా స్థాయిలో సైబర్ అవగాహన శిబిరాలు నిర్వహించాలి. సైబర్ మోసగాళ్లపై కఠినమైన శిక్షలు విధిస్తూ, వారి ఆర్థిక లావాదేవీలను తక్షణం ఫ్రీజ్ చేసే చట్టపరమైన విధానాలు రూపొందించాలి. సిబిఐ, సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీలు కలిసి విభిన్న రాష్ట్రాల్లో జరిగిన కేసులను సమగ్రంగా దర్యాప్తు చేయాలి. చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. మోసానికి గురైన వెంటనే డయల్ 1930 లేదా 100 కు సమాచారం ఇవ్వాలి.గుర్తు తెలియని లింకులు క్లిక్ చేయకూడదు.వాట్సాప్ లేదా మెయిల్ ద్వారా వచ్చిన తెలియని ఫైళ్లను తెరవకూడదు. సాంకేతిక సదుపాయాలు ఎంత పెరిగినా, మనజాగ్రత్తే చివరి రక్షక కవచం. డిజిటల్ అప్రమత్తత అనే ఈ సంస్కృతి ప్రతి ఇంటి నుంచి మొదలవ్వాలి. సైబర్ నేరాలు యుద్ధం మాదిరిగా మారుతున్నాయి. కానీ ఆయుధం అవసరం లేదు. అవగాహన, అప్రమత్తత, ధైర్యం చాలు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం కాపాడుకుంటే, ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తే, ఈ మోసాలు ముగుస్తాయి. డిజిటల్ మోసాలపై అప్రమత్తతే అసలైన రక్షణ. •

# ఆడపిల్లలపై అరాచకాలను ఆపలేమా?

బి. మధుసూదనరెడ్డి

ఈ మధ్య కాలంలో అన్నెం పున్నెం ఎరుగని బాలికలపై అత్యాచారాల పరంపర నిరాటంకంగా కోనసాగిపోతుండటం ఈ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ,తీవ్ర కళంకం వంటిది. మొన్నటికీ మొన్న తిరుపతి జిల్లాలో మూడున్నరేళ్ళ బాలికపై అత్యాచార ఘటనను మరువక ముందే సోమవారం నాడు మరో మైనర్ బాలికపై ఓ అత్యంత దారుణమైన ఘట్టం చోటు చేసుకోవడం అనేది ఎంతైనా తీవ్ర ఆందోళన కలిగించే విషయం. తిరుపతి జిల్లా యర్రావారిపాలెం మండలం యల్లమంద దళితవాడకు చెందిన జెడ్పి హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలిక పాఠశాల ముగిసిన తరువాత ఇంటికి నడుచుకుంటూ బయలుదేరిన సందర్భంలో వెనుక వైపునుంచి పల్సర్ బైక్ పై వచ్చిన ఇద్దరు దుండగులు బాలికను అడ్డగించడమే కాదు ఆ బాలికను పొట్టపై కాలితో తన్ని, అపై చాకుతో దాడి చేసి మత్తు మందు కలిపిన నీటిని ఆ బాలికతో తాగించి ఆ తర్వాత ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడటం అనేది ఎంతటి దుర్మార్గపు, కిరాతక చర్యో తలుచుకుంటేనే ప్రతి మానవతావాది హృదయం తరుక్కుపోతుంది. వారి గుండెలు జలదరిస్తాయి అనే మాట ఎవ్వరూ కాదనలేని నగ్న సత్యం. అయితే ఈ ఘోర ఉన్మాద ఘటన జరిగిన విషయం ఏమి తెలియని ఆబాలిక తండ్రి పాఠశాల వదిలి సాయంత్రం అవుతున్నా తమకూతురు ఇంటికి రాకపోవడంతో అతను కంగారుపడి ఆ బాలిక కోసం పాఠశాల అంతా గాలించి ఎక్కడా లేకపోవడంతో వెతకడం ప్రారంభించి చివరకు గ్రామానికి సమీపంలోని ముళ్లపొదల్లోంచి మూలుగు వినిపించడంతోనే ఏదో కీడు తమ బాలికకు జరిగిందని అనుమానించి తక్షణమే లోనికి వెళ్ళి చూసేసరికి ఆ బాలిక తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉండటాన్ని చూసి ఆ బాలిక తండ్రి అత్యంత తీవ్రంగా చలించిపోయిన తీరుతెన్నులు,ఓ తండ్రిగా ఆయన పడిన ఆవేదన,ఆ బాలికకు ఎదురైనా కడు దయనీయ పరిస్థితి మరే ఆడపిల్ల తండ్రికి కూడా రాకూడదు అనే మాటలో ఎంతో వాస్తవం దాగి వుంది.అదేమాదిరి అన్నెం పున్నెం ఎరుగని ఆ బాలికపై ఏ మాత్రం జాలి,దయ,కరుణ అనేవి



ఏ మాత్రం చూపకుండా అత్యంత అమానుషంగా, రాక్షసత్వంతో ఓ క్రూర మృగం కంటే హీనంగా వ్యవహరించిన ఆ ఇద్దరు నరరూప రాక్షసులను,కామాందులను తక్షణమే అరెస్టు చేసి అత్యంత కఠినంగా శిక్షించాల్సిన గురుతర బాధ్యత అటు పోలీసు డిపార్ట్మెంట్ వారిపై,ఇటు న్యాయ శాఖ వారి భుజస్కందాలపై ఎంతైనా వుంది. ఏదిఏమైనా మన కేంద్ర ప్రభుత్వం వారు, న్యాయ శాఖ వారు మైనర్ బాలికలపై నిత్యం జరుగుతున్న ఇలాంటి అమానుష అత్యాచార ఘటనలకు,లైంగిక దాడులకు ఎలాగైనా చెక్ పెట్టడానికి, చరమ గీతం పాడేందుకు ఎన్ని కఠినమైన చట్టాలు అమలులోకి తెస్తున్నా అవి బూడిదలో పోసిన పన్నీరుగా మారిపోతుండటం ఈ యావత్ సమాజానికి సంబంధించి చాలా బాధాకరమైన విషయం. ఇలా జరుగడానికి ప్రధాన కారణం చట్టాలలో వున్న బలహీనతలు, లొసుగులే. ఎందుకంటే వీటిని ఆధారంగా చేసుకొని రేపిస్టులు తమకున్న రాజకీయ పలుకుబడి, పరపతి, డబ్బును ఉపయోగించి తమకు పడే శిక్షల నుంచి తప్పించుకొని యధేచ్ఛగా బయటపడుతుండటం కూడా ఇలాంటి క్రూర లైంగిక దాడులు పదే పదే జరుగడానికి కారణభూతమవుతున్నాయి అనే మాట అక్షర సత్యం. ఏమైనా ఇప్పటికైనా మన కేంద్ర ప్రభుత్వం వారు, పోలీసు, న్యాయశాఖ వారు మరింతగా అప్రమత్తంగా, అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించి బాలికలపై లైంగిక దాడులకు పాల్పడే వారిలో ఏ ఒక్కరూ కూడా చట్టం నుంచి తప్పించుకోకుండా వారికి కఠిన కారాగార శిక్షలు అమలు అయ్యేలా అత్యంత చిత్తశుద్ధితో,ఎనలేని అంకితభావంతో వారు అవిరళ కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. అలా చేయకపోతే మాత్రం ఆడపిల్లలను కన్న ప్రతి తల్లిదండ్రులు కూడా బడి ఈడు వచ్చిన తమ బాలికలను పాఠశాలలకు పంపించాలంటేనే తీవ్ర భయాందోళనకు గురయ్యే పరిస్థితులు ఉత్పన్నం అవ్వడం తథ్యం అనే మాట సత్య దూరం కాదు.ఎందుకంటే బాలికలపై ఇలాంటి కిరాతక, పైశాచిక చర్యలు పదే పదే జరగడం మూలాన ఆంధ్రప్రదేశ్ రాష్టంలోని యావత్తు ప్రజలు ఇది ప్రజాస్వామ్యమా? లేక ఆరాచకస్వామ్యమా? అని తమలో తాము ప్రశ్నించుకుంటారు అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు. మానవత్వం వర్ధిల్లాలి! రాక్షసత్వం నశించాలి!. •

# జీవిత పాఠాలను నేర్పుతున్న పేదరికం

డా. చిటికెన కిరణ్‌కుమార్

పేదరికం అనేది మనుష్య జీవితంలోని కఠినమైనసత్యం. అది ఒకరికి బాధగా, మరొకరికి బోధగా మారుతుంది. కానీ నిజంగా పేదరికం వెనుక దాగి ఉన్న గౌరవాన్ని గమనించగలిగితే,మనం జీవన విలువను మరో కోణంలో చూడగలుగుతాము. పేదరికం అనేది కేవలం ఆర్థిక లోపం కాదు, అది మనిషి మనసు ఏ స్థాయిలో సహనం, కృషి, నిబద్ధత చూపుతుందో పరీక్షించే దశ. ఆ పరీక్షను గెలిచినవాడు సంపద లేకపోయినా గొప్పవాడే. పేదరికం మనిషి జీవితంలో కొన్నిసార్లు గురువులా మారుతుంది.అది కష్టాన్ని నేర్పుతుంది, విలువను తెలియజేస్తుంది. ఆకలిని తట్టుకోవడం ద్వారా తృప్తి విలువ తెలుస్తుంది. అవసరాన్ని అర్థం చేసుకోవడం ద్వారా ఇతరుల బాధ కూడా మనసుకుతాకుతుంది. పేదరికం మనిషి మనసులో దయ అనే విత్తనాన్ని నాటుతుంది. ధనం లేకున్నా హృదయం ధనవంతమైపోయే అద్భుత శక్తిఅదే. మన గ్రామీణ జీవితంలో ఇలాంటి పేదరికపు గౌరవం తరచూ కనిపిస్తుంది. రోజంతా పొలంలో పని చేసి రాత్రి ఒక తృప్తి భోజనం చేసిన రైతు, కష్టంతో చదివి కుటుంబాన్ని నిలబెట్టిన విద్యార్థి, దుస్తులు చిరిగినా మనసు సజ్జనతతో నిండిన అమ్మాయి వీరంతా పేదరికంలో జీవిస్తూ గౌరవాన్ని కాపాడిన మనుషులు. వాళ్ల వద్ద విలాసం లేదు కానీ విలువ ఉంది. వాళ్లు ఎవరికి హాని చేయకుండా, ఎవరి హక్కు దోచుకోకుండా జీవిస్తారు. అది నిజమైన గౌరవం. ధనం ఉన్నవాడి దగ్గర గర్వం ఉంటే, పేదరికంలో ఉన్నవాడి దగ్గర గౌరవం ఉంటుంది. పేద మనిషి తల వంచకపోవడం అంటే అతనిలో ఉన్న ఆత్మగౌరవం. ఆకలిని తట్టుకుంటాడు కానీ అబద్ధం చెప్పడాన్ని తట్టుకోడు. కష్టంతో సంపాదించిన రొట్టె అతనికి మధురమైనది, ఎందుకంటే దానిలో అతని గౌరవం దాగి ఉంటుంది. దానం కోరడం కంటే శ్రమతో సంపాదించడం అతనికి ఆనందం. పేదరికం మనిషి మనసుని బలంగా చేస్తుంది. అది జీవితాన్ని అర్థం చేసుకునే పాఠం. ద్రవ్య సంపద లేకున్నా పేదమనిషి హృదయంలో మానవత్వం, నిబద్ధత, సహనం వంటి విలువలు మెదులుతాయి. అవే అతని అసలైన సంపద. ఈ ప్రపంచంలో పేదరికం తొలగిపోవాలని మనంకోరుకుంటాం, కానీ దాని ద్వారా పుట్టిన ఆత్మగౌరవం మాత్రం ఎప్పటికీ నిలిచి ఉండాలి. పేదరికం మనిషిని విలువైన అనుభవాలతో నింపుతుంది. ఎవరిపై ఆధారపడకుండా నిలబడటం, ప్రతి కూలతలోనూ మనసును నిలబెట్టుకోవడం, తక్కువలో సంతోషం కనుగొనడం ఇవి పేదరికం నేర్పిన పాఠాలు. దానికి గురైనవారే ఇతరుల కష్టాన్ని సులభంగా అర్థం చేసుకుంటారు. ధనవంతుడికి కావాల్సినది విలాసం అయితే, పేదవాడికి కావాల్సినది గౌరవం. ఆ గౌరవం అతనికి జీవితానుభవం ఇచ్చిన బహుమతి. ఒక తల్లి తన పిల్లలకు అరిటాకులో భోజనం పెట్టినప్పుడు, అది ప్రేమతో కలిసిన పేదరికపు సౌందర్యం. ఒక తండ్రి పగలంతా కష్టపడి ఇంటి ముందర చిరునవ్వుతో నిలబడినప్పుడు,అది గౌరవం. పేదరికం ఇలాంటి ప్రశాంతమైన గౌరవాన్ని కలిగిస్తుంది. ఈ గౌరవం నోట చెప్పలేనిది, అది కేవలం మనసులో అనుభూతి చెందవలసినది. పేదరికం అంటే కొంతమంది దురదృష్టంగా భావిస్తారు.కానీ నిజానికి అది మనిషి మానసిక సంపదనుపెంచే శక్తి. అది మనసును చైతన్యపరుస్తుంది. మనం కలలకోసం పోరాడటానికి ప్రేరణ ఇస్తుంది. ధనవంతుడు సుఖంతో



ఉండవచ్చు కానీ పేదవాడు ఆశతో జీవిస్తాడు. ఆ ఆశేఅతని జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. మన సంస్కృతిలో పేదరికం ఎప్పుడూ అవమానంగా చూడబడలేదు. పేదవాడికీ గౌరవం ఉండాలి అనే భావన మన పూర్వీకుల తాత్వికతలో ఉంది. పేదరికం అనేది మనిషిని మట్టిలో కలిపే కాదు,నేల వాసన నేర్పే అనుభవం. ఒక పేదవాడు కూడా సత్యంకోసం నిలబడి, తన కృషితో గెలవగలడని మన సాహిత్యం ఎన్నోసార్లు చూపింది.సంపద ఉన్నవాడి చేతిలో అధికారం ఉండొచ్చు కానీ పేదవాడి చేతిలో జీవన బలమే ఉంటుంది. ఆ బలం అతనికి అంతరాత్మ ఇచ్చిన శక్తి. రోజూ పోరాటం చేసే జీవితం అతనికి ధైర్యం నేర్పుతుంది. పేదరికం కారణంగా వచ్చే కన్నీటి చుక్కలు కూడా గౌరవంతో తడుస్తాయి. ఆ కన్నీరు అవమానానికి కాదు, ఆత్మగౌరవానికి సూచన. పేదరికంలో పుట్టినవారు పెద్దవారై ధనవంతులైనా, వారి మనసులో ఆ గౌరవపు విత్తనం నాటుకుపోయి ఉంటుంది. వాళ్లు చిన్నపుడు కష్టాన్ని చూసినందునే, తర్వాత ఇతరుల కష్టాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తారు. పేదరికం ఇస్తే తాత్కాలిక బాధ కానీ జీవితాంతం నిలిచే విలువ.ఒక పేద విద్యార్థి రాత్రంతా దీపం వెలిగించి చదివి విజయాన్ని అందుకుంటాడు. ఒక కూలి కాళ్ల మీద నిలబడి పిల్లల భవిష్యత్తు తీర్చుతాడు. ఒక పేద కవి తన ఆకలి బాధల్లో కూడా మానవత్వం గురించి రాస్తాడు. వీళ్లందరిలో పేదరికం ఉంది, కానీ దాని వెనుక గౌరవం మరింత వెలుగుతుంది. ఆ గౌరవమే మన సమాజానికి స్ఫూర్తి. సంపదను కొలవడానికి మనం గణాంకాలు వాడతాం, కానీ గౌరవాన్ని కొలవడానికి గుండె కావాలి. పేదరికం వెనుక ఉన్న గౌరవం అటువంటి హృదయాలతోనే కనిపిస్తుంది. అది కష్టాన్ని గౌరవంగా మార్చే మానసిక శక్తి. దానిని పొందినవాడు ఎప్పటికీ దాన్ని కోల్పోడు. ప్రపంచం మొత్తం పేదరికం తొలగించాలని కోరుకుంటున్నా, మనం దాని వెనుక ఉన్న మానవత్వాన్ని కూడా గుర్తుంచుకోవాలి. దయ, సహనం, శ్రమ ఈ మూడు పేదరికం నేర్పిన వరాలు. ఈ విలువలు ఉన్నచోటే సమాజం స్థిరంగా ఉంటుంది.చివరికి పేదరికం మనిషిని నేర్పిన ముఖ్యమైన పాఠం ఇదే. గౌరవం అనేది డబ్బుతో కొనలేనిది. అది మన కర్మలో, మన ఆలోచనలో, మన మనసులో ఉంటుంది. మనం పేదవారైనా, మన గౌరవాన్ని కాపాడుకుంటే మనం జీవితంలో ఓడిపోలేదు. పేదరికం తాత్కాలికం, కానీ గౌరవం శాశ్వతం. అదే మనిషి సొంత వెలుగు. పేదరికం మనిషి జీవితంలో ఒక అద్దం లాంటిది. అందులో మనిషి తన అసలు రూపాన్ని చూసుకుంటాడు. ఆ అద్దం ముందు అహంకారం నిలవదు. స్వార్థం నిలవదు. పేదరికం మనసును మలుస్తుంది. హృదయాన్ని వినమ్రతతో నింపుతుంది. కానీ ఆ వినమ్రత వెనుక దాగి ఉన్నది అసలైన గౌరవమే. ఆ గౌరవం మాటల్లో కాకుండా జీవన విధానంలో ప్రతిబింబిస్తుంది. మన సమాజంలో చాలామంది పేదవారే కానీ వారి మనసులు సంపన్నంగా ఉంటాయి. తాము తిన్నా తినకపోయినా ఇతరులకు పంచే స్వభావం వారిలో సహజం. ఆ దానం ధనంతో కాకుండా హృదయంతో జరుగుతుంది. ఒక పేద తల్లి పొలంలో కష్టపడి సంపాదించిన కొద్దిపాటి అన్నం పక్కింటి ఆకలిగొన్న పిల్లకు ఇస్తే అది గౌరవానికి నిదర్శనం. ఆమె ఇవ్వగలిగింది తక్కువైనా, ఆమె మనసు ఇచ్చింది ఎక్కువ. ఆ తేడానే పేదరికంలోనూ సౌందర్యం. పేదరికం అనేది మనిషి మనసును వాస్తవానికి దగ్గర చేస్తుంది. ధనం ఉన్నవారు ప్రపంచాన్ని చూడగలరేమో కానీ పేదవాడు జీవితం లోతును అనుభవిస్తాడు. ఒక కూలి చెమటతో కూడిన ప్రతి చుక్కలో గౌరవం ఉంటుంది. ఆ చెమటనే అతని పతకం.ఆ చెమట వాసనే అతని విజయగాథ.పేదరికం మనిషిని కష్టపడే శీలంతో నింపుతుంది. పేదవాడు ఎప్పుడూ ఎదగాలనే తపనలో ఉంటాడు. కానీ ఆ తపనలో అతను ఎవరిహక్కును లాక్కోవాలనుకోడు.మన కవులు, కళాకారులు, రైతులు,కార్మికులు వీళ్లంతా జీవితంలో పేదరికాన్నిచూసినవారే.కానీ ఆ పేదరికమే వారి సృజనాత్మకతకు ప్రేరణ అయింది. ఆకలి తెలుసుకున్నవాడే పరమానందాన్ని అర్థం చేసుకుంటాడు. కన్నీరు తుడిచినవాడే చిరునవ్వు విలువ తెలుసుకుంటాడు. పేదరికం ఇచ్చిన ఈ అనుభవమే మానవత్వాన్ని గొప్పదనం వైపు నడిపిస్తుంది. •

## ఇక న్యూయార్క్ ప్రజలు
# ఫ్లోరిడాకు పారిపోవాల్సిందే

### మమ్దానీ మేయర్ కావడంపై ట్రంప్ వ్యాఖ్యలు

### కమ్యూనిస్టును ఎంచుకున్న ఫలితం ప్రజలే చూస్తారని విమర్శ



**వాషింగ్టన్, నవంబరు 6:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సవాలు చేసి మరీ 34 యేళ్ల భారత సంతతి యువకుడు జోహ్రాన్ మమ్దానీ న్యూయార్క్ మేయర్‌గా విజయం సాధించారు. దీనిపై ట్రంప్ స్పందించారు. విజయం తర్వాత మమ్దానీ ఇచ్చిన ప్రసంగం ఆవేశపూరితంగా ఉందని వ్యాఖ్యానించారు. ఈ కొత్త మేయర్ కమ్యూనిస్ట్ భావజాలం కలిగిన వ్యక్తి అని మరోసారి విమర్శించిన ఆయన.. న్యూయార్క్ నగరం కమ్యూనిస్టు క్యూబా, సోషలిస్టు వెనుజులా వలే మారుతుందని విమర్శలు గుప్పించారు. ఈ నగర ప్రజలు ఫ్లోరిడాకు పారిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 'గత యేడాది నవంబరు 5న ఏర్పడిన ప్రభుత్వం (అధ్యక్షుడిగా తన విజయాన్ని ఉద్దేశించి) సార్వభౌమత్వాన్ని పునరుద్ధరించింది. ముందురోజు రాత్రి న్యూయార్క్‌లో ఆ సార్వభౌమత్వాన్ని కొద్దిమేర కోల్పోయాం. అయితే మేం దానిని జాగ్రత్తగా చూసుకుంటాం' అని ఫ్లోరిడా రాష్ట్రంలోని మయామి నగరంలో అమెరికా బిజినెస్ ఫోరంలో ట్రంప్ మాట్లాడారు. ఇదిలా ఉంటే.. మమ్దానీ విజయంలో అత్యంత కీలకమైన హామీ ఉచిత సిటీబస్సు ప్రయాణాలు. దీంతోపాటు నగరంలో అద్దెలను స్థిరీకరిస్తానని, యూనివర్సల్ చైల్డ్ కేర్ అమలు, 2030 నాటికి కనీస వేతనాల పెంపు, కార్పొరేట్లు, సంపన్నులపై పన్ను పెంచి చిరుద్యోగుల జీవన వ్యయాలను తగ్గిస్తానని ప్రచారంలో పేర్కొని ఓటర్లను ఆకర్షించిన సంగతి తెలిసిందే. వీటిని ఉద్దేశించి ట్రంప్ మాట్లాడారు. 'డెమోక్రాట్లు అమెరికాకు ఏం చేయాలని అనుకుంటున్నారో మీరు చూడాలనుకుంటే.. న్యూయార్క్ ఎన్నికల ఫలితాన్ని గమనించండి. అక్కడ ఆ పార్టీ కమ్యూనిస్టును మేయర్‌గా ఎంచుకుంది. ఇక్కడి కమ్యూనిజం ప్రభావంతో పారిపోయే వారికి మయామి ఒక ఆశ్రయ స్థానంగా మారనుంది' అని వ్యాఖ్యలు చేశారు. కాగా.. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే ట్రంప్‌నకు ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ఆయన పార్టీకి చెందిన అభ్యర్థులను పలు రాష్ట్రాల ప్రజలు తిరస్కరించారు. ఇటీవల వర్జీనియా, న్యూజెర్సీల్లో నిర్వహించిన పోల్‌లోనూ దేశంలో నెలకొన్న తాజా పరిణామాలపై ప్రతి 10 మందిలో ఆరుగురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తేలింది. కేవలం మూడులో ఒకవంతు మాత్రమే ప్రస్తుత పాలనపై సంతృప్తిగా ఉన్నామని చెప్పారు. ఈ ఎన్నికల ఫలితాలపై 'బిగ్ బ్యూటిఫుల్ బడ్జెట్ బిల్లు సహా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు వంటి ట్రంప్ ప్రభుత్వ విధానాల ప్రభావం చూపాయనే వాదన వినిపిస్తోంది.

# బిగ్‌టికెట్ డ్రాలో పావుకిలో బంగారం విజేత!

**దుబాయ్, నవంబరు 6:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నివసిస్తున్న ఓ ప్రవాస భారతీయుడిని అదృష్టం వరించింది. దుబాయ్‌లో నిర్వహించిన ప్రఖ్యాత బిగ్ టికెట్ ఈడ్రాలో ఏకంగా పావు కిలో బంగారం గెలుచుకున్నారు. దీంతో ఆయన ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కేరళకు చెందిన నితిన్ కున్నత్ రాజ్, ఉపాధి నిమిత్తం 2016 నుంచి దుబాయ్‌లో నివసిస్తున్నారు. ఇటీవల ఆయన తన స్నేహితులతో కలిసి కొనుగోలు చేసిన టికెట్‌కు ఈ జాక్‌పాట్ తగిలింది. డ్రా నిర్వాహకులు నితిన్‌కు ఫోన్ చేసి విషయం చెప్పగా, ఆయన తొలుత నమ్మలేదు. ఎవరో సరదాకి చేస్తున్నారని భావించారు. అయితే, ఆయన టికెట్ నంబర్ 35 1853 సహా పూర్తి వివరాలు చెప్పడంతో ఆశ్చర్యపోయారు. ఈ డ్రాలో ఆయన 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 250 గ్రాముల బంగారు కడ్డీని గెలుచుకున్నారు. భారత కరెన్సీలో దీని విలువ సుమారు రూ. 30 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ టికెట్‌ను తాను మరో 10 మంది స్నేహితులతో కలిసి వేర్వేరు పేర్లతో కొనుగోలు చేశానని నితిన్ తెలిపారు. గెలుచుకున్న ఈ బహుమతిని వారందరితో పంచుకుంటానని స్పష్టం చేశారు. తన జీవితంలో ఇలాంటి అదృష్టం వరించడం ఇదే మొదటిసారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కాగా, ఇటీవలే ఇదే బిగ్ టికెట్ సిరీస్ 280 డ్రాలో మరో ప్రవాస భారతీయుడైన శరవణన్ వెంకటాచలం 25 మిలియన్ల దిర్హమ్‌లు అంటే మన కరెన్సీలో సుమారు రూ. 60.42 కోట్లు గెలుచుకున్నారు. భారతీయులు తరచూ ఈ డ్రాలో విజేతలుగా నిలుస్తుండటం గమనార్హం.

# ఉద్రిక్తతలు మళ్లీ రాజేస్తున్న పాక్ రక్షణ మంత్రి వ్యాఖ్యలు!



**ఇస్లామాబాద్,నవంబరు 6:**, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మధ్య శాంతి స్థాపనే లక్ష్యంగా ఇస్తాంబుల్‌లో చర్చలు ఆరంభానికి ముందు పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలు రెండుదేశాలమధ్య ఉద్రిక్తతలను మళ్లీ రాజేస్తున్నాయి. తాలిబన్ ప్రభుత్వంతో యుద్ధం తప్పదని, అదే ఏకైక మార్గమని హెచ్చరించడం కలకలం రేపుతోంది. ఈ వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరగా, శాంతి యత్నాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. టెలివిజన్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్లతో సైనిక ఘర్షణే పరిష్కారమా?' అని విలేకరి అడిగిన ప్రశ్నకు అవును, యుద్ధం జరుగుతుందని ఖ్వాజా ఆసిఫ్ బదులిచ్చారు. సరిహద్దుల్లో వారాలుగా కొనసాగుతున్న భీకర దాడులు, డ్రోన్ దాడులకు ముగింపు పలకాలని టర్కీ, ఖతార్ మధ్యవర్తిత్వంతో నేటి నుంచి చర్చలు జరగనుండగా ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఉగ్రవాదులకు కాబూల్ ఆశ్రయం ఇస్తోందని, సరిహద్దులు దాటి దాడులకు పాల్పడుతున్నా తాలిబన్లు పట్టించుకోవడం లేదని ఆసిఫ్ ఆరోపించారు. మరోవైపు, పాకిస్థాన్ తమ పౌరులపై డ్రోన్ దాడులకు పాల్పడుతోందని, ఐసిస్ ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నా మోనంగా ఉందని ఆఫ్ఘనిస్థాన్ ఆరోపిస్తోంది. గత నెల దోహాలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని కాపాడేందుకు ఇస్తాంబుల్‌లో ఈ చర్చలు నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 30న జరిగిన గత విడత చర్చలు వాడీవేడిగా ముగిసినా, కాల్పుల విరమణను పొడిగించేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి. తాజా చర్చల్లో ఆఫ్ఘన్ బృందానికి ఇంటెలిజెన్స్ చీఫ్ అబ్దుల్ హక్ వాసిఖ్, పాక్ బృందానికి జాతీయ భద్రతా సలహాదారు, ఐఎస్ఐ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ముహమ్మద్ అసిమ్ నేతృత్వం వహిస్తున్నారు. భద్రతాపరమైన అంశాలకే ఇస్లామాబాద్ ప్రాధాన్యత నిస్తున్నట్లు దీని ద్వారా స్పష్టమవుతోంది. ఈ ఘర్షణల వల్ల ఇరు దేశాల మధ్య వాణిజ్యం పూర్తిగా స్తంభించిపోయింది. పాకిస్థాన్ వాణిజ్య మార్గాలను మూసివేయడంతో, ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన 8,000 కంటైనర్లు పాక్‌లో చిక్కుకుపోయాయని, మరో 4,000 దేశంలోకి ప్రవేశించడానికి వేచి ఉన్నాయని ఆఫ్ఘనిస్థాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ వెల్లడించింది.

## నగదు బదలీలతో రాష్ట్రాల్లో పెరుగుతున్న ఆర్థికలోటు!

**న్యూఢిల్లీ, నవంబరు 6:** మహిళలను లక్ష్యంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నగదు బదిలీ పథకాలు (యూసీటీ) వాటి ఆర్థిక వ్యవస్థలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. ఈ పథకాల వల్ల మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాలు సైతం రెవెన్యూ లోటులోకి జారిపోతున్నాయని 'పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్' అనే సంస్థ తన నివేదికలో హెచ్చరించింది. కేవలం మూడేళ్ల క్రితం రెండు రాష్ట్రాలకే పరిమితమైన ఇలాంటి పథకాలు, ఇప్పుడు దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలకు విస్తరించాయని ఈ నివేదిక పేర్కొంది. ఈ 12 రాష్ట్రాలు తమ ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పథకాల అమలు కోసం ఏకంగా రూ.1.68 లక్షల కోట్లు (1.68 ట్రిలియన్లు) వెచ్చిస్తున్నాయని తెలిపింది. ఇది రాష్ట్రాల ఖజానాపై మోయలేని భారంగా మారుతోందని విశ్లేషించింది. ఈ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్రాల్లో ఆరు రాష్ట్రాలు ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటును నమోదు చేశాయని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ తన నివేదికలో స్పష్టం చేసింది. నగదు బదిలీ పథకాల విస్తృతి రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థకు పెను సవాల్‌గా మారిందనడానికి ఇదే బలమైన నిదర్శనమని వ్యాఖ్యానించింది.



# భాగల్పూర్ ఊచకోత మరకలను తుడిచేయలేం

**భాగల్పూర్(బీహార్), నవంబరు 6:** బీహార్‌ను కుల, మత ప్రాతిపదికన కాంగ్రెస్, ఆర్‌జెడి పార్టీలు విభజించాయి... భాగల్పూర్ ఊచకోత మరకలను కాంగ్రెస్ ఎప్పటికీ కడగలేదని అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీవ్ర ఆరోపణలు చేశారు. గురువారం భాగల్పూర్ ఎన్నికల సభలో ప్రధాని మాట్లాడుతూ... "బీహార్‌ను ఆర్‌జెడి కుల అల్లర్లలో ముంచింది. కాంగ్రెస్ మత ఘర్షణలను ప్రేరేపించింది. సిక్కుల హత్యల మరకను చెరిపివేయలేనట్లే, భాగల్పూర్ ఊచకోత మరకను కాంగ్రెస్ రికార్డు నుండి ఎప్పటికీ తొలగించలేము" అని అన్నారు. ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీలు అనుసరిస్తున్న ఓట్ల రాజకీయాలు బీహార్ యువతను వలసల్లోకి నెట్టాయని ఆరోపణలు గుప్పించారు. విధ్వంస రాజకీయాలను ఆచరించే వారికి బీహార్ అభివృద్ధి నచ్చదు, వారి దుష్కార్యాల

> - వాళ్లదంతా విభజన రాజకీయం
> - కాంగ్రెస్-ఆర్‌జెడిలపై మోడీ ఫైర్
> - మళ్లీ ఎన్‌డిఎదే విజయమన్న ప్రధాని

కారణంగా, బీహార్ యువత వలసల శాపాన్ని అనుభవించాల్సి వచ్చింది. బీహార్ యువత బీహార్‌లో పనిచేసి బీహార్‌కు కీర్తిని తీసుకురావాలని ఎన్‌డిఏ నిశ్చయించుకుందన్నారు. కాంగ్రెస్, ఆర్‌జెడి కూటమిలో కూడా ఐక్యంగా లేవన్నారు. వారికి అధికారంతో సంబంధం లేదు, అయినప్పటికీ వారిలో ఒకరినొకరు తక్కువ చేసుకోవడంలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఆర్‌జెడి నాయకుల పోస్టర్లున్నాయి, అందులో ఒక్క కాంగ్రెస్ నాయకుడినైనా చూస్తున్నారు అంటూ సభికులను ప్రధాని మోడీ ప్రశ్నించారు. మరోవైపు కాంగ్రెస్ ర్యాలీలలో ఆర్‌జెడి నాయకుల పేర్లు ఉండటం లేదు. ఒకరి నీడకు ఒకరు భయపడేంత అంటరానితనం ఉంది. అందుకే ఆర్‌జెడి చేసిన ప్రకటనలపై కాంగ్రెస్ నాయకులు మౌనంగా ఉన్నారని మోడీ విమర్శలు గుప్పించారు. అంతకు ముందు అరారియాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ మహాకూటమిని లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు గుప్పించారు. 15 ఏళ్ల ఆర్‌జెడీ జంగిల్ రాజ్ వల్ల రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. జంగిల్ రాజ్ కాలంలో ఎన్ని ఎక్స్‌ప్రెస్ వేలు, వంతెనలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, టూరిస్ట్ సర్క్యూట్‌లు నిర్మించారు అంటే వచ్చే సమాధానం సున్నా అని మోడీ విమర్శించారు. 1990 నుంచి 2005 వరకు సాగిన జంగిల్ రాజ్ వల్ల యావత్ బిహార్ రాష్ట్రం నాశనమైందన్నారు.

ప్రభుత్వాన్ని నడుపుతున్నామనే పేరుతో ఖజానాను ఆర్‌జెడి లూటీ చేసిందని ఆరోపించారు. "పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓట్లు వేస్తున్న ప్రజలకు నా అభినందనలు. అందరూ తప్పకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలి. మళ్లీ తప్పకుండా ఎన్‌డిఏ కూటమే గెలుస్తుంది. రాష్ట్ర ప్రజలంతా ఇదే అనుకుంటున్నారు. రాష్ట్ర ప్రజల స్వప్నాలను, లక్ష్యాలను సాకారం చేయడమే మోడీ పని. ఇది మోడీ గ్యారంటీ అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.



## కర్ణాటక సిఎం సిద్ధరామయ్యకు ఎదురు దెబ్బ..

### అప్పీల్‌కు హైకోర్టు తిరస్కృతి

**బెంగళూరు, నవంబర్ 6:** కర్ణాటక హైకోర్టులో సిద్ధరామయ్య సర్కార్‌కు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వ సంస్థల్లో ప్రైవేట్ సంస్థల కార్యకలాపాలను పరిమితం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై గతంలో హైకోర్టు ధార్వాడ్ సింగిల్ జడ్జి బెంచ్ స్టే ఇచ్చింది. సింగిల్ జడ్జి నిర్ణయాన్ని ప్రభుత్వం సవాల్ చేసింది. స్టే విషయంలో అదే బెంచ్‌కు వెళ్లాలని న్యాయమూర్తులు ఎస్‌జి పండిట్, గీతా కేబిలతో కూడిన డివిజన్ బెంచ్ ప్రభుత్వానికి సూచించింది. అయితే, సిద్ధరామయ్య ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ ప్రాంగణాల్లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని నిర్వహించే ముందు ప్రైవేట్ సంస్థలు పరిపాలనా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా కార్యక్రమం, ఊరేగింపు నిబంధనల ప్రకారం చట్టవిరుద్ధమని పేర్కొంది.

# డ్రగ్స్‌కోసం దక్షిణాదివైపు చూపు!

## ఎల్టీటిఇతో డి గ్యాంగ్ సంప్రదింపులు

**న్యూఢిల్లీ, నవంబరు 6:** దేశంలో అండర్‌వరల్డ్ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా ఉన్న దావూద్ ఇబ్రహీం సిండికేట్ (డీగ్యాంగ్) ఇప్పుడు తన డ్రగ్స్ వ్యాపారాన్ని దక్షిణ భారతదేశానికి విస్తరించేందుకు భారీ కుట్రలుస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్‌లలో కార్యకలాపాలు దెబ్బతినడంతో దక్షిణాది మార్కెట్‌పై కన్నేసింది. ఇందుకోసం ఒకప్పటి శ్రీలంక మిలిటెంట్ సంస్థ లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ) నెట్‌వర్క్‌ను వాడుకునేందుకు ప్రయత్నిస్తోందని భారత నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ రెండు ప్రమాదకర శక్తులు చేతులు కలపడం దేశ భద్రతకు పెను సవాల్‌గా మారనుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిఘా వర్గాలు సేకరించిన సమాచారం ప్రకారం, డీగ్యాంగ్ సభ్యులు శ్రీలంక, భారత్‌లోని మాజీ ఎల్‌టీటీఈ కార్యకర్తలు, సానుభూతిపరులతో సంప్రదింపులు జరుపుతున్నారు. డ్రగ్స్ రవాణాకు అనువైన మార్గాలను గుర్తించి, వ్యాపారాన్ని నడిపించేందుకు వారి సహాయం కోరుతున్నారు. శ్రీలంక సైన్యం చేతిలో దారుణంగా దెబ్బతిని, నిధుల కొరతతో బలహీనపడిన ఎల్‌టీటీఈకి ఇది ఒక అవకాశంగా కనిపిస్తోంది. డీగ్యాంగ్‌తో పొత్తు ద్వారా వచ్చే డబ్బుతో మళ్లీ పుంజుకోవాలని, కొత్తగా సభ్యులను చేర్చుకుని, ఆయుధాలు సమకూర్చుకోవాలని ఎల్‌టీటీఈ భావిస్తున్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) సైతం తన దర్యాప్తులో గుర్తించింది. ఈ కలయిక ఇరు వర్గాలకూ ప్రయోజనకరంగా ఉంది. డీగ్యాంగ్‌కు డబ్బు, వనరులు ఉన్నాయి. కానీ, దక్షిణాదిలోని భూ, సముద్ర మార్గాలపై వారికి పట్టు లేదు. మరోవైపు ఎల్‌టీటీఈకి ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉంది. వారి నెట్‌వర్క్, అనుభవం డీ గ్యాంగ్‌కు డ్రగ్స్ రవాణాలో కీలకం కానున్నాయి. గతంలో పాక్ జలసంధి మీదుగా జరిగే డ్రగ్స్ దందా మొత్తం ఎల్‌టీటీఈ నియంత్రణలోనే ఉండేది. 1980ల నుంచే ఈ వ్యాపారంలో ఉన్న ఎల్‌టీటీఈ, శ్రీలంకను అంతర్జాతీయ డ్రగ్స్ రవాణాకు కేంద్రంగా మార్చింది. సుమారు మూడేళ్ల క్రితం కూడా ఎల్‌టీటీఈ సభ్యులు శ్రీలంక నుంచి భారత్‌కు ఆయుధాలు, డ్రగ్స్



స్మగ్లింగ్ చేస్తూ లక్షద్వీప్ వద్ద అధికారులకు పట్టుబడ్డారు. ఇప్పుడు డీగ్యాంగ్‌తో జతకట్టడం ద్వారా వారి కార్యకలాపాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. ఎల్‌టీటీఈ పునరుజ్జీవం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టమేనని అధికారులు భావిస్తున్నప్పటికీ, డీగ్యాంగ్ దక్షిణాది మార్కెట్‌ను చేజిక్కించుకోవడం మాత్రం అతిపెద్ద ముప్పుగా పరిగణిస్తున్నారు. డీగ్యాంగ్, ఎల్‌టీటీఈల ఈ కొత్త బంధం భద్రతా సంస్థలకు పెను తలనొప్పిగా మారింది.

# భారత్, పాక్ యుద్ధం ఆపింది నేనే

## ఏడుకాదు, 8 జెట్లు కూలిపోయాయి: మయామి బిజినెస్ ఫోరంలో అధ్యక్షుడు ట్రంప్

**మయామి(యుఎస్ఎ), నవంబరు 6:** భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని, తనవల్లే ఇరు దేశాల మధ్య శాంతి నెలకొందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందాలను రద్దు చేస్తానని బెదిరించడంతోనే అణుశక్తి దేశాలైన భారత్, పాక్‌లు వెనక్కి తగ్గాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఆ ఘర్షణలో కూల్చేసిన ఫైటర్ జెట్ల సంఖ్య ఏడు కాదని, ఎనిమిది అని కొత్త లెక్క చెప్పారు. మయామిలో జరిగిన అమెరికా బిజినెస్ ఫోరంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాను అధ్యక్షుడయ్యాక ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది ఘర్షణలను ఆపేశానని, అందులో భారత్‌పాక్ వివాదం కూడా ఒకటని ట్రంప్ చెప్పుకొచ్చారు. నేను భారత్, పాకిస్థాన్‌లతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతున్నాను. అదే సమయంలో వారు యుద్ధానికి సిద్ధమవుతున్నారని ఓ పత్రికలో చదివాను. ఏడు విమానాలు కూల్చివేశారని, ఎనిమిదోది తీవ్రంగా దెబ్బతిందని తెలిసింది. అంటే దాదాపు 8 విమానాలు కూలిపోయాయి. ఇది యుద్ధమే అని గ్రహించాను. మీరు శాంతికి అంగీకరించకపోతే మీతో ఎలాంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోబోనని ఇరు దేశాలకు స్పష్టం చేశానని ట్రంప్ వివరించారు. తమ దేశాల వివాదానికి, వాణిజ్యానికి సంబంధం లేదని తొలుత ఇరు దేశాలు వాదించాయని ట్రంప్ తెలిపారు. మీవి అణ్వస్త్ర దేశాలు. ఒకరితో ఒకరు యుద్ధం చేసుకుంటే మీతో నేను వ్యాపారం చేయను అని కరాఖండిగా చెప్పాను. ఆ మరుసటి రోజే ఇరు దేశాలు శాంతికి అంగీకరించాయని నాకు ఫోన్ వచ్చింది. అప్పుడు నేను 'థాంక్యూ, ఇప్పుడు వ్యాపారం చేద్దాం' అన్నాను. ఇదంతా సుంకాల వల్లే సాధ్యమైంది" అని ట్రంప్ చెప్పగానే సభికులు హర్షధ్వానాలు చేశారు. అయితే, ట్రంప్ వాదనను భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా ఎలాంటి మధ్యవర్తిత్వం వహించలేదని స్పష్టం చేసింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు 26 మంది పౌరులను చంపినందుకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిందని గుర్తుచేసింది.

# మిస్‌వరల్డ్‌పోటీల్లో హైడ్రామా

## వాకౌట్‌చేసిన మిస్ మెక్సికోభామ

**బ్యాంకాక్, నవంబరు 6:** థాయ్‌లాండ్ లో 74వ విశ్వసుందరి పోటీల్లో హైడ్రామా చోటుచేసుకుంది. ఆతిథ్య దేశానికి చెందిన ఓ అధికారికి, మెక్సికో భామకు మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం బహిరంగ క్షమాపణలు చెప్పుకునే వరకు వెళ్లింది. ఈ వివాదం మొత్తం ఫేస్‌బుక్‌లో లైవ్‌స్ట్రీమ్ కావడంతో నెట్టింట్లో వైరల్‌గా మారింది. మిస్ యూనివర్స్ పోటీల్లో పాల్గొన్న మిస్ మెక్సికో ఫాతిమా బోష్ ఒక షూట్‌కు హాజరుకాలేదు. మిస్ యూనివర్స్ థాయ్‌లాండ్ నేషనల్ డైరెక్టర్, మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవాత్ ఆమె గైర్హాజరుపై ప్రశ్నించారు. తెలివితక్కువ మనిషి అనే అర్థం వచ్చేలా ఆమెను నిందించారు. దాంతో ఆమె ఎదురుతిరిగారు. మీరు మమ్మల్ని గౌరవించినట్లే మేం మిమ్మల్ని గౌరవిస్తాం. ఇక్కడ నేను నా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా. నా దేశ సంస్థతో మీకు ఏదైనా సమస్య ఉంటే అందులోకి నన్ను లాగకండి' అని తీవ్రంగా స్పందించారు. 'ముందుగా నా మాట విని, ఆ తర్వాత వాదించండి' అంటూ నవాత్ బదులిచ్చారు. ఆ విధంగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఫాతిమాతోపాటు మరికొన్ని దేశాలకు చెందిన కంటెస్టెంట్‌లు వేదిక నుంచి వాకౌట్ చేశారు. తర్వాత ఆమె బయటకు వచ్చి తన అసహనాన్ని వెళ్లగక్కారు. ఈ వ్యవహారం ఫేస్‌బుక్‌లో లైవ్ స్ట్రీమింగ్ అయింది. నవాత్‌పై విమర్శలు వ్యక్తం కావడంతో ఆ డైరెక్టర్ క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది.

# పిఓకెలో 'జెన్‌జీ' ఆందోళనలు ఉద్ధృతం - షరీఫ్‌ప్రభుత్వానికి కొత్త తలనొప్పి

**ముజఫరాబాద్, నవంబరు 6:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ పీవోకే లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. గత నెలలో పన్నులు, సబ్సిడీల కోసం జరిగిన హింసాత్మక ఆందోళనలు సద్దుమణగక ముందే ఇప్పుడు విద్యార్థులు రోడ్డెక్కారు. విద్యా సంస్కరణలు, అధిక ఫీజులకు వ్యతిరేకంగా 'జెన్‌జీ'యువతరం ప్రారంభించిన ఈ నిరసనలు హింసాత్మకంగా మారడంతో స్థానికంగా తీవ్ర గందరగోళం నెలకొంది. ముజఫరాబాద్‌లోని విశ్వవిద్యాలయాల్లో ఈ నిరసనలు ప్రారంభమయ్యాయి. సెమిస్టర్ ఫీజుల పేరుతో ప్రతి 34 నెలలకు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని యూనివర్సిటీ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మరోవైపు, ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన డిజిటల్ అసెస్‌మెంట్ సిస్టమ్ (ఈమార్కింగ్) వల్లే అక్టోబర్ 30న విడుదలైన మొదటి సంవత్సరం ఫలితాల్లో తమకు ఊహించిన దానికంటే తక్కువ మార్కులు వచ్చాయని వారు మండిపడుతున్నారు. కొందరైతే పరీక్షలకు హాజరుకాని విద్యార్థులు కూడా పాస్ అయ్యారని ఆరోపించడం గమనార్హం. శాంతియుతంగా జరుగుతున్న ఈ నిరసనలు ఇటీవల హింసాత్మకంగా మారాయి. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై గుర్తుతెలియని వ్యక్తి కాల్పులు జరపడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఆగ్రహించిన విద్యార్థులు టైర్లకు నిప్పుపెట్టి, విధ్వంసానికి పాల్పడ్డారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ



పరిణామాలు ఇటీవల నేపాల్, బంగ్లాదేశ్‌లలో జరిగిన విద్యార్థి ఉద్యమాలను గుర్తుచేస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆందోళనలతోనే షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలింది.

## సంక్షిప్తంగా..

### క్రమశిక్షణ గల సైనికుడిని : డికె



**బెంగళూరు, నవంబరు 6:** కర్ణాటకలో గత కొద్దికాలంగా ముఖ్యమంత్రి మార్పుపై పెద్దయెత్తున ప్రచారం జరుగుతున్నది. త్వరలోనే డికె శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారని పెద్దయెత్తున వార్తలు వచ్చాయి. నవంబరులో విప్లవం పేరుతో వస్తున్న ఊహాగానాలను కర్ణాటక డిప్యూటీ ముఖ్యమంత్రి డికె శివకుమార్ తోసిపుచ్చారు. నవంబరు, డిసెంబరులో విప్లవం ఉండదని.. 2028లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు మాత్రమే జరుగుతుందన్నారు. తాను పార్టీకి క్రమశిక్షణ కలిగిన సైనికుడినని.. సిఎం సిద్ధరామయ్యతో కలిసి పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటానన్నారు, ఇటీవల సిఎం మార్పు జరిగే అవకాశం ఉందని.. దీన్ని కొందరు నవంబరు విప్లవం అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై శివకుమార్ స్పందిస్తూ.. తాను ఎవరినీ కలవబోవడం లేదని.. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఎలాంటి చర్చ జరుగలేదన్నారు.

### ముంబయి మోనోరైలుకు ప్రమాదం!

**ముంబయి, నవంబరు 6:** ముంబైలో కొత్తగా కొనుగోలు చేసిన మోనోరైలుకు ప్రమాదం జరిగింది. వడాలా డిపోలో నిన్న ఉదయం ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా, ఒక ఖాళీ కోచ్ పట్టాలు తప్పి ట్రాక్ బీమ్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రైన్ కెప్టెన్ సహా ముగ్గురు సిబ్బంది గాయపడ్డారు. ప్రమాద సమయంలో రైలులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో వడాలా డిపో నుంచి సిగ్నలింగ్ ట్రయల్స్ కోసం కొత్త రైలును బయటకు తీశారు. ట్రాక్ క్రాసోవర్ పాయింట్ వద్దకు రాగానే మొదటి కోచ్ అదుపుతప్పి పట్టాల నుంచి పక్కకు జరిగి, సమీపంలోని స్తంభాన్ని ఢీకొట్టింది.



దీంతో కోచ్ ముందు భాగం గాల్లోకి లేవగా, వెనుక భాగం ఒకవైపునకు ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో బోగీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చిన్న సంఘటనగా అభివర్ణించిన నిర్వాహక సంస్థ మహా ముంబై మెట్రో ఆపరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఎంఎంవోసీఎల్), ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలిపింది.

### జమ్ము నుంచి శ్రీనగర్‌కు నేరుగా రైల్వే కనెక్టివిటీ!

**జమ్ము, నవంబరు 6:** జమ్మూ కశ్మీర్ రైల్వే కనెక్టివిటీలో ఈ ఏడాది చివరి నాటికి జమ్మూ నుంచి శ్రీనగర్‌కు నేరుగా రైలు సర్వీసు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన పనులను ఈ నెల 30 లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ సర్వీసు అందుబాటులోకి వస్తే, దేశంలోని ఇతర ప్రాంతాలతో కశ్మీర్ లోయకు రైలు మార్గం ద్వారా ప్రత్యక్ష సంబంధం ఏర్పడుతుంది. ప్రస్తుతం రియాసి జిల్లాలోని కాట్రా పట్టణం నుంచి కశ్మీర్‌కు వందే భారత్ రైలు నడుస్తోంది. అయితే, జమ్మూ నుంచి నేరుగా శ్రీనగర్‌కు రైలును నడపాలనే లక్ష్యంతో నార్తర్న్ రైల్వే పనులను వేగవంతం చేసింది. జమ్మూ డివిజన్‌లో ఆపరేషనల్, పునరాభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. గతంలో ఆకస్మిక వరదల కారణంగా పనుల్లో కొంత జాప్యం జరిగిందన్నారు.

### భారత్ ట్రావెల్ ఇన్‌ఫ్లుయెన్సర్ అమెరికాలో మృతి



వాషింగ్టన్, నవంబర్6: భారత్‌కు చెందిన ప్రముఖ ట్రావెల్ ఇన్‌ఫ్లుయెన్సర్, ఫొటోగ్రాఫర్ అనునయ్ సూద్ (32) మృతి చెందారు. ఆయన కుటుంబసభ్యులు ఇన్‌స్టా పోస్ట్‌లో వెల్లడించారు. దీంతో ఆయన అభిమానులు, ఫాలోవర్లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనునయ్ మృతికి గల కారణాలు తెలియరాలేదు. అయితే చివరిసారిగా ఆయన లాస్‌వేగాస్ నుంచి సోషల్ మీడియా పోస్ట్ చేశారు. దీంతో అమెరికాలోనే మృతి చెందినట్లు తెలుస్తోంది. నోయిడాకు చెందిన అనునయ్ సూద్ దుబాయ్ కేంద్రంగా ట్రావెల్ ఫొటోగ్రాఫర్‌గా పేరు తెచ్చుకున్నారు. ఇప్పటి వరకు 46 దేశాల్లో పర్యటించినట్లు తన ఇన్‌స్టా బయోలో పేర్కొన్నారు. ఆయన ఇన్‌స్టా ఖాతాకు 14 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. యూట్యూబ్‌లో 3.80 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. సినిమాటిక్ తరహాలో రీల్స్, కొత్త కొత్త ప్రదేశాల్లో పర్యటనలకు సంబంధించిన వీడియోలతో మంచి గుర్తింపు సాధించారు. 2022, 2023, 2024లో వరుసగా మూడుసార్లు ఫోర్బ్స్ ఇండియా టాప్ 100 డిజిటల్ స్టార్స్ జాబితాలో చోటు దక్కించుకున్నారు.

# సైబర్ ఉచ్చులో అభాగ్యుడు

## రూ.22.80 లక్షలు పోగొట్టుకున్న టీచర్

బొబ్బిలి (విజయనగరం జిల్లా), నవంబరు 6 ప్రభాతవార్త: విజయనగరం జిల్లా బొబ్బిలిలో సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో ఓ అభాగ్యుడు చిక్కుకున్నాడు. సైబర్ నేరగాళ్ళు వేసిన వలలో చిక్కుకున్న ఒక ఉపాధ్యాయుడు రెండు నెలల పాటు నరకయాతన పడుతూ అక్షరాలా రూ.22.80 లక్షలు సమర్పించుకున్నాడు. మీరు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఢిల్లీ, ముంబైలో మీపై సీబీఐ కేసులు నమోదయ్యాయి అంటూ ఫోన్ చేసి బెదిరించిన సైబర్ నేరగాళ్ళు సదరు ప్రభుత్వ ఉపాధ్యాయుడి నుంచి రెండు నెలల్లో సొమ్ము రాబట్టుకున్నారు. ఆ ఉపాధ్యాయుడికి సెప్టెంబర్ 16న గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. అవతల వ్యక్తి తనను సిబిఐ అధికారిగా పరిచయం చేసుకొని మీరు లైంగిక వేధింపులు, మహిళల అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, దీనిపై మీ మీద ముంబై, ఢిల్లీలో సిబిఐ కేసులు కూడా నమోదు అయ్యాయని చెప్పాడు. ఇందుకు సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయి అని కూడా ఉపాధ్యాయుడిని బెదిరించాడు. సదరు ఆగంతకుడు ఆ తర్వాత కూడా వీడియో కాల్ చేసి పోలీస్ దుస్తులలో ఉపాధ్యాయుడికి దర్శనమిచ్చాడు. అంతేకాకుండా కోర్టు దృశ్యాలను చూపించి మరీ భయపెట్టి బెదిరించాడు. ఈ కేసుల నుంచి బయటకు రావాలంటే ఫైన్ కింద కొంత డబ్బు చెల్లించాలని, మీరు తప్పు చేయలేదని తేలితే డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికాడు. రిజర్వ్ బ్యాంక్ రాజముద్రతో కూడిన రసీదు కూడా పంపడంతో ఆ ఉపాధ్యాయుడు నిజమేననుకొని నమ్మేశాడు. ఆ తరువాత సదరు ఆగంతకుడు చెప్పిన ఖాతాలకు దశల వారీగా 22.80 లక్షల రూపాయలు ఆ ఉపాధ్యాయుడు చెల్లించాడు. ఇది జాతీయ భద్రతా వ్యవహారం కాబట్టి ఎవరికీ చెప్పకూడదని సైబర్ నేరగాళ్ళు ఉపాధ్యాయుడిని బెదిరించారు. దీంతో ఆయన ఎవరికీ చెప్పకుండా బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి కొంత స్నేహితుల దగ్గర అప్పు తీసుకొని యూపీఐ పేమెంట్ మోడ్‌లో ఆరు విడతలుగా సదరు అగంతకుడికి ముట్టచెప్పారు. ఆ తరువాత అటు నుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన ఉపాధ్యాయుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ విషయంపై సిఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, బొబ్బిలిలో ఇది మూడవ సంఘటన అని పేర్కొన్నారు.

### హాస్టల్ బాత్రూమ్‌లో సిసి కెమెరా

# యువతి బాయ్‌ఫ్రెండ్ అరెస్ట్

కుప్పం, నవంబరు 6 ప్రభాతవార్త: తమిళనాడులోని హొసూరు నగరంలో ఓ ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థలో పనిచేసే మహిళలు ఉంటున్న హాస్టల్ బాత్రూమ్‌లో సిసి కెమెరా ఏర్పాటు సంఘటన కలకలం రేకెత్తించిన విషయం విదితమే. ఈ సంఘటనలో కృష్ణగిరి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఒడిశాకు చెందిన యువతిని ఇదివరకే అదుపులో తీసుకోగా, బెంగళూరులో ఉంటున్న యువతి బాయ్‌ఫ్రెండ్ సంతోష్ (25)ను అరెస్ట్ చేశారు. అలాగే సిసి కెమెరాల డివైజ్‌ను స్వాధీనం చేసుకున్నారు. తన బాయ్‌ఫ్రెండ్ సంతోష్ సూచనల మేరకే యువతి బాత్రూమ్‌లో సిసి కెమెరా బిగించినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో నిర్ధారించినట్లు సమాచారం. కాగా సుమారు ఆరువేల మంది మహిళలు ఉంటున్న హాస్టళ్ల భవనాలను కృష్ణగిరి పోలీసు ఉన్నతాధికారులు, మహిళా పోలీసులు పదిబృందాలుగా ఏర్పడి ఇంకెక్కడైనా సిసి కెమెరాలు పెట్టారా అనే అంశంగా తనిఖీలు చేస్తున్నారు. అలాగే స్వాధీనం చేసుకున్న హైడెన్ కెమెరా పుటేజ్ పరిశీలిస్తున్నారు. కాగా పలువురు మహిళా ఉద్యోగినులు ఈ సంఘటన నేపథ్యంలో తమ ఉద్యోగాలు వదిలి స్వస్థలాలకు వెళుతున్నట్లు స్థానికులు తెలిపారు.

## గుంతకల్లు రైల్వే డివిజన్‌లో

# డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపులు

గుంతకల్లు రైల్వే, నవంబరు 6 ప్రభాతవార్త: దక్షణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో పదవీ విరమణ చేసిన రైల్వే పెన్షనర్ల సౌకర్యార్థం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ 4.0లకై ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసినట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. కేంద్ర పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ శాఖ, రైల్వేబోర్డు, జోనల్ అధికార యంత్రాంగం ఆదేశాల మేరకు పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లకై ఎలాంటి ఇబ్బందులు పడకుండా, పెన్షనర్ల సౌకర్యార్థం గుంతకల్లు రైల్వే డివిజన్, ఆయా బ్యాంకుల సమన్వయంతో ఈనెల 13న గుంతకల్లులో, 17న గుత్తిలో, 21న రేణిగుంటలో, 25న పాకాలలో, 27న రాయచూర్‌లలో జీవన్ ప్రమాణ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కావున రైల్వే పెన్షనర్లు తమ తమ పెన్షన్ పేమెంట్ ఆర్డర్, ఆధార్, బ్యాంకు ఖాతా పాస్ బుక్‌లను, బ్యాంకు ఖాతాతో లింక్ ఉన్న మొబైల్ ఫోన్, పాన్ కార్డు, ఓటర్ ఐడి కార్డులను తీసుకొని ఆయా రైల్వే స్టేషన్లలోని జీవన్ ప్రమాణ్ కేంద్రాలకు వెళ్ళి తమ తమ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌లను పొందాలని సూచించారు.

# బ్యాంకింగ్ ఓ సామాజిక బాధ్యత

సచివాలయం, నవంబరు 6 ప్రభాతవార్త: ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్ధించడానికి ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫడరేషన్ జనరల్ సెక్రటరీ రూపం రాయ్ తీవ్రంగా వ్యతిరేకించారు. బ్యాంకులను ప్రైవేటు పరం చేయడం వలన ఉద్యోగ భద్రత దెబ్బతినడం, కాంట్రాక్టు పనులు పెరగడం, ముఖ్యంగా రిజర్వేషన్ హక్కులు తగ్గటం జరుగుతుందని, ప్రజల నిధులు ప్రమాదంలో పడతాయన్నారు. దేశ ఆర్థిక సమగ్రత, సామాజిక ప్రయోజనాలపై దుష్ప్రభావం పడుతుందన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు భారత ప్రజల ఆస్తి అని ప్రైవేటు లాభాల కోసం కాదన్నారు. ప్రభుత్వ బ్యాంకులు సాధారణ ప్రజలకు, ఉద్యోగులకు, రైతులకు, పింఛన్‌దారులకు ఎంతో మద్దతు, ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ప్రవేటు బ్యాంకులు కేవలం లాభార్జన కోసం పనిచేస్తాయన్నారు. ఏఐబిఓసి తరపున యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణను మరియు అమ్మకానికి అనుమతించమని, అవి జాతీయ ఆస్తులన్నారు. ఏఐబిఓసి తరుపున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెసిడెంట్ శేషసాయి, రాష్ట్ర సెక్రటరీ జయకుమార్ మాట్లాడుతూ బ్యాంక్ యూనియన్ కార్యాచరణ గురించి త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.



## ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి

# ఎలివేటెడ్ కారిడార్ ఉత్తమం

● ఎన్‌హెచ్ 65 విస్తరణ ప్రతిపాదనల్లో మార్పులు అవసరం ● ఎన్టీఆర్, కృష్ణ జిల్లాల కలెక్టర్లు జి. లక్ష్మీశ, డి.కె.బాలాజీ

విజయవాడ, నవంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్‌హెచ్ 65ను విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు ఆరు వరుసలుగా విస్తరించే ప్రతిపాదనల్లో మార్పులు అవసం మని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు డాక్టర్ జి. లక్ష్మీశ, డి. కె.బాలాజీలు అభిప్రాయపడ్డారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఎన్టీఆర్, కృష్ణ జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో ఎన్‌హెచ్ 65 విస్తరణ ప్రతిపాదనలపై ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజా ప్రతినిధులు, ఎన్‌హెచ్ఎఐ, మెట్రో రైల్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్‌హెచ్ 65 విస్తరణకు సంబంధించి మెట్రో అధికారులతో కలిసి మూడు ఆకృతులను (డిజైన్లను) సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రస్తుత ఆకృతి (డిజైన్)లో బెంజ్ సర్కిల్ నుంచి చినఓగిరాల వరకు ఉన్న ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించలేదని చెప్పారు. ప్రతిపాదించిన వెహికల్ అండర్ పాస్ (వియుసి)లు తక్కువగా ఉన్నాయని, వీటిని పెంచే అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ మాట్లాడుతూ... ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎలివేటెడ్ కారిడార్ ఉత్తమమన్నారు. విజయవాడ నగర శివారు ప్రాంతాల నుంచి ట్రాఫిక్ పెరుగుతుందని, పోర్ట్ ట్రాఫిక్ కూడా కలిస్తే మరింత రద్దీగా మారుతుందని, కనుక ఎలివేటెడ్ కారిడార్‌పై దృష్టి సారించాలన్నారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజాలు మాట్లాడుతూ ఎన్‌హెచ్ 65ను ఎన్‌హెచ్ 16తో అనుసంధానించాలని, దీనికై మూడుచోట్ల రహదారులు నిర్మించాలని సూచించారు. వెహికల్ అండర్‌పాస్‌లను పెంచాలని పేర్కొన్నారు. అన్ని కూడళ్లలో బెల్ మోత్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియ, కృష్ణా జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్డిఓ చైతన్య, ఎన్‌హెచ్ఏఐ పీడీ విద్యాసాగర్, మెట్రో రైలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ ఏర్పాటులో

# ఎన్ఆర్ఐల కృషి అభినందనీయం




విజయవాడ, నవంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి: అందరం కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మించుకుందాన్న నినాదంతో ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ఎన్ఆర్ఐల కృషి అభినందనీయమని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. గురువారం లండన్‌లో నిర్వహించిన జనసైనికుల ఆత్మీయ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. అమెరికా, లండన్, గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలుగు వారందరూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఇంతటి బిజీ లైఫ్‌లో కూడా ఏపీ గురించి ఆలోచించడం, ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన రావాలని ఎన్ఆర్ఐలు పడ్డ తపనకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం, మాతృభూమి అభివృద్ధికి తోడ్పడటం, వివిధ రంగాలలో తమ ప్రతిభను చాటడం, మరియు సాంస్కృతిక అనుబంధాన్ని బలోపేతం చేయడంలో ఎన్ఆర్ఐల పాత్ర అమోఘమన్నారు. ఈ సందర్భంగా ఏపీ పర్యాటకాభివృద్ధికి తమ వంతు సహకరిస్తామని ఎన్ఆర్ఐలు తెలిపారు.

## ఎపి ట్రాన్స్‌కో కార్యకలాపాలపై

# ఫొటోగ్రఫీ పోటీలు

విజయవాడ, నవంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ ఉద్యోగులకు, ప్రజలకు వారి ప్రతిభను, సృజనాత్మకతను కనబరిచే విధంగా అవకాశమిస్తూ ఎపి ట్రాన్స్‌కో కార్యకలాపాలపై ఫొటోగ్రఫీ పోటీలు (కాంటెస్ట్) ఏర్పాటు చేసినట్లు ఎపి ట్రాన్స్‌కో జెఎండి జి. సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫొటోగ్రఫీ పోటీలు అటు సృజనాత్మకతను ప్రోత్సహించడంతోపాటు, ఉద్యోగుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, రాష్ట్రవ్యాప్తంగా విశ్వసనీయమైన విద్యుత్ ప్రసారాన్ని నిరంతరంగా కొనసాగించే విద్యుత్ సిబ్బంది కృషిని గుర్తించడమే లక్ష్యమని జెఎండీ తెలిపారు. ఈ పోటీల్లో విద్యుత్ సిబ్బందే కాకుండా ప్రజలందరూ పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. విద్యుత్ రంగం సాంకేతికత, మౌలిక సదుపాయాలతో పాటు ప్రజల జీవితాలను వెలిగించే లక్షలాది మంది ఇంజనీర్లు, సిబ్బంది అంకితభావం, నూతన ఆలోచనలు, దృఢత్వాన్ని ప్రతిబంబించేలా ఈ పోటీల్లో పాల్గొనే వారు ఫొటోలు తీసి సంబంధిత మెయిల్‌కు పంపించాలని సూచించారు. ఇతర సమాచారం కొరకు ప్రభుత్వ వెబ్ సైట్ నుండి పొందవచ్చని జెఎండి తెలిపారు.

# గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో

# సమగ్ర మార్పులు

### ప్రజల కోరిక మేరకే సచివాలయాల పేరు మార్పు

### మంత్రి బాల వీరాంజనేయస్వామి వెల్లడి

అమరావతి, నవంబరు 6 ప్రభాతవార్త: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర మార్పులు తీసుకొస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, గ్రామ, వార్డు సచివాలయముల, వాలంటీర్ల శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ప్రజల వద్దకే పాలనను పరిచయం చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదే. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు లేకుండా, వ్యవస్థపై పర్యవేక్షణ లేకుండా సచివాలయ వ్యవస్థను గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా తయారు చేసింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు కనీసం జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ కూడా ఇవ్వకుండా గత ప్రభుత్వం వారి జీవితాలతో ఆడుకుంది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సమగ్ర మార్పులు తీసుకొస్తున్నారు. సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్ ఛానల్ కల్పించాం. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో మూడు అంచల వ్యవస్థను తీసుకొస్తున్నాం. సచివాలయ ఉద్యోగుల అభ్యర్థన మేరకు యూనిఫామ్ నిబంధన తొలగించాం. ప్రజల కోరిక మేరకే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ పేరు మార్చుతున్నామని, ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన పేరు పెట్టబోతున్నామని మంత్రి బాల వీరాంజనేయస్వామి తెలిపారు.



# అశోక చక్రం పుస్తకావిష్కరణ

విజయవాడ, నవంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి: సమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా అక్షరమే ఆయుధంగా సాహితీ పోరాటం చేస్తున్న సింగంపల్లి అశోక్ కుమార్ అభినందనీయుడు అని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం గవర్నర్ పేటలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటి హాల్‌లో ప్రముఖ కవి, శ్రీశ్రీ సాహిత్య నిధి కన్వీనర్ సింగంపల్లి అశోక్ కుమార్ సాహితీ సేవలకు గుర్తింపుగా పలువురి అభిప్రాయాలతో కూడిన అశోక చక్రం పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిధిగా లక్ష్మీనారాయణ, ప్రముఖ వైద్యురాలు జ్వలిత, విప్లవ రచయితల సంఘం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, జనసాహితి అధ్యక్షుడు దివికుమార్, సాహితీ స్రవంతి భాధ్యులు సత్యాజీ, ప్రజాసాహితి సంపాదకులు కొత్తపల్లి రవిబాబులతోపాటు సింగంపల్లి కుమారి, కందికొండ రవికిరణ్, బి ఆంజనేయ రాజు, గోళ్ళ నారాయణరావు, గుమ్మా సాంబశివరావు, శ్రీశ్రీ విశ్వేశ్వరరావు, కోగిలి రాజశేఖర్, సామినేని శైలజ, కెల్లా జయశ్రీ, ఎపి మేధావులు ఫోరం ఘంటా విజయ్ కుమార్, మల్లెతీగ సాహిత్య, సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ కవి సరికొండ నరసింహారాజులు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి ఇళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హెచ్ వి.వెంకటేష్

## డిసెంబరులో పెద్దపల్లి నుంచి

# తిరుపతికి రైలు

పావగడ, నవంబరు 6 ప్రభాతవార్త: డిసెంబర్ నెలలో పావగడ తాలూకాలోని పెద్దపల్లి నుంచి తిరుపతికి రైలును ప్రారంభిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే, తుముల్ అధ్యక్షుడు, డిసిసి బ్యాంక్ డైరెక్టర్ హెచ్‌వి వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం పావగడ పట్టణంలో గృహ భాగ్య యోజనలో రూ.కోటి 35 లక్షలతో 17మంది పౌర కార్మికులకు నిర్మించిన ఇళ్లను ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని కావలిగెరెలో రూ.95 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేశారు అనంతరం మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన పౌర కార్మికుల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పట్టణాలు సుందరంగా ఉండాలంటే పౌరకార్మికుల పాత్ర చాలా ముఖ్యమన్నారు. పట్టణ ప్రజలు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా ఉండాలని సూచించారు. త్వరలోనే మిగిలిన పౌర కార్మికులకు కూడా ఇండ్లను నిర్మించి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు సుధేష్ బాబు, ఉపాధ్యక్షురాలు మాలిన్ తాజ్, చీఫ్ ఆఫీసర్ జాఫర్ షరీఫ్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ షంషుద్దీన్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ డివిజన్లను కొనసాగించండి

### - రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి

### - రెవెన్యూ మంత్రి, కమిషనర్, ఇరు జిల్లాల కలెక్టర్లకు లేఖలు



రాప్తాడు, నవంబరు 6 ప్రభాతవార్త: రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని రెండు రెవెన్యూ డివిజన్లను యధాతథంగా కొనసాగించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, ఒక నియోజకవర్గంలోని మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలన్న దానిపై మంత్రివర్గ ఉపసంఘం, రెవెన్యూ శాఖలు యోచిస్తున్న తరుణంలో ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న మండలాల పరిస్థితుల గురించి వివరిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, సీసీఎల్ఏ కమిషనర్ జయలక్ష్మి, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు లేఖలు రాశారు. రాప్తాడు నియోజకవర్గం భౌగోళికంగా చాలా భిన్నమైన పరిస్థితిలో ఏర్పడిందని, ఇక్కడ మొత్తం 6 మండలాలు ఉండగా, జిల్లాల విభజన సమయంలో రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలు అనంతపురం జిల్లాలోని అనంతపురం రెవెన్యూ డివిజన్‌లో, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలు శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో చేర్చారన్నారు. భౌగోళికంగా, ప్రజల అవసరాలు, పరిపాలన సౌలభ్యపరంగా ఇది అందరికి అనుకూలంగా ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ఒక నియోజకవర్గమంతా ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలనే నిర్ణయం తీసుకుంటోందని.. అందుకే తమ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని మండలాలను ఒక రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొస్తే చాలా ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు. రైతులు, ప్రజలు, విద్యార్థుల సౌకర్యం కోసం, అలాగే పరిపాలన సౌలభ్యం కోసం శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని కనగానపల్లి రామగిరి చెన్నేకొత్తపల్లి మండలాలను ప్రస్తుతం ఉన్న విధంగా ధర్మవరం రెవెన్యూ డివిజన్లోనే కొనసాగించాలని అలాగే అనంతపురం జిల్లా పరిధిలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలను ప్రస్తుతం ఉన్న విధంగా అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోనే కొనసాగించాలని ఎమ్మెల్యే సునీత కోరారు.



# ఆర్‌టిసి సేవలు మరింత మెరుగుదలకు చర్యలు

### - ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, నవంబరు 6 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఆర్టీసీ సేవల మెరుగుదలకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం విజయవాడ బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావు, బోర్డు సభ్యులు, జోనల్ ఛైర్మన్ల సమావేశం నిర్వహించినట్లు వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణీకులకు సౌకర్యాల విస్తరణ వంటి అంశాలపై చర్చించామన్నారు. అలాగే భవిష్యత్తు ప్రణాళికలు, ఆదాయ మార్గాల పెంపుపై సమీక్ష జరిపినట్లు తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు అమలుచేస్తున్న స్త్రీ శక్తి పథకంలో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం సూపర్‌హిట్ అయిందన్నారు. సమావేశంలో జోనల్ ఛైర్మన్లు రెడ్డి అప్పలనాయుడు, సురేష్‌రెడ్డి, దొన్నుదొర, పూలనాగరాజు, ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# కుర్చీలే ఉన్నాయి సిబ్బంది లేరు

### ఇది గ్రామ సచివాలయ దుస్థితి

నంబులపూలకుంట, నవంబరు 6 ప్రభాతవార్త: శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండల పరిధి మరికొమ్మ దిన్నె సచివాలయంలో కార్యదర్శిలు సమయపాలన పాటించక పోవడంతో కుర్చీలు తప్ప సచివాలయం సిబ్బంది కనిపించడం లేదు. ఒకరు లీవ్‌లో ఉన్నారు.. మరొకరు ఫీల్డ్‌కి వెళ్తారు.. మరొకరు మీటింగ్‌కు వెళ్ళారు.. అని చెప్పడమే తప్ప అక్కడ సచివాలయ సిబ్బంది ఒకరు మాత్రమే ఉండి ఇలాంటివి చెబుతూ ఉంటారు. ఫీల్డ్ అంటే ప్రజల్లోకి వెళ్లడమే వారికి సంబంధించిన ఫోన్ నెంబర్ ఇవ్వండి అక్కడైనా కలుస్తామంటే సార్ లేరు ఫీల్డ్‌లో ఉన్నారు అన్న సమాధానం తప్ప వేరేది రాదు, గట్టిగా అడిగితే మాపై దౌర్జన్యం చేస్తున్నారంటూ బుసలు కొడతారు. ఇకపోతే లీవ్‌లో ఉన్నవారు ఎప్పుడు వస్తారంటే సోమవారం వస్తారు. ఇదొక్క వారమే ఉన్నట్లు పదేపదే అదే చెబుతారు. ఇక పోతే మీటింగ్ వెళ్లిన సార్.. ఎప్పుడు వస్తారంటే వస్తారు అంతే.. మీటింగ్ పొద్దున్నుంచి సాయంత్రం అటునుంచి అటే.. పనుల కోసం వచ్చే ప్రజలు తిరిగి.. తిరిగి.. వేచి చూసి వెనక్కి వెళ్లి పోవాల్సిందే. ఇక వారు తంబు వేయడానికి వచ్చిన సమయంలో వస్తే కొద్ది సేపు వదులుకొని రండి సర్వర్ బిజీగా ఉందంటూ చెప్పడం ఇదంతా ప్రజలకు ఇబ్బందిగా ఉందంటూ ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఇక మహిళా పోలీస్ విధుల నిర్వహణపైనా ప్రజలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. పింఛన్ల పంపిణీ సమయంలో తప్పితే, మరో రోజు అధికారులెవరూ దర్శనమివ్వరని గ్రామస్థులు చెబుతున్నారు. పై అధికారుల పర్యవేక్షణ లేకనే ఈ విధంగా సచివాలయ ఉద్యోగులు వ్యవహరిస్తున్నారని ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు. ఇకపోతే స్మార్ట్ రేషన్ కార్డులు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పంపిణీ చేయాలని తెలియజేయగా అవన్నీ కట్టలు కట్టి సచివాలయంలో ఒక బాక్సులో వేశారు. వాటిని వెతికి తీసుకెళ్లండంటూ చెబుతున్నారు. ఇంతవరకు సచివాలయ పరిధిలో ఉన్న స్మార్ట్ రేషన్‌కార్డులు సగం మంది తీసుకెళ్లగా మిగిలినవి అలాగే ఉండి పోయాయి, ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సచివాలయంలో ఉద్యోగులు ప్రజలకి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఏలూరు కార్పెట్‌కు

# పూర్వవైభవం తీసుకువస్తాం



ఏలూరు, నవంబరు 6 ప్రభాతవార్త: ఏలూరు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి గురువారం స్థానిక పెన్షన్ లైను లక్ష్మీవారపుపేటలో పైల్ కార్పెట్ వీవర్స్ కోపరేటివ్ సేల్స్ అండ్ పర్చేజీ సెంటరు, ఏలూరు అసోసియేషన్ మాన్యుఫాక్చరింగు సెంటరును సందర్శించి పైల్ కార్పెట్ సొసైటీలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆధునిక మగ్గాలును ప్రారంభించారు. తయారీ అవుతున్న కార్పెట్లను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముడి సరుకును ఎక్కడ నుండి తెస్తారు, రోజుకు ఎంత మంది పనిచేస్తున్నారు, మొత్తం శ్రామికులు ఎంతమంది ఉన్నారని, రోజుకు ఎంతమంది వచ్చి కొనుగోలు చేస్తున్నారని జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఒక జిల్లా, ఒక ఉత్పత్తి (వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రోడక్ట్) కేంద్రప్రభుత్వం నుండి ఏలూరు జిల్లా తివాచీ రంగానికి గుర్తింపును ఇచ్చారని తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఏలూరు కార్పెట్ రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషిచేస్తుందన్నారు. ఆధునిక టెక్నాలజీని, మంచి డిజైన్లు, ఆకర్షణీయమైన రంగులు, నాణ్యతతో కార్పెట్లు తయారీకి ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. ఏలూరు జిల్లాలో కార్పెట్ రంగ అభివృద్ధికి కావలసిన సహాయ, సహకారాలు అందించుటకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఏలూరు కార్పెట్ రంగం అభివృద్ధికి మరింతకృషి చేస్తామని అన్నారు. ఏలూరు పైల్ కార్పెటు వీవర్స్ కోఆపరేటివ్ పర్చేస్ అండ్ సేల్ సొసైటీ లిమిటెడ్ ప్రెసిడెంటు ఇంతియాజ్ అహ్మద్, సొసైటీ డైరెక్టరు మహమ్మద్ అక్బరు, సంఘ సభ్యులు కలసి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వికి తమ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలు కేంద్ర జియం పి.సుబ్రహ్మణ్యేశ్వర రావు, తహశీల్దారు కె.గాయత్రీదేవి, జిల్లా పరిశ్రమలు కేంద్ర, సొసైటీ, సచివాలయ ఉద్యోగులు, శ్రామికులు, తదితరులు పాల్గొన్నారు.




# రెండోరోజూ ఎసిబి సోదాలు

● విశాఖ, మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు
● పలు కీలక దస్త్రాలు సీజ్

విశాఖ క్రైమ్, నవంబరు 6 ప్రభాతవార్త: విశాఖలో రెండో రోజు కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై ఎసిబి అధికారుల సోదాలు గురువారం కొనసాగాయి. పెద గంట్యాడ, టర్నర్ చౌల్ట్రీ, మధురవాడ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేసిన ఎసిబి అధికారులు పలు రికార్డులను సీజ్ చేసినట్లు తెలుస్తున్నది. ముఖ్యంగా మధురవాడ కార్యాలయంపై వచ్చిన అవినీతి ఆరోపణ నేపథ్యంలో అక్కడ పూర్తిస్థాయిలో సోదాలు చేపట్టారు. మధురవాడ సబ్ రిజిస్ట్రేషన్ శాఖలో 60కి పైగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉన్నట్లు గుర్తించినట్టు తెలిసింది. మధురవాడ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంపై ఏళ్ల తరబడి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇక్కడ ఎక్కువగా ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారాలు జరుగుతున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగినట్లు సమాచారం. ఇక్కడ ఏ రిజిస్ట్రార్ బాధ్యతలు స్వీకరించిన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, అక్రమాలకు పాల్పడుతూ అడ్డగోలుగా పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెడుతున్నారనే ఆరోపణలు వచ్చి పడుతున్నాయి. మధ్యవర్తుల ద్వారా లంచాలు తీసుకుంటూ అవినీతికి పాల్పడుతున్నట్లు గుర్తించినట్టు తెలిసింది. ఇక్కడకు ఏ పని మీద వచ్చిన సరే కచ్చితంగా ఆ పనికి ఫలానా మొత్తం అంటూ ధరలు నిర్ణయించినట్లు చెప్పుకుంటున్నారు. ఎవరైనా గట్టిగా నిలదీసి అడిగితే ఏదేదో కొర్రీలు పెడుతూ వారి పనులు చేయకుండా తాత్సారం చేస్తూ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా ఇప్పించుకుంటున్నారని ఈ బాధలు పడలేక కొందరు ముడుపులు చెల్లించుకుని తమ పనులు చేయించుకుంటున్నారని అంటున్నారు.



# ఉలవపాడుహైవేపై రోడ్డు ప్రమాదం

## బాధితులును పరామర్శించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఉలవపాడు (నెల్లూరు), నవంబరు 6 ప్రభాతవార్త: ఉలవపాడు హైవేపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఉలవపాడు బైపాస్ వద్ద ప్రయాణిస్తున్న ఆటో కారుతో ఒకదానితో మరొకటి ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురి మహిళలు గాయపడ్డారు. ఇందులో నలుగురు మహిళలకు తీవ్రగాయాలైనాయి. వీరిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మరికొంతమందిని ఉలవపాడు వైద్యశాలకి తరలించారు. వివరాల్లోకి వెళితే... మంత్రి నారా లోకేష్ గురువారం కావలి పర్యటనకు వెళ్తున్న విషయం తెలుసుకున్న అలగాయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన పలువురు మహిళలు హైవేపై ఆయనను చూడడానికి ఆటోలో వెళుతున్నారు. దీంతో ఈ ప్రమాదం నెలకొంది.
రోడ్డు ప్రమాదానికి గురై ఒంగోలులో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులుకు సూచించారు. డ్రైవర్ సహా పదిమంది మహిళలు గాయపడినట్లు ఎమ్మెల్యేకి పలువురు వివరించారు. బాధితులంతా ఉలవపాడు మండలం కరేడు పంచాయతీలోని అలగాయ పాలెం ఎస్సీ కాలనీకి చెందిన మహిళలుగా గుర్తించారు. ఇందులో రావినూతల బేబీ ప్రసన్నకు రెండు కాళ్లు, రావినూతల లక్ష్మికి ఒక కాలు విరిగినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరావు మాట్లాడుతూ ఇద్దరి కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయని, మిగిలిన వారందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారని అన్నారు. జరిగిన సంఘటన చాలా దురదృష్టకరమ ని, బాధితులు కోలుకునెంతవరకు అండగా ఉంటామని చెప్పారు. ప్రమాదంపై మంత్రి నారా లోకేష్ స్పందించారని, బాధితులుకు సరైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు.

# పత్తి రైతులను ఆదుకోండి

● కొనుగోలులో తలెత్తుతున్న ఇబ్బందులు నివారించండి ● కాపాస్ కిసాన్ యాప్ నుండి సిఎం యాప్‌కు రైతు వివరాలు రియల్ టైమ్‌లో సమన్వయం అయ్యేలా చూడాలి ● కేంద్రానికి మంత్రి అచ్చెన్నాయుడు లేఖ

విజయవాడ, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని పత్తి రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ, సహకార, పశుసంవర్థక, మార్కెటింగ్, పాల మరియు మత్స్య శాఖల మంత్రి కింజెరపు అచ్చెన్నాయుడు కేంద్ర టెక్స్‌టైల్ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాశారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగు జరగగా, సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉందని తెలిపారు. అయితే మొంథా తుపాన్ ప్రభావంతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరలకు పత్తిని విక్రయించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిఎం యాప్ మరియు ఆథ్యార్ ఆధారిత ఈ-పంట వ్యవస్థ ద్వారా పత్తి కొనుగోళ్ళు పూర్తిగా డిజటలైజ్ చేయబడిన విధానంలో నిర్వహిస్తోందని, అయితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాపాస్ కిసాన్ యాప్‌ను రాష్ట్ర సిఎం యాప్‌తో అనుసంధానం చేసిన తర్వాత కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తి రైతులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. రైతుల సౌకర్యం కోసం పలు చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని అచ్చెన్నాయుడు కోరారు. కాపాస్ కిసాన్ యాప్ నుండి సిఎం యాప్‌కు రైతు వివరాలు రియల్ టైంలో సమన్వయం అయ్యేలా చూడాలి. రైతులు తమ సమీప జిల్లాలోని జిన్నింగ్ మిల్లులలో పత్తి విక్రయించుకునే విధంగా మ్యాపింగ్ చేయాలి. ఎల్-1,ఎల్-2,ఎల్-3 జిన్నింగ్ మిల్లులను ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. కాపాస్-కిసాన్ యాప్ కోసం గుంటూరులో ప్రత్యేక సాంకేతిక సిబ్బందిని నియమించాలి. వాతావరణ పరిస్థితుల కారణంగా తేమ శాతం 12 నుంచి 18% వరకు ఉన్న పత్తిని కూడా అనుపాత తగ్గింపులతో కొనుగోలు చేయాలి. వర్షానికి తడిసిన లేదా రంగు మారిన పత్తిని కూడా తగిన ధర తగ్గింపులతో కొనుగోలు చేయాలి. ఈ చర్యలు రైతులలో ఏర్పడిన అసంతృప్తిని తగ్గించి, పత్తి రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని, సహజ విపత్తులో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కేంద్రం తక్షణ సహకారం అందించాలని మంత్రి అచ్చెన్నాయుడు కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు.

# 180 కి.మీ. వేగంతో వందేభారత్ స్లీపర్

## ట్రయల్ రన్ విజయవంతం

న్యూఢిల్లీ, నవంబరు 6: వందేభారత్ రైలు భారత్‌లో ఇప్పటికే పరుగులు పెడుతుండగా, తాజాగా వందేభారత్ స్లీపర్ రైలును కేంద్రం అందుబాటు లోకి తీసుకొస్తోంది. గంటకు 180 కిలోమీటర్ల వేగంతో ఈ వందేభారత్ స్లీపర్ రైలును రూపొందించగా, ఇటీవల ట్రయల్ రన్ నిర్వ హించగా, విజయ వంతమైంది. ఇందుకు సంబంధించిన వీడియోను వెస్టర్న్ సెంట్రల్ రైల్వే (డబ్ల్యూసిఆర్) సోషల్ మీడియాలో షేర్ చేసింది. ట్రయల్ రన్‌లో ఈ రైలు గంటకు 180 కిలోమీటర్ల వేగాన్ని అందుకుని అబ్బురపరిచింది. సవాయి మాధోపూర్-కోటా- నాగ్డా సెక్షన్‌లో ఈ ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ రైల్వే ఉద్యోగి లోకో పైలట్ క్యాబిన్‌లో ఒక వీడియో తీశారు. స్పీడోమీటర్ ముందు మూడు నీటి గ్లాసులను ఉంచి, రైలు వేగాన్ని రికార్డ్ చేశారు. స్పీడో మీటర్ ముల్లు గంటకు 180 కి.మీ వేగాన్ని సూచిస్తున్నప్పటికీ, గ్లాసుల్లోని నీరు చుక్క కూడా కింద పడకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. రైలు ఎంత స్థిరంగా ఉందో ఈ 27 సెకన్ల వీడియో స్పష్టంగా చూపిస్తోంది.ప్రస్తుతం ఈ ట్రయల్ రన్ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రైలు వేగానికి, దాని స్థిరత్వానికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ఈ విజయవంతమైన పరీక్షతో, త్వరలోనే వందే భారత్ స్లీపర్ రైళ్లు ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.




# శిల్పాశెట్టి దంపతుల కేసులో నలుగురికి సమన్లు





**ముంబయి, నవంబరు 6:** ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేరకు మోసం కేసులో బాలీవుడ్ స్టార్ నటి శిల్పాశెట్టి, ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్‌కుంద్రా నిందితులుగా ఉన్న కేసులు కీలక వ్యక్తులను ఆర్థికనేరాల దర్యాప్తు బృందం గుర్తించింది. నిధుల మళ్లింపులో వీరే కీలకమని భావిస్తోంది. రాజ్ కుంద్రా కంపెనీ బెస్ట్ డీల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉన్నత స్థాయిలో ఉన్న నలుగురు ఉద్యోగులకు ముంబై పోలీసు ఆర్థిక నేరాల విభాగం సమన్లు పంపింది. వీరిలో ఒకరు ఇప్పటికే దర్యాప్తు బృందం ముందు విచారణకు హాజరైనట్లు తెలిసింది. సదరు ఉద్యోగిని ప్రశ్నించిన అధికారులు స్టేట్‌మెంట్ కూడా రికార్డు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మిగతా ముగ్గురు ఉద్యోగులు త్వరలోనే విచారణకు హాజరు కానున్నట్లు పేర్కొన్నాయి. శిల్పా శెట్టి దంపతులు రూ.60 కోట్ల మోసానికి పాల్పడినట్లు ముంబై వ్యాపారవేత్త దీపక్ కొఠారీ ఇటీవలే ముంబై పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తన కంపెనీ 2015 నుంచి 2023 వరకు రుణం, పెట్టుబడి రూపంలో రూ.60.4 కోట్లను ఈ దంపతులకు ఇచ్చిందని తెలిపారు. ఈ సొమ్మును వీరు తమ వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నా రని ఆరోపించారు. రాజేశ్ ఆర్య అనే వ్యక్తి ద్వారా తాను శిల్పా రాజ్ దంపతులను కలిసినట్లు పిర్యాదులో పేర్కొన్నారు. ఆ సమయంలో వారు 'బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్' అనే హోమ్ షాపింగ్ కంపెనీలో డైరెక్టర్లుగా ఉన్నట్లు తెలిపారు. ఈ కేసులోని బెస్ట్‌డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రస్తుతం మూతపడింది. దీపక్ కొఠారీ ఫిర్యాదు ఆధారంగా ముంబై పోలీసులు ప్రాథమిక విచారణ నిర్వహించి, మోసం, నమ్మకద్రోహం తదితర సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మోసం మొత్తం రూ. 10 కోట్లకు పైగా ఉండటంతో, కేసును జుహు పోలీస్ స్టేషన్ నుంచి ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉంది. కేసు విచారణ సమయంలో దేశం విడిచిపోకుండా ఉండేందుకు శిల్పా దంపతులపై ఆర్థిక నేరాల విభాగం అధికారులు ఇటీవలే లుకౌట్ నోటీసులు కూడా జారీ చేసిన విషయం తెలిసిందే. అంతేకాదు రాజ్ కుంద్రా, శిల్పాశెట్టిని కూడా అధికారులు విచారించారు.



సహస్ర దీపాలంకరణలో అనుగ్రహిస్తున్న అమ్మవార్లు

# దుర్గమ్మవారి ఆలయంలో వేదోక్తంగా కార్తీక పూజలు

ఇంద్రకీలాద్రి, నవంబరు 6 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో గురువారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చక స్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యా కాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు.

## పెట్టుబడి ఆధారంగా స్టార్ హోటళ్ళకు

# స్థలాల కేటాయింపు

విజయవాడ, నవంబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ స్థలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం కింద స్టార్ హోటళ్ళ నిర్మాణానికి పెట్టుబడిదారుల నుంచి పోటీ పెరగడంతో ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. పెట్టుబడి, హోటళ్ళలో గదుల నిర్మాణం ఆధారంగా స్థలాలు కేటాయించాలని నిర్ణయించింది. ఆ మేరకే కేటాయింపులు చేయాలని రాష్ట్ర పర్యాటక సంస్థను ఆదేశిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర పర్యాటక విధానం 2024-29లో పీపీపీ కింద స్టార్ హోటళ్ళ నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని నిర్ణయించారు. పెట్టుబెడిదారుల నుంచి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు ఎక్కువగా రావడం,పలు ప్రాంతాల్లో కొన్ని స్థలాలకు అత్యధికులు పోటీపడటంతో వీటి కేటాయింపులపరంగా తలెత్తే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒకే ప్రాంతంలో స్థలానికి ఎక్కువ ప్రతిపాదనలు వచ్చినపుడు ప్రాధాన్యం ఇలా ఇస్తారు అధిక పెట్టుబడి, సమర్థ భూ వినియోగం, సంస్థ విశ్వసనీయత, అనుభవం, అధిక ఆదాయ భాగస్వామ్యం ప్రాధాన్యత అంశాలుగా పరిగణిస్తారు.



## తెలంగాణలో మార్చి 25 నుంచి

# టెన్త్ వార్షిక పరీక్షలు

హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 6: తెలంగాణలో 10వ తరగతి వార్షిక పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 25 నుంచి ప్రారంభించే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌పై పాఠశాల విద్య శాఖ, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరేట్ కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. మార్చి 25 నుంచి ప్రారంభిస్తే రెండు పరీక్షలు జరిగిన తరువాత ఇంగ్లీష్ పరీక్షకు శ్రీరామనవమి పండుగ సెలవు రానుంది. ఆ తరువాత ఇంగ్లీష్ పరీక్ష తరువాత ఆదివారం రానుంది. దీంతో గణితం పరీక్షకి కూడా ఒకరోజు సెలవు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి మార్చి 25 నుంచి 10వ తరగతి వార్షిక పరీక్షలను ప్రారంభించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. గత ఏడాదిలో మార్చి 21 నుంచి పరీక్షలను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది వార్షిక పరీక్షలు మార్చి 25 నుంచి ప్రారంభించే అవకాశం లేకపోతే మార్చి 16 నుంచే ప్రారంభించే అవకాశం ఉంటుంది. అదీకాకపోతే మార్చి 23 నుంచి పరీక్షలను ప్రారంభించే అవకాశం లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఎస్ఎస్‌సి వార్షిక పరీక్షల షెడ్యూల్‌కి ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలు జరుపుకునే తేదిలపై ఆధారపడి ఉంది. ఆ పండగుల తేదిలు ఫైనల్ అయితే.. వాటినిబట్టి 10వ తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్ ఖరారు కానుంది. రాష్ట్రంలో సుమారు 5 లక్షల మంది 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్నారు.

# డ్రగ్స్ ఓవర్‌డోస్‌తో యువకుడు మృతి

## యువతి పరిస్థితి విషమం... హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఘటన

హైదరాబాద్ (అత్తాపూర్), నవంబరు 6, ప్రభాతవార్త: నలుగురు యువతీ యువకులు డ్రగ్స్ పార్టీ చేసుకున్నారు. డ్రగ్స్ ఓవర్‌డోస్‌తో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువతి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఘటన హైదరాబాద్ శివారులోని రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివారంపల్లిలోని కెన్‌వర్త్ అపార్ట్‌మెంట్‌లో పాతబస్తీ కాళాపత్తర్‌కు చెందిన అహ్మద్ అలి(28) సులేమాన్‌నగర్‌కు చెందిన అతని స్నేహితుడు సయ్యద్ బిన్, కర్నూలుకు చెందిన జరా, కోల్‌కత్తాకు చెందిన మమత బిస్వాప్(22)లు కలిసి బుధవారం రాత్రి రూమ్‌లో పార్టీ చేసుకున్నారు. అహ్మద్ అలికి డ్రగ్స్ ఓవర్ డోస్ ఎక్కువ అయి మృతి చెందినట్లు తెలిపారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పూర్తి వివరాలు సేకరించడం జరిగిందని, అయితే అహ్మద్ అలీ డ్రగ్స్ నగరంలోని నిలోఫర్ కేఫ్ వద్ద కొనుగోలు చేసినట్లు గుర్తించామని పార్టీ చేసుకున్న వారికి పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. యువతి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.

# నౌకాదళ గస్తీలో మరో ముందడుగు

## అత్యాధునిక ఐఎన్ఎస్ ఇక్షక్ జలప్రవేశం



కోచి, నవంబరు 6: నౌకాదళ గస్తీకోసం ప్రత్యేకంగా తయారుచేసిన ఐఎన్ఎస్ ఇక్షక్ గురువారం కేరళ నావల్‌బేస్ నుంచి కార్యకలా పాలు ప్రారంభించింది. కేరళ తీరంలో బేస్‌గా పని చేస్తుంది. అధునాతన హైడ్రోగ్రాఫిక్ సర్వే వాహికగా ఈ నౌక రూపొందింది. కోస్తాప్రాంతం, డీప్ వాటర్స్, ఓడరేవులు, హార్బర్లు మిలిటరీ, వాణిజ్య అవస రాలకు కూడా ఈ నౌక ఉపయోగపడుతుంది. గార్డెన్‌రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ కోల్‌కత్తాసంస్థ 80శాతం స్వదేశీ ముడివనరులతోనే ఈ నౌకను నిర్మించింది. ఈ నౌకా నిర్మాణంతో భారత్ ఓడల తయారీలో కూడా ఆత్మనిర్భర్ భారత్‌గా నిలుస్తుంద నిపించింది. హై రిజొల్యూ షన్ మల్టీ బీమ్ ఎకౌ సౌండర్లు, ఆటానమస్ అండర్‌వాట్ వెహికల్, రిమోట్ ఆపరేటివ్ వెహికల్‌గాను పనిచేస్తుంది. 10వేల మీటర్ల లోతు వరకూ కూడా సర్వే నిర్వ హించగలదు. సర్వేతో పాటే అవసర సమ యాల్లో ఈ నౌకను 40 పడకల ఆసుపత్రిగా కూడా పనిచేస్తుంది. మానవతా సాయం అందించే సమయాల్లో అత్యవసర పరిస్థితికి అనుగుణంగా 40 పడకల ఆసుపత్రిగా మారుతుంది. ఈ ఐఎన్ఎస్ ఇక్షక్‌లో మహిళా అధికారులు, నావికుల కోసం కూడా ప్రత్యేక వసతులు ఏర్పాటుచేసారు.



# హ్యాపీయెస్ట్ సిటీ ముంబయి

**న్యూఢిల్లీ, నవంబరు 6:** ఆసియాలో హ్యాపీయెస్ట్ సిటీగా ముంబయి నిలిచింది. టైమ్ అవుట్ నిర్వహించిన తాజా సర్వేలో 'అత్యంత సంతోషకరమైన నగ రం'గా ముంబయి నగరం టైటిల్ గెలుచుకుంది. నగరవాసులు తమ పరిస రాలు, జీవనశైలి, తదితర అంశాలపై వివిధ నగరాల్లో 18వేల మందికిపైగా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించింది.
ఈ సర్వేలో ప్రధానంగా సంస్కృతి, ఆహారం, నైట్ లైఫ్, జీవన నాణ్యతతో సహా పలు అంశాల ఆధా రంగా వచ్చిన అభిప్రాయాల మేరకు ఆయా నగరాలకు రేటింగ్ ఇచ్చారు. ముంబయిలో అభివృద్ధి చెందిన ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ, కెరీర్ అవకాశాలు, స్ట్రీట్ ఫుడ్ కల్చర్ తో ఈ గుర్తింపు లభించింది. టైమ్ అవుట్ ప్రకారం, 2025కి ఆసియా లోని టాప్-10 హ్యాపీయెస్ట్ సిటీస్‌ల్లో ముంబయి ప్రథమస్థానంలో ఉండగా, బీజింగ్, షాంఘై ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

# రైతు సంక్షేమానికి మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ కేంద్రం

● ధరల దగా నుంచి రైతాంగానికి ఊరట ● పంట సాగు నుంచి విక్రయం దాకా నియంత్రణ ● రూ. 50 కోట్లతో ఉద్యానవర్సిటీలో ఏర్పాటు

హైదరాబాద్, నవంబరు 6, ప్రభాతవార్త: ధరల దగాతో విలవిల్లాడు తున్న రైతాంగానికి శాశ్వత ఊరటనిచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక వినూత్న వ్యవస్థకు రూపకల్పన చేస్తోంది. రాష్ట్రంలో అత్యాధునిక మోడల్ మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రం ఐవోటీ, ఏఐ వంటి సాంకేతికతతో పంటల సాగు నుంచి క్రయవిక్రయాల వరకు రైతులకు ఎప్పట ికప్పుడు సమాచారం అందించి, డిమాండ్‌కు అనుగుణమైన సాగును ప్రోత్సహిస్తుంది. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఉద్యాన విశ్వవిద్యాలయంలో అత్యాధునిక మోడల్ మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రం రైతులు ఎదుర్కొంటున్న అనేక కష్టాలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా పనిచేయనుంది. రాష్ట్రంలో ప్రధానంగా పంటల సాగు దశ నుంచి ఉత్పత్తులు, క్రయవిక్రయాలు, ధరల తీరుతెన్నులను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ డిమాండ్‌కు అనుగుణ మైన సాగు విధానాలను ప్రోత్సహించడం దీని ప్రధాన ఉద్దేశం. రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధరలు దక్కక పోవడం, మార్కెట్ యార్డులు పరిమితంగా ఉండటం,



కొను గోళ్లలో జాప్యం, స్థిరమైన ధరలు లేకపోవడం వంటి తీవ్ర సమస్యలు రైతాంగాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టివేస్తున్నాయి. తేమ, శుద్ధి వంటి కారణాలు చూపి వ్యాపారులు తక్కువ ధరల కు కొనుగోలు చేస్తుండటంతో నిల్వ, గ్రేడింగ్ సౌకర్యాలు లేక రైతులు తమ ఉత్పత్తులను హడావిడిగా విక్రయించి వెనుదిరుగుతున్నారు. ఈ సవాళ్లన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపేందుకు అనువైన విధానాన్ని ఉద్యాన వర్సిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ వ్యవస్థను ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, కృత్రిమ మేధస్సు, మెషిన్‌లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికతతో నడిపేందుకు సుమారు రూ.50 కోట్ల వ్యయమవుతుందని అంచనా. ఈ అత్యాధునిక కేంద్రం అనేక అంశాల్లో రైతులకు తోడ్పాటునందించనుంది. జియోట్యాగింగ్ ద్వారా రాష్ట్రంలోని అన్ని పంటల భూములను ఉపగ్రహ సాంకేతికతతో మ్యాపింగ్ చేసి, ఏ ప్రాంతంలో ఏ రైతు ఏ పంట వేశారనే సమాచారాన్ని సేకరిస్తుంది. దీని ఆధారంగా పంటల విస్తీర్ణం, దిగుబడుల విశ్లేషణ జరుగుతుంది. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా వాతావరణ స్థితిగతులను విశ్లేషించి, వ్యవసాయ శాఖకు ముందస్తు సమాచారం అందిస్తారు. దీని ఆధారంగా పంటల క్యాలెండర్ రూపకల్పనకు సూచనలు చేస్తారు. తద్వారా విత్తనాల పంపిణీ, ఎరువుల లభ్యత, పంట కోత సమయాలు, తెగుళ్ల నివారణ వంటి అంశాలపై రైతులకు సకాలంలో మార్గనిర్దేశం చేయవచ్చు. పంట కోతల అనంతరం నిల్వ సదుపాయాలు, గ్రేడింగ్, ధరల వంటి కీలక సమాచారాన్ని కూడా ఈ కేంద్రం అందిస్తుంది. అంతేకాక వివిధ రాష్ట్రాలు, దేశాలు, విదేశాల్లో ఆయా ఉత్పత్తుల లభ్యత, సరఫరా, డిమాండ్‌ను ఎప్పటికప్పుడు అంచనా వేస్తారు. అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డులు, రైతు బజార్లను ఈ ఇంటెలిజెన్స్ కేంద్రానికి అనుసంధానం చేస్తారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో గత పదేళ్ల ధరలతో సహా, ప్రస్తుత మార్కెట్ తీరుతెన్నులు, ధరల అంచనాను కలిగి ఉన్న సమగ్రమైన డేటాబ్యాంక్‌ను నిర్వహిస్తారు. మార్కెట్ యార్డులతో పాటు ఇనామ్, స్థానిక వ్యాపారుల ధరల సమాచారం కూడా ఇందులో నమోదవుతుంది. పంటల ధరలు, మార్కెటింగ్ వనరులపై స్థానిక భాషలో డిజిటల్ సమాచారాన్ని మొబైల్ యాప్‌లు, వాట్సప్ గ్రూపులు వంటి సాధనాల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు చేరవేస్తారు. వినియోగదారులు, కొనుగోలు ఏజెన్సీల ప్రాధాన్యతలు, నాణ్యతా ప్రమాణాలపై సర్వేలు నిర్వహించి డిమాండ్‌కు అనుగుణంగా రైతులను సన్నద్ధం చేస్తారు. ఈ కేంద్రం సంస్థాగత కొనుగోలుదారులతో సమన్వయం చేసుకుని, డిజిటల్ వేదికలు, వర్క్‌షాప్‌ల ద్వారా రైతులకు నేరుగా అనుసంధానత కల్పిస్తుంది.


# సూపర్ కప్‌లో సెమీస్‌కు పంజాబ్



**న్యూఢిల్లీ:** సూపర్ కప్ టోర్నమెంట్‌లో బెంగుళూరును ఓడించిన పంజాబ్ సెమీఫైనల్‌కు చేరుకుంది. ఫాటోర్డాలో జరిగిన మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో గోల్ లేకుండా ముగిసిన తర్వాత, పెనాల్టీ షూటౌట్‌లో బెంగళూరు ఎఫ్‌సిని 5–4 తేడాతో ఓడించి, పంజాబ్ ఎఫ్‌సి ఎఐఎఫ్‌ఎఫ్ సూపర్ కప్ 2025–26లో సెమీఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. పంజాబ్, బెంగళూరు రెండు విజయాలు, ఒక డ్రాతో రెండూ జట్లూ చెరో ఏడు పాయింట్లతో ముగించాయి. రెండు జట్లు ఒకే పాయింట్లు, గోల్ తేడా (ఆరు), గోల్స్ (ఆరు)తో ముడిపడి ఉండటంతో గ్రూప్ సి విజేతలను పెనాల్టీ షూటౌట్ ద్వారా నిర్ణయించాల్సి వచ్చింది. బెంగళూరుకు చెందిన ర్యాన్ విలియమ్స్ మాత్రమే స్పాట్‌కిక్‌ను సేవ్ చేసుకుని ప్రత్యర్థిని ఔట్ చేశాడు. బ్లూస్ తరపున సురేష్ సింగ్ వాంగ్జామ్, రాహుల్ భేకే, సునీల్ ఛెత్రి, బ్రయాన్ సాంచెజ్ గోల్స్ చేయగా, పంజాబ్ వారి ఐదు పెనాల్టీలను స్కోర్ చేసింది.

న్సుంగ్సి ఎఫ్ఫియోంగ్, ప్రిన్స్టన్ రెబెల్లో, సమీర్ జెల్జ్‌కోవిక్, లియోన్ అగస్టిన్, వినిత్ రాయ్ గోల్స్ సాధించారు. నింతోయ్ 28వ నిమిషం పంజాబ్‌కు గోల్ దిశగా మొదటి షాట్‌ను కొట్టాడు. బెంగళూరు 35వ నిమిషంలో గోల్ అవకాశాలను 68వ నిమిషంలో ఆషిక్ గోల్ చేశాడు. పంజాబ్ గోల్ కీపర్ షబీర్ షూటౌట్‌లో హీరోగా నిలిచాడు. మిగిలిన అన్ని పెనాల్టీలు సాధించడంతో, పంజాబ్ 5–4 తేడాతో పోటీని గెలిచి సెమీఫైనల్లో తన స్థానాన్ని భద్రపరచుకుంది.

# ఛాంపియన్స్ ఫ్రాంక్‌ఫర్ట్‌లో మానికా నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ఫ్రాంక్‌ఫర్ట్‌లో భారత స్టార్ క్రీడాకారిణ మానికా బాత్రా మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించింది. జర్మనీకి చెందిన అన్నెట్ కౌఫ్‌మన్ చేతిలో మానికా ఓడిపోయింది. జర్మనీలో అన్నెట్ చేతిలో వరుస గేమ్‌లలో పరాజయం పాలైన తర్వాత, మానికా డబ్ల్యూటిటి ఛాంపియన్స్ ఫాంక్‌ఫర్ట్‌లో మొదటి రౌండ్‌లోకి అడుగుపెట్టలేక పోయింది. డబ్ల్యూటిటి టూర్‌లో ఈ క్రమం తప్పకుండా ప్రారంభ నిష్క్రమణలు ఆమెను ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ 50 నుండి దిగజారిపోయింది. ఇది రాబోయే నెలల్లో టాప్ టైర్ టోర్నమెంట్లలో ఆడే అవకాశాలకు ఆటంకం కలిగిస్తుంది. మనికా మ్యాచ్ అంతటా పేలవ ప్రదర్శన చేసింది. మూడు ఆటలలో కేవలం 17 పాయింట్లు మాత్రమే సాధించింది, 19 ఏళ్ల జర్మన్ క్రీడాకారిణి చేతిలో 5–11, 5–11, 7–11 తేడాతో ఓడిపోయింది. ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఇది మూడవ సమావేశం, హెడ్‌టుహెడ్ రికార్డు ఇప్పుడు జర్మన్ క్రీడాకారిణికి అనుకూలంగా 2–1తో ఉంది, 2023లో అన్నెట్‌పై మానికా చివరి విజయం సాధించింది. కాగా ఈ టోర్నమెంట్‌లో భారత్ తరపున మిగిలి ఉన్న ఏకైక ఆటగాడు మానవ్ ఠక్కర్ శుక్రవారం తన ప్రీక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన నాల్గవ సీడ్ ఫెలిక్స్ లెబ్రన్‌తో తలపడనున్నాడు.



## సౌతాఫ్రికా రెండో టెస్టులో..

# భారత్ 255 రన్స్‌తో ఆలౌట్

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో అనధికారిక టెస్టు తొలి రోజు భారత్ 255 పరుగుల స్కోరు సాధించింది. పర్యాటక జట్టు బౌలర్లు ఆది నుంచే చెలరేగి, టాపార్డర్‌ను కుదేలు చేయగా, ఆరో నంబర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ శతకొట్టి జట్టును ఆదుకున్నాడు. బెంగుళూరు వేదికగా గురువారం జరిగిన రెండో టెస్టులో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా తొలుత బౌలింగ్ ఎంచుకోగా, బారత్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనింగ్ బ్యాటర్లు కేఎల్ రాహుల్ (19), అభిమన్యు ఈశ్వరన్ (0). వన్‌డౌన్‌లో వచ్చిన సాయి సుదర్శన్ (17), దేవదత్ పడిక్కల్ (5) విఫలమయ్యారు. ఈ దశలో ఐదో స్థానంలో వచ్చిన కెప్టెన్ రిషబ్ పంత్ జట్టును ఆదుకునే క్రమంలో వేగంగా ఆడాడు. మొత్తంగా 20 బంతులు ఎదుర్కొని 3 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 24 పరుగులు చేసి షెపో మొరేకి బౌలింగ్‌లో ఎంజె అకెర్‌మన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. హర్ష్ దూబే (14), ఆకాశ్ దీప్ (0)లను కూడా దక్షిణాఫ్రికా త్వరత్వరగా ఔట్ చేసింది. అయితే ధ్రువ్ జురెల్ అద్భుత శతకంతో మెరిశాడు. మొత్తంగా 175 బంతులు ఎదుర్కొని 132 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఆఖర్లో టెయిలెండర్లు కుల్దీప్ యాదవ్ (20), మొహమ్మద్ సిరాజ్ (15) వికెట్ పడకుండా జాగ్రత్తపడుతూ జూరెల్‌కు సహకరించారు. ఈ క్రమంలో 77.1 ఓవర్ వద్ద ప్రసిద్ కృష్ణ (0) పదో వికెట్‌గా వెనుదిరగడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసిపోయింది. తొలి రోజు పూర్తయ్యే సరికి 77.1 ఓవర్లలో 255 పరుగులు చేసి భారత్ ఆలౌట్ అయింది.

# ఆసియా కప్‌లో ‘ఆపరేషన్ సిందూర్’

## పాక్ బౌలర్ సస్పెన్షన్.. టీమ్ఇండియా కెప్టెన్‌కు భారీ జరిమానా



**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025 సందర్భంగా జరిగిన వివాదాలపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కఠినమైన వైఖరిని తీసుకుంది. భారత్, పాకిస్తాన్ మ్యాచ్‌ల సమయంలో ఆటగాళ్ళు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఐసీసీ పేర్కొంది. ఈ క్రమంలో వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు ఇండియన్ క్రికెట్ కౌన్సిల్ ప్రకటించింది. దుబాయ్‌లో తాజాగా జరిగిన బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు అతని మ్యాచ్ ఫీజులో 30 జరిమానా విధించగా, పాకిస్తాన్ ఫాస్ట్ బౌలర్ హారిస్ రౌఫ్‌కు రెండు వన్డేల సస్పెన్షన్ విధించింది. అంతేకాకుండా బౌలర్ జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, సాహిబ్‌జాదా ఫర్హాన్ వంటి ఆటగాళ్లపై కూడా వివిధ క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. కాగా సెప్టెంబర్ 14వ తేదీ మ్యాచ్‌తో పాకిస్తాన్, భారత్ మధ్య వివాదం ప్రారంభమైంది. ఆసియా కప్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన తొలి మ్యాచ్ సందర్భంగా ఆటగాళ్ల మధ్య వాగ్వాదం వివాదానికి దారితీసింది. మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ విచారణలో, సూర్యకుమార్ ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.21 కింద దోషిగా తేలింది. అతనికి మ్యాచ్ ఫీజులో 30 జరిమానా విధించడం సహా, 2 డీమెరిట్ పాయింట్లు ఇచ్చారు. అలాగే పాకిస్తాన్‌కు చెందిన సాహిబ్‌జాదా ఫర్హాన్‌కు హెచ్చరిక చేస్తూ, ఒక డీమెరిట్ పాయింట్ లభించింది. ఇక రౌఫ్‌కు కూడా జరిమానా 2 డీమెరిట్ పాయింట్లు లభించాయి. ఆసియాకప్ ఫైనల్‌లో కూడా అదే తప్పు పునరావృతమైంది. సెప్టెంబర్ 21, 28 మ్యాచ్‌లలో వాతావరణం ఉద్రిక్తంగా ఉంది. ఫైనల్‌లో జస్ప్రీత్ బుమ్రాపై ఐసీసీ ఆర్టికల్ 2.21 కింద అభియోగం మోపింది. దీంతో ఒక హెచ్చరిక, ఒక డీమెరిట్ పాయింట్ ఇచ్చింది. హారిస్ రౌఫ్ కూడా అదే నేరానికి పాల్పడినట్లు తేలింది. రిచీ రిచర్డ్‌సన్ అధ్యక్షతన జరిగిన విచారణలో, అతనికి మళ్ళీ 30 శాతం జరిమానా విధించారు. రెండు అదనపు డీమెరిట్ పాయింట్లు విధించగా, దీంతో రవూఫ్ మొత్తం నాలుగు డీమెరిట్ పాయింట్స్ చేరుకుంది. హారిస్ రవూఫ్ రెండు మ్యాచ్‌ల సస్పెన్షన్ వేటు పడింది.



# ఆస్ట్రేలియాపై 48 పరుగులతో భారత్ విజయం

**న్యూఢిల్లీ:** ఉత్కంఠభరిత పోరులో ఆస్ట్రేలియాపై భారత్ 48 పరుగుల తేడాతో విజయం సాధించింది. తద్వారా ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 2–1 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య నాలుగో మ్యాచ్ గురువారం జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ తొలి 3 ఓవర్లలో 20 పరుగులు మాత్రమే వచ్చినా, వికెట్లు కోల్పోకుండా జాగ్రత్తపడింది. పవర్‌ప్లే ముగిసే సమయానికి వికెట్ కోల్పోకుండా 49 పరుగులు చేసింది. శుభమన్ గిల్ (26), అభిషేక్ శర్మ (22) క్రీజ్‌లో నిలబడ్డారు. అభిషేక్ (28) ఆడమ్ జంపా బౌలింగ్‌లో టిమ్ డేవిడ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. శివమ్ దూబే (22), శుభమన్ గిల్ (46) నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ కాగా, సూర్యకుమార్ యాదవ్ (20) జేవియర్ బార్ట్‌లెట్ బౌలింగ్‌లో టిమ్ డేవిడ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అలాగే తిలక్ వర్మ (5), జీగేష్ శర్మ (3), వాషింగ్టన్ సుందర్ (12) ఔటయ్యారు. చివరకు భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. 168 పరుగుల లక్ష్యంతో ఆస్ట్రేలియా తొలి పవర్‌ప్లేలో 48 పరుగులు చేసి ఒక వికెట్ కోల్పోయింది. అక్షర్ పటేల్ ఐదవ ఓవర్‌లో మాథ్యూ షార్ట్‌ను (25) పెవిలియన్‌కు పంపిడు. అక్షర్ జోష్ ఇంగ్లిస్‌ను (12) వద్ద క్లీన్ బౌల్డ్ చేశాడు. మిచెల్ మార్ష్ (30) శివమ్ దూబే బౌలింగ్‌లో అర్షదీప్ సింగ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. టిమ్ డేవిడ్ (14) శివమ్ దూబే బౌలింగ్‌లో సూర్యకుమార్ యాదవ్ చేతికి చిక్కాడు. జోష్ ఫిలిప్ (10) అర్షదీప్ సింగ్ బౌలింగ్‌లో వరుణ్ చక్రవర్తికి క్యాచ్ ఇచ్చి ఔట్ కాగా, గ్లెన్ మాక్స్‌వెల్ (2) వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. చివర్లో వాషింగ్టన్ సుందర్ అద్భుతమైన బౌలింగ్ చేశాడు. 17వ ఓవర్‌లో మార్కస్ స్టోయినిస్‌ను ఎల్‌బిడబ్ల్యు చేసి, తర్వాతి బంతికే జేవియర్ బార్ట్‌లెట్‌ను ఔట్ చేసి ఆస్ట్రేలియా ఆశలను దెబ్బతీశాడు. జస్‌ప్రీత్ బుమ్రా చివరి ఓవర్‌లో బెన్ ద్వార్షుయిస్‌ను బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 18 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 118 పరుగుల వద్ద ముగిసింది.

## వాణిజ్యం

# చైనా టు భారత్..

## రూ.90 వేల కోట్ల పెట్టుబడులతో జపాన్ కంపెనీలు!




**న్యూఢిల్లీ, నవంబరు 6:** జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీలు టయోటా, హోండా, సుజుకి భారత్‌లో భారీ పెట్టబడులు పెడుతున్నాయి. చైనాపై ఆధారపడటాన్ని తగ్గిస్తున్న కంపెనీలు భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా గుర్తించాయి. ఈ మూడు కంపెనీలు భారత్‌లో సుమారు 11 బిలియన్ల (సుమారు రూ.90వేలకోట్లు) పెట్టుబడులు పెడుతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ టయోటా భారత్‌లో దాదాపు 40 శాతం మార్కెట్ వాటాను కలిగిఉన్న సుజుకి రెండూ పెట్టుబడులు పెట్టినట్లుగా ప్రకటించాయి. హోండా తన ఎలక్ట్రిక్ కార్ల ఉత్పత్తి, ఎగుమతి కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పింది. జపాన్ కార్ కంపెనీలు మార్కెట్‌తో పాటు తయారీ విషయంలో చైనా అంటేనే భయపడుతున్నాయి. చైనాలో ఈవీ విభాగంలో కొనసాగుతున్న ధరల యుద్ధం జపనీస్ ఆటోమేకర్స్ లాభాలు ఆర్జించడం కష్టతరంగా మారిందని నిపుణులు పేర్కొంటున్నారు. చైనా ఆటోమేకర్స్ ఆగ్నేయాసియాలో తమ ఉనికిని విస్తరిస్తున్నాయి. దాంతో జపాన్‌కు ప్రత్యక్షంగా సవాల్‌గా మారుతున్నది. 2021- 24 మధ్య భారత్ రవాణారంగంలో (ఆటోమొబైల్స్ సహా) జపాన్ పెట్టుబడి ఏడు రెట్లు పెరిగి 294 బిలియన్ యెన్‌లు అంటే సుమారు రూ.16వేలకోట్లకు చేరింది. చైనాలో పెట్టుబడి 83 శాతం తగ్గి 46 బిలియన్ యెన్‌లకు చేరుకుంది.టయోటా దక్షిణ భారత్‌లోని ప్లాంట్‌లో ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏటా లక్షవాహనాలకు పెంచుతామని, మహారాష్ట్రలో కొత్త ప్లాంట్‌ను నిర్మిస్తామని గతేడాది ప్రకటించింది. ఇది 2030కి ముందు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇది కంపెనీ మొత్తం సామర్థ్యాన్ని ఏటా మిలియన్ వాహనాలకుపైగా పెంచనున్నది. సుజుకి తన భారతీయ యూనిట్ మారుతి సుజుకి ద్వారా 8 బిలియన్ డాలర్లు (రూ.67వేలకోట్లు) పెట్టుబడి పెడుతోంది. భారత్‌లో ఉత్పత్తి సామర్థ్యాన్ని సంవత్సరానికి 2.5 మిలియన్ల నుంచి నాలుగు మిలియన్లకు కార్లకు పెంచనున్నది. హోండా భారత్‌ను ప్రపంచ ఎలక్ట్రిక్ వాహన వ్యూహంలో కీలక భాగంగా చేస్తోంది. భారత్‌లో ‘జీరో సిరీస్’ ఎలక్ట్రిక్ కార్లను తయారు చేసి 2027 నుంచి జపాన్, ఇతర ఆసియా దేశాలకు ఎగుమతి చేయాలని కంపెనీ యోచిస్తున్నది. యూఎస్ తర్వాత భారత్ తమకు రెండో కీలకమైన మార్కెట్ అని హోండా సిఇఒ పేర్కొన్నారు. భారతదేశ సగటు జిడిపి వృద్ధి 8శాతం, పిఎం మోడీ మేక్ ఇన్ ఇండియా విధానం విదేశీ కంపెనీలకు పెట్టుబడులకు ఆకర్షణీయంగా మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. చైనా కంటే భారత్ మార్కెట్‌లో జపాన్ కంపెనీలకు ఎక్కువ అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు. ఇకపై కేవలం ఒక ప్రధాన మార్కెట్ మాత్రమే కాకుండా రాబోయే దశాబ్దంలో జపాన్‌కు అత్యంత ముఖ్యమైన ఆటో తయారీ కేంద్రంగా మారే దిశగా భారత్ పయనిస్తోందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఎల్ఐసి నికరలాభం రూ.10,098 కోట్లు!




**న్యూఢిల్లీ, నవంబరు 6:** ప్రభుత్వరంగంలోని జీవితబీమా సంస్థ గురువారం త్రైమాసిక ఫలితాలుప్రకటించింది. నికరలాభాలు రెండోత్రైమాసికంలో 10,098 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంలో 7728.68 కోట్లతోపోలిస్తే 31శాతం పెరిగినట్లు ఎల్ఐసి ప్రకటించింది. నికర ప్రీమియం రాబడులు ఈత్రైమాసికంలో 1,26,930.04 కోట్లుగా ఉన్నాయి. ఈ ఏడాది మొదటి ఆరునెలల్లో ఎల్ఐసి నికరలాభం రూ.21,040 కోట్లకు చేరింది. ఏటికేడాది చొప్పునచూస్తే 16.36శాతం వృద్ధిని నమోదుచేసింది. ఈత్రైమాసికంలో నికర ప్రీమియం రాబడులు 1,26,930.04 కోట్లుగా ఉంది. వార్షికపద్ధతిలో 5.5శాతం వృద్ధినినమోదుచేసింది. ఆరునెలల కాలంలో మొత్తం ప్రీమియం వసూళ్లు 5.14శాతం వృద్ధిని నమోదుచేసి 2,45,680 కోట్లు రాబడులు సాధించింది. ఫలితాలు ప్రకటించేనాటికి బిఎస్ఇలో ఎల్ఐసి షేర్లు 895.45గాను, ఎన్ఎస్ఇలో 896.10గాను ట్రేడ్ అయ్యాయి. వ్యాపారపరంగాచూస్తే మొదటి ఆరు నెలల కాలంలో ఎల్ఐసి తన వ్యూహాన్ని ఉత్పత్తుల విస్తరణలోచూపించింది. తాము లిస్టింగ్ అయినప్పటినుంచి ఉత్పత్తుల విస్తరణవైపు ఫోకస్‌పెంచామని సిఇఒ ఆర్ దొరైస్వామి చెప్పారు. ఎల్ఐసి వ్యయాల నిష్పత్తి కూడా 146 బేసిస్ పాయింట్లు క్షీణించి 11.28శాతానికి చేరాయి. ఎల్ఐసి నిర్వహణాస్తులు 57,22,896 కోట్లుగా ఉన్నాయి. అదే గత ఏడాది 55,39,516 కోట్లనుంచి 31శాతం పెరిగినట్లు ప్రకటించింది.

# దాతల్లో మేటి శివనాడార్!


## అంబానీ, బజాజ్‌లు ఆ తర్వాతే!



**న్యూఢిల్లీ, నవంబరు 6:** దేశంలో భూరి విరాళాలు అందించే కార్పొరేట్ దిగ్గజాల్లో శివనాడార్ ముందున్నారు. గడచిన ఐదేళ్లలో ఆయన వరుసగా భారీ ఎత్తున విరాళాలుప్రకటిస్తూనే ఉన్నారు. శివనాడార్ ఫౌండేషన్‌నుంచి ఆయన 2025లో ఇప్పటివరకూ 2708 కోట్లు విరాళంగా ఇచ్చారు. అంటే రోజుకు 7.08 కోట్లు విరాళంగా ఇస్తున్నా కార్పొరేట్ దిగ్గజంగా నిలిచారు. గత ఏడాదికంటే 26శాతం ఎక్కువమొత్తం విరాలాలకు కేటాయించారు. విద్య, కళలు, సాంస్కృతిక రంగాలపైనే ఆయన ఎక్కువ ఫోకస్‌పెట్టారు. దేశంలోని పదిమంది విరాళ దాతలమొత్తం 5834 కోట్లుగా ఉన్నాయి. ముకేష్ అంబాని ఆయన కుటుంబం రెండోస్థానంలో ఉంది. 626 కోట్లు విరాళాలుగా ప్రకటించింది. గత యేడాదికంటే 54శాతం విరాళాలు పెరిగాయి. రిలయన్స్ ఫౌండేషన్‌నుంచి హెల్త్‌కేర్, విద్య, గ్రామీణ పరివర్తనం విభాగాలకు విరాళాలు అందచేస్తారు. ఇక బజాజ్ కుటుంబం 446 కోట్లు ఇచ్చింది.

జమ్నాలాల్ బజాజ్‌ట్రస్టునుంచి విరాళాలు ఇస్తారు. కుమార మంగళం బిర్లా ఆయన కుటుంబం 440 కోట్లు, గౌతమ్ ఆదాని ఆయన కుటుంబం 386 కోట్లు విరాళాలుఇచ్చాయి. వీరుకాకుండా నందన్ నీలేకని రూ.365కోట్లు, హిందూజా కుటుంబం రూ.298 కోట్లు, రోహిని నీలేకని రూ.204 కోట్లు సుధీర్ సామిర్ మెహతా రూ.189 కోట్లు, సైరస్ అదర్ పూనావాల్లా రూ.173 కోట్లు తమ బాధ్యతగా విరాళాలు ఇచ్చారు. రూ.100 కోట్లకుపైబడి విరాళం ఇచ్చిన కార్పొరేటల్లు 2018లో కేవలం ఇద్దరు మాత్రమేఉంటే ఇపుడు 18 మందికి పెరిగారు. 50 కోట్లకుమించి 33మంది, 20 కోట్లకు పైబడి రూ.70 కోట్లుఇచ్చారు. వ్యక్తిగతంగా ఒక్కొక్కరు చొప్పున చూస్తే 54కోట్లుగా ఇచ్చారు. విద్యారంగానికి ఎక్కువ నిధులు కేటాయించారు. 4166కోట్లు 107మంది దాతలు నుంచి అందాయి. ఫార్మారంగంలో ఎక్కువ మొత్తం అందితే సాఫ్ట్‌వేర్, ఆటోమోటివ్, పెట్రోకెమికల్స్‌రంగాలు కూడా ఎక్కువఉన్నాయి. విరాళాల రాజధానిగా ముంబయి మహానగరం నిలిచింది. మేజర్ దాతల్లో 28శాతం ఇక్కడివారే. ఇక కార్పొరేట్ సామాజిక బాధ్యతల ఫండింగ్‌లో రిలయన్స్ అగ్రగామిగా ఉంది. రూ.1309 కోట్లు కేటాయించింది. చట్టప్రకారం రూ.261 కోట్లు ఇస్తేచాలు అయితే రిలయన్స్ మాత్రం 1309 కోట్లు ఇచ్చింది. ఇక రుంగ్టాసన్స్, జిందాల్‌స్టీల్ అండ్ పవర్‌లు కూడా సిఎస్ఆర్‌లో పరిమితులు అధిగమించాయి.

# సేవలరంగంలో మందగించిన వృద్ధి!





**న్యూఢిల్లీ, నవంబరు 6:** భారత్ సేవల రంగం వృద్ధి గత నెలలో మందగించింది. భారీ వర్షాలు వరదలు ప్రకృతి బీభత్సాలు వంటి వాటివల్ల ఉత్పత్తికూడా కొంతమేర కుంటుపడింది. మిగిలిన రంగాల్లో మాత్రం జిఎస్టీ ఉపశమనంతో కొంతమేర పెరిగినట్లు హెచ్ఎస్‌బిసి ఇండియా వెల్లడించింది. సంస్థ ఇండియా సర్వీసెస్ పిఎంఐ సూచీ అక్టోబరులో 58.9 పాయింట్లకు పడిపోయింది. అదే అంతకుముందు సెప్టెంబరు నెలలో 60.9 పాయింట్లుగా నమోదయింది. మేనెలనుంచి చూస్తే విస్తరణ మందగమనంతో ఉందని హెచ్ఎస్‌బిసి వెల్లడించింది.

అయితే తటస్థ మార్కు 50 పాయింట్లను అధిగమించింది. అలాగే దీర్ఘకాలిక సగటు 54.3 పాయింట్లను కూడా బ్రేక్‌చేసి కొంతమేర పర్వాలేదనిపించింది. అలాగే ఉత్పత్తి పిఎంఐ సూచీ కూడా 52.9 పాయింట్లనుంచి 53.3 పాయింట్లకు పెరిగింది. ప్రైవేటురంగంలో ఉత్పత్తి మరింత పెరుగు తుందని అంచనా.

# ఒక్కో గ్రాముకు రూ.9121 రిటర్నులు!

## మెచ్యూరిటీకి వచ్చిన గోల్డ్‌బాండ్లకు బంపర్ ఆఫర్లు



**న్యూఢిల్లీ, నవంబరు 6:** ఆర్‌బిఐ విడుదలచేస్తున్న సార్వభౌమ గోల్డ్ బాండ్స్ ఈసారి ఇన్వెస్టర్లకు కనక వర్షం కురిపించాయి. 8యేళ్ల కాలపరిమితితో జారీచేసిన ఈ బాండ్లలోపెట్టుబడి పెట్టినవారికి తాజాగా 316శాతం లాభాలు వచ్చాయి.గ్రాముకు రూ.9121 చొప్పున లాభం వచ్చింది. బంగారం ధరలు ఒక్కసారిగా పెరిగినవేళ ఈ బాండ్లలో పెట్టుబడులు పెట్టినవారికి భారీ స్థాయిలో రిటర్నులు వస్తున్నాయి. 2017 నవంబరు ఆరున జారీచేసిన పసిడిబాండ్లకు సంబంధించి విముక్తి తేదీని ఆర్‌బిఐ ప్రపకటించింది. 2017–18 సిరీస్–6 బాండ్లకు సంబంధించి అప్పటిధర రూ.2895గా నిర్ణయించారు. ఆన్‌లైన్ కొనుగోలుచేసినవారికి మరో రూ.50 డిస్కౌంట్ ఇచ్చింది. కాలపరిమితి ఎనిమిదేళ్లు పూర్తికావడంతో మెచూరిటీకి వచ్చాయి.999 స్వచ్ఛత కలిగిన బంగారంధరలను ఇపుడురూ.12,066గాప్రకటించింది. ఈ మొత్తం నుంచి కొనుగోలుధరను మినహాయిస్తే ఒక్కోగ్రాముపై రూ.9121 రిటర్నులు వచ్చాయని అంచనా. ఈమొత్తాన్నే పర్సంటేజిల్లో లెక్కిస్తే 316శాతంగా ఉంటుంది. దీనికి ఏటా చెల్లించే వడ్డీ 2.5శాతం అదనంగా ఉంటుంది. ఆర్‌బిఐ ఈ ధరలు నిర్ణయించేముందు ఇండియా బులియన్ అండ్ జ్యుయెలర్స్ అసోసియేషన్‌నిర్ణయించిన సగటుధరను పరిగణనలోనికి తీసుకని ఆర్‌బిఐ ధరలు ప్రకటిస్తుంది. అ విధానంలో గ్రాముధర రూ.12,066గా ప్రకటించింది. ఈ బాండ్లపై వచ్చిన రిటర్నులకు ఒక్కరూపాయికూడా పన్ను చెల్లించాల్సిన పనిలేదని వెల్లడించింది. అయితేప్రస్తుతం ఖజానాపై భారం పడుతుండటంతో బాండ్ల జారీకి తాత్కాలిక విరామం ప్రకటించింది.

# నష్టాల్లోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ..



**ముంబయి, నవంబరు 6:** స్టాక్ మార్కెట్లలో వరుసగా మూడో రోజు కూడా సూచీలు నష్టాలను మూటగట్టుకున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు మంగళవారం 1,067 కోట్ల రూపాయల విలువైన షేర్లను అమ్మడం మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీసింది. గత ఐదు సెషన్లలో విదేశీ మదుపర్లు 15 వేల కోట్ల రూపాయల విలువైన షేర్లను అమ్మేశారు. అలాగే అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, మెటల్, ఫైనాన్సియల్, ఐటీ, ఎఫ్ఎమ్‌సీజీ సెక్టార్లలో అమ్మకాలు ప్రతికూలంగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ రోజు సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలతో రోజును ముగించాయి.గత సెషన్ ముగింపు 83,459తో పోల్చుకుంటే బుధవారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుంది. మధ్యాహ్నం సమయంలో కాస్త పుంజుకున్న సూచీలు మళ్లీ చివరి గంటలో నష్టాల వైపు పయనించాయి. చివరకు సెన్సెక్స్ 148 పాయింట్ల నష్టంతో 83,311వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 87 పాయింట్ల నష్టంతో 25,509 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో ఆస్ట్రాల్‌లిమిటెడ్, ఆసియన్ పెయింట్స్, పేటీఎమ్,మనప్పురం ఫైనాన్స్, ఇండస్‌టవర్స్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. డెలివరీ, గ్రాసిమ్, ఇండియన్ హోటల్స్, బ్లూ స్టార్ మొదలైన షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ272పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 568 పాయింట్ల నష్టంతో రోజును ముగించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.61గా ఉంది.

# పొగిడితే సంతోషం !



ఈరోజు భలే కొత్తగా ఉన్నావే.. అని ఒక్కసారి పక్కన ఉన్న అమ్మాయికో... మీ సహోద్యోగికో.... ఒక్కసారి చెప్పి చూడండి. వాళ్ళు ఎంత ఒత్తిడిలో ఉన్నా అదంతా ఇట్టే దూరం అవుతుంది. పొగడ్తకు పడిపోని అమ్మాయిలు ఉండరు అని ఊరికే అన్నారా! దీనివల్ల ఎన్ని లాభాలో తెలుసా? ఒత్తిడివల్ల వచ్చే కార్టిసాల్ స్థాయిలు తగ్గుతాయి. డోపమైన్ల విడుదల పెరుగుతుంది. ఆత్మస్థైర్యం, నమ్మకం ఏర్పడతాయి. అందం, పని, పరిస్థితులు, చుట్టూ ఉన్న వాళ్ల మాటలు... వంటి ప్రతికూల అంశాల్లో అమ్మాయిలూ, మహిళలూ తమని తాము తక్కువగా భావించడానికే, బాధపడటానికీ ఓ అధ్యయనం ప్రకారం మహిళలు నెలలో మూడున్నర రోజులపాటు నిరాశ, నిస్పృహాలతో విచారంగానే ఉంటారట, చూశారా మరి! నెలలో మూడున్నర రోజులంటే సంవత్సరానికి 42 రోజులు. ఇలా ఆలోచిస్తే వాళ్ల జీవితకాలంలో ఎన్ని రోజులు వృథాగా పోతున్నాయో. అసలే ఉన్నదొక్కటే జీవితం... దాని చుట్టూ ఉన్న వాళ్లని బాధలో ఉండనిద్దామా? సందర్భానుసారంగా ఫ్రెస్సు బాగుంది... చక్కటి నవ్వు... హెయిర్ స్టైల్ సూపర్ అంటూ ప్రశంసిస్తే పోయేదేముంది. అన్నట్టు ఇది... వాళ్లకూ మీకూ ఇద్దరికీ ఉపయోగమే. వాళ్లని పొగిడితే మాకేంటి లాభం అని కొట్టిపారేయకండి. దీనివల్ల సత్సంబంధాలు ఏర్పడతాయి. ఎదుటివారితో మాట్లాడే విధానం తెలుస్తుంది. కమ్యూనికేషన్ నైపుణ్యాలు బలపడతాయి. మీరు ప్రశంసిస్తే వాళ్లు మాత్రం ఊరికే ఉంటారా? తిరిగి మీకు వెంటనే ఏదో రకంగా ఆ ఆనందాన్ని ఇచ్చేయరూ. ఓసారి ప్రయత్నించి చూస్తారుగా మరి!

# ఏం తింటారో నిర్ణయించుకోనివ్వండి !



పిల్లలకు తినిపించడం... ప్రతి అమ్మకూ పెద్ద సవాలే. కొన్ని తినడం అని పేచీ పెడితే, కావాలని మారాం చేస్తారు. ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి... జంక్ని వారికి దూరంగా ఉంచాలంటే తినడానికి ఓ ప్లాన్ ఇవ్వాలి. అదెలాగంటారా? ✦ రోజూ మీ పిల్లలకు ఏం పెడతారు? ఇడ్లీ, దోశ, పాస్తా, అన్నం, పప్పు, చికెన్... అంటూ వీలునుబట్టి ఏదో ఒకటి చేసి పెట్టేస్తాం అనేగా మీ సమాధానం. ఇక ముందు అలా చేయొద్దు. వాళ్లేం తినాలను కుంటున్నారో తెలుసుకొని దానికి తగ్గట్లు గానే వారానికి సరిపడా ఫుడ్ ప్లాన్ సిద్ధం చేయండి. అందులో పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు... వంటివీ చేర్చండి. అప్పుడు దాన్ని కనిపించేలా గోడకు అతికిస్తే సరి. మీకు శ్రమ కూడా తప్పుతుంది. ✦ పిల్లలకు ఆహారంపై ఇష్టాన్ని పెంచండి. ముఖ్యంగా ఎప్పుడూ ఒకే తరహా పదార్థాలు కాకుండా... దానిలోనే కాస్తతను చూపించండి. ఉదాహరణకు రవ్వ ఇడ్లీ, ఫ్రైడ్ ఇడ్లీ, సాంబార్ ఇడ్లీ... అంటూ ఒకదానిలోనే వివిధ రకాలను పెట్టగలిగితే వారూ మెచ్చుకుంటారు. ఇవేక తినేటప్పుడు ఎప్పుడూ మొబైల్, టీవీలకు దూరంగా ఉంచాలి. కుటుంబ సభ్యులతో కలిపి తినేలా చేయండి. అవసరమైతే కుండీల్లో వారికి నచ్చే కూరగాయలు, ఆకుకూరల్ని పెంచేలా ప్రోత్సహించండి. ✦ అన్ని రుచులూ అందరికీ తెలియకపోవచ్చు. దాని గురించి పిల్లలకు చెప్పినా అర్థం కాకపోవచ్చు. అందుకే, చిన్నారులతో ఇష్టంగా తినిపించాలంటే ముందు దాన్ని వారి కంటిని ఆకట్టుకునేలా తయారు చేయండి. ఆపై సువాసనలకు ఆకలిని పెంచే గుణముందట. జీలకర్ర, అల్లం, కొత్తిమీర, ధనియాలు వంటి సుగంధ ద్రవ్యాల పరిమళాలన్నీ ఈ తరహావే కాబట్టి వాటి వినియోగం పెంచండి. ఆరోగ్యానికి మంచిది. □

# జగదంబ ఆరాధనతో జగతికి కల్యాణం

'గృహేగృహే శక్తిపరైః గ్రామేగ్రామే వేదవనే' అన్నది రుషి వాక్యం. అంటే అమ్మవారి పూజలు ప్రతి ఇంట్లో, ప్రతి గ్రామంలో, ప్రతి వనంలోనూ నిర్వహించాలని భావం. జగదంబ ఆరాధనతో జగతికి కల్యాణం. ఆమె ధరించిన దుర్గాదేవి రూపం సంపూర్ణ అనుగ్రహానికి ఆలవాలం. దుర్గ అంటే ఆశ్రయశక్తి అని మహర్షులు నిర్వర్తించారు. అలాగే ఆ దేవిని తారిణీశక్తిగా (కష్టాల సముద్రాన్ని దాటించగల శక్తి) అభివర్ణించారు. అంటే దాటించే శక్తి దుర్గ. కష్టాల కడలి నుంచి భక్తులను తీరానికి చేర్చే తల్లి ఆ మహాదేవి. అలాగే 'దుర్గం' అంటే కోట అని అర్థం. ప్రాపంచిక క్లేశాల నుంచి మనల్ని రక్షించే దుర్గం ఆ దుర్గాదేవి. ఆ దేవి రాక్షసుల్ని త్రిశూలంతో సంహరించింది. ఆమె ధరించిన త్రిశూలం భక్తి, జ్ఞాన, వైరాగ్యాలకు ప్రతీక. మనలోని కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే అసురులను, భక్తి జ్ఞాన వైరాగ్యాలనే మూడు శూలాలతో రూపు మాపాలని ఆ సంహరణలో సందేశం. 'దుర్గ' నామాన్ని సదా స్మరించేవారికి ఆపదలు తొలగిపోతాయని 'దేవీ మాహాత్మ్యం'. పేర్కొంది. అమ్మవారి పూజను సాత్విక, రాజసిక, తామసిక అంటూ మూడు విధాలుగా వివరించింది. 'దేవీభాగవతం' వేదోక్త మంత్రాలు, జపయజ్ఞాలతో నిర్వహించేది సాత్విక పూజ. అలంకారాలు, ఆడంబరాలతో చేసేది రాజసపూజ. తాంత్రిక విద్యలతో జరిపేది తామసపూజ. అయితే తామస పూజ నుంచి సాత్వికపూజకు ఎంత త్వరగా పురోగతి సాధిస్తే మనం అంత ఆధ్యాత్మికంగా ముందుకు వెళ్లినట్లు. ఈ సాత్వికపూజ వల్ల మనకు, ఆ జగన్మాతకు మధ్య అను బంధం మరింత ఇనుమడిస్తుంది. మనసు అంతర్ముఖ మవుతుంది. మనలో జ్ఞానం వికసిస్తుంది. □

# నన్ .. క్రీడల్లో మేటి



రిటైర్మెంట్‌కి ముందు ఆఖరి మ్యాచ్‌లో గెలిస్తే ఆ కిక్కే వేరు కదా! ప్రస్తుతం అలాంటి ఆనందంలోనే ఉంది సిస్టర్ సబీనా. కేరళకు చెందిన ఈ నన్ ప్రస్తుతం స్థానిక పాఠశాలలో పీఈటీగా పనిచేస్తోంది. మరోవైపు అవకాశం వచ్చినప్పుడల్లా రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటోంది. అలా ఇటీవలే ఆ రాష్ట్ర స్థాయిలో జరిగిన 'స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్'లో హార్డిల్స్ విభాగంలో ఈ 55 ఏళ్ల స్పోర్ట్స్ టీచర్ పోటీ పడింది. ఇందులో బంగారు పతకం గెలుచుకుంది. అది కూడా షూస్ లేకుండా, సంప్రదాయ దుస్తులు ధరించి మరీ విజయం సాధించడంతో ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబీనాను ప్రశంసించారు. 'లక్ష్యాన్ని చేరుకోవాలంటే వయసు, వస్త్రధారణ.. ఇవేవీ అడ్డంకులు కాద'ని తన విజయంతో నిరూపించిన ఈ పీఈటీ టీచర్ విశేషాలు తెలుసుకుందాం..

**ప్లేయర్ టు పిఈటీ!.....**

సబీనాది వయనాడ్‌ని ఎన్నప్పుర అనే గ్రామం. ఆమెకు చిన్న తనం నుంచి ఆట లంటే మక్కువ ఎక్కువ. ఈ ఇష్టంతోనే స్కూల్లో ఉన్నప్పట్నుంచే వివిధ క్రీడల్లో ఆరితేరింది. వయసు పెరిగే కొద్దీ హార్డిల్స్‌పై ఆసక్తి చూపిన సబీనా.. తొమ్మిదేళ్ల వయసు నుంచే ఈ క్రీడా పోటీల్లో పాల్గొనడం ప్రారంభించింది. ఈ విధంగానే జాతీయ స్థాయిలో పలు పతకాలు గెలిచింది. ఇలా ఆటలపై తనకున్న మక్కువతోనే వయనాడ్‌లోని ద్వారక ఎయూపి స్కూల్లో పీఈటీగా చేరింది సబీనా. తన వృత్తిలో భాగంగా విద్యార్థులను ఆయా క్రీడాంశాల్లో తీర్చిదిద్దింది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఎన్నో పాల్గొనేలా ప్రోత్సహించి.. వారు పతకాలు గెలుచుకునేలా చేసింది. ఇలా మన్ననలూ పొందింది. అంతేకాదు.. సమయం వచ్చినప్పుడు తానూ హార్డిల్స్ పోటీల్లో పాల్గొనేది సబీనా. ఈ క్రమంలోనే ఇటీవలే 'స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్ పోటీలు జరగ్గా అందులో పోటీపడి బంగారు పతకం గెలుచుకుంది సమీనా. స్పోర్ట్స్ షూస్ ధరించకుండా, నన్ సంప్రదాయ దుస్తుల్లోనే ఆమె ఈ పోటీల్లో పాల్గొని విజయంసాధించడం విశేషం! ఆమె ఫొటోను ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ.. 'స్టేట్ మాస్టర్స్ మీట్‌లో హార్డిల్స్‌తో బంగారు పతకం గెలిచిన సిస్టర్ సబీనాకు అభినందనలు. ఆమె విజయం అటు వ్యక్తిగతంగా, ఇటు స్కూలు యాజమాన్యానికే కాదు.. విద్యాశాఖకూ గర్వకారణం. ప్రస్తుతం 55 ఏళ్ల వయసులో ఉన్నప్పటికీ వయసును లెక్క చేయకుండా, నన్ సంప్రదాయ దుస్తుల్లో పోటీపడి విజయం సాధించి.. ఆమె తన సంకల్ప బలాన్ని చాటుకుంది. లక్ష్యాన్ని చేరుకోవాలంటే వయసు, వేషధారణ.. ఇవేవీ అడ్డు కావని నిరూపించింది. ఈ స్పోర్ట్స్ టీచర్ అంకితభావం ఆమె విద్యార్థులకే కాదు.. సమాజానికి స్ఫూర్తిదాయకం! ఆమె రేసుతో పాటు ఎంతోమంది మనసులూ గెలుచుకుంది.. ఆల్ ది బెస్ట్ సిస్టర్ సబీనా! అంటూ క్యాప్షన్ జోడించారు. దీంతో ఈ పీఈటీ తాజా విజయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చాలామంది ఆమెను ప్రశంసిస్తూ పోస్టులు పెడుతున్నారు. మరికొందరు తమ విన్నింగ్ మొమెంట్స్‌ని గుర్తుచేసుకుంటూ కామెంట్లు షేర్ చేస్తున్నారు.

**ఆఖరి మ్యాచ్ లో.. విజయం!** అయితే టీచర్‌గా రిటైర్మెంట్‌కు ముందు జరిగిన ఈ ఆఖరి మ్యాచ్‌లో తాను విజయం సాధించడం సంతోషంగా ఉందంటోంది సబీనా. వచ్చే ఏడాది మార్చిలో నేను పీఈటీగా రిటైర్ కాబోతున్నా. అంతకంటే ముందు ఆఖరిసారిగా అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్నా. ఈ పోటీలో విజయం సాధించడం చాలా సంతోషంగా ఉంది. చాలామంది తమ వ్యక్తిగత, వృత్తిగత జీవితాల్లో పలు లక్ష్యాలను పెట్టుకుంటారు. కానీ వయసు, ఇంటి బాధ్యతలు.. ఇలా ఆయా పరిస్థితుల రీత్యా వాటిని చేరుకోలేకపోతారు. కానీ మనసు పెట్టి ప్రయత్నిస్తే ఇవేవీ మనం లక్ష్యాన్ని చేరుకోకుండా అడ్డుకోలేవు.. అంటూ పీఈటీ. □

# ముడతలకు చెక్ !



ముఖంపై ముడతలకు నిద్రలేమి, ఒత్తిడి కారణం అవుతు న్నాయి. సొగసు.. చిన్నవయసు లోనే ముఖం చాటేస్తు న్నది. అయితే.. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్య కరమైన చర్మాన్ని సొంతం చేసుకోవచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. ముడతలు వస్తే.. తప్పకుండా సన్‌స్క్రీన్ లోషన్‌ను రాసుకోవాలి. ముఖంపై సూర్యరశ్మి నేరుగా పడకుండా చూసుకోవాలి. సూర్యుని నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు.. చర్మాన్ని దెబ్బతీస్తాయి. కాబట్టి, చలికాలంలో కూడా ఎస్‌పీఎఫ్ 30కిపైగా ఉండే లోషన్‌ను రాసుకోవాలి. పొడిచర్మం ఉంటే.. ముడతలు ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే, తరచూ ముఖాన్ని కడుక్కుంటూ ఉండాలి. దీనివల్ల దుమ్మూధూళితో మూసుకు పోయిన స్వేద రంధ్రాలు తెరుచుకుంటాయి. చర్మం కాంతిమంతం అవుతుంది. ముఖం తేమగా ఉండేందుకు మాయిశ్చరైజర్‌ను రాసుకోవాలి. ఒత్తిడిని తగ్గించే వ్యాయామాలు చేయాలి. నిత్యం ఏదో ఒక వ్యాయామం చేయడం వల్ల నిద్ర బాగా పడుతుంది. శరీర ఆరోగ్యంతోపాటు చర్మ సౌందర్యమూ మెరుగుపడుతుంది. వ్యాయామం వల్ల ఎండార్ఫిన్స్ లాంటి ఫీల్‌గుడ్ హార్మోన్లు విడుదల అవుతాయి. ఒత్తిడికి కారణమయ్యే కార్టిసోల్ లాంటివి తగ్గుతాయి. దీంతో చర్మంపై ముడతలు తొందరగా ఏర్పడవు. ప్రతిరోజూ ఎనిమిది గంటలు నిద్రపోవాలి. కంటి నిండా నిద్రవల్ల ఒత్తిడి తగ్గుతుంది. చర్మానికి కావాల్సినంత సాంత్వన లభిస్తుంది. □

# నూనె లేకున్నా రుచిగానే..

పూరీలంత కాకున్నా.. దోశలు కూడా నూనె పీల్చుకుంటాయి. కానీ వీటిని నూనె లేకుండా చేయవచ్చు. నూనె సరిపడని వారికి. **కావలసినవి:** బియ్యం కప్పు, ఇడ్లీ రవ్వ అర కప్పు, అటుకులు, కప్పు, మినప్పప్పు 2 టేబుల్ స్పూన్లు, మరమరాలు కప్పు, మెంతులు చెంచా, ఉప్పు రుచికి తగినంత, అల్లం పచ్చిమిర్చి ముద్ద చెంచా, మిరియాల పొడి చెంచా, కొత్తిమీర తరుగు పావు కప్పు **తయారీ:**

ఉదయం మినప్పప్పును, బియ్యాన్ని రెండుసార్లు కడిగి నానబెట్టాలి. రాత్రికి కాస్త ఉప్పు, మెంతులు వేసి గ్రైండ్ చేయాలి. అందులో ఇడ్లీరవ్వను జోడించి నాననివ్వాలి. మర్నాడు పొద్దున మరమరాలు, అల్లం పచ్చిమిర్చి ముద్ద, మిరియాల పొడి, కొత్తిమీర తరుగు, తగినన్ని నీళ్లు జతచేయాలి. ఈ పిండితో కాలుతున్న పెనం మీద దోశ వేసి మూత పెట్టాలి. బంగారు రంగులోకి మారిన తర్వాత తిరగేసి మూత పెట్టాలి. ఇలా నూనె లేకుండానే రుచికరమైన దోశలు తయారవుతాయి. అయితే ఈ దోశలు మరీ ఉల్లిపొరల్లా కాకుండా కాస్త మందంగానే ఉండాలి.



# 'రాజు వెడ్స్ రాంబాయి' బ్లాక్ బస్టర్ హిట్

'రాంబాయి నీ మీద నాకు..' సాంగ్ లాంఛ్ ఈవెంట్ లో 'రాకింగ్ స్టార్' మంచు మనోజ్.. అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా "రాజు వెడ్స్ రాంబాయి". ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. "రాజు వెడ్స్ రాంబాయి" చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాము సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్ పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 21న "రాజు వెడ్స్ రాంబాయి" సినిమాను వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా నుంచి రాంబాయి నీ మీద నాకు.. లిరికల్ సాంగ్ ను రాకింగ్ స్టార్ మంచు మనోజ్, భూమా మోనిక చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో లిరిసిస్ట్ "రాజు వెడ్స్ రాంబాయి" సినిమా ఈవెంట్‌కు మనోజ్ గెస్ట్‌గా రావడం హ్యాపీగా ఉంది. రాకింగ్ స్టార్ మంచు మనోజ్ మాట్లాడుతూ, నా కెరీర్ లో 2.ఓ ఈటీవీ విన్ లో ఉస్తాద్ అనే షో తో స్టార్ట్ అయ్యింది. ఆ తర్వాత భైరవం, మిరాయ్ లాంటి హిట్ సినిమాలు దక్కాయి. మంచి కంటెంట్ తో మూవీస్, షోస్ చేస్తూ ఈటీవీ విన్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ఈ ప్రాజెక్ట్ గురించి నాకు తెలుసు. రెండేళ్లుగా ఈ టీమ్ "రాజు వెడ్స్ రాంబాయి" సినిమా కోసం కష్టపడుతున్నారు. ఒక పల్లెటూరిలో జరిగిన యదార్థ ఘటన ఈ సినిమా. జరగకూడని ఘటన అది. ఇటీవల లిటిల్ హార్ట్స్ అనే ఎంటర్ టైనింగ్ మూవీ చేశారు. "రాజు వెడ్స్ రాంబాయి" సినిమా కూడా లైట్ మూవ్ మెంట్స్ తో వెళ్తూ హెవీ ఎమోషన్ తో పూర్తవుతుంది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది. అన్ని అవార్డ్స్ ఈ సినిమాకు వస్తాయి.ఇలాంటి పాయింట్ ను డైరెక్టర్ సినిమాగా చేశాడంటే అతనికి హ్యాట్సాఫ్. ఇలాంటి మంచి సినిమాను థియేటర్స్ లో చూసి సపోర్ట్ చేయండి. అన్నారు



# 'ఆర్యన్' తమిళ్‌లో సూపర్ హిట్



విష్ణు విశాల్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఆర్యన్, ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రేష్ట్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ సినిమాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో విడుదల చేయనున్నారు. ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ లో హీరో విష్ణు విశాల్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. తెలుగు ఆడియన్స్ అందరికీ నా హృదయపూర్వక నమస్కారం. మీరు నా సినిమాలు రాక్షసన్, ఎఫ్ఐఆర్, మట్టి కుస్తీ చాలా ప్రేమతో సపోర్ట్ చేశారు. రాక్షసన్ స్ట్రాంగ్ థ్రిల్లర్. ఎఫ్ఐఆర్ యాక్షన్ ఎమోషనల్ జర్నీ. మట్టి కుస్తీ ఫన్ ఎంటర్టైనర్. ఇప్పుడు ఆర్యన్ తో మళ్ళీ మీ ముందుకు వస్తున్నాను. డైరెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ. తెలుగులో ఈ సినిమా రిలీజ్ కావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా ఆలోచన 10 ఏళ్ల క్రితం వచ్చినప్పుడే దీన్ని తెలుగులో చేయాలను కున్నాను. శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ.. డాకు మహారాజ్ తర్వాత మళ్లీ మిమ్మల్ని కలవడం చాలా ఆనందంగా ఉంది. ఆర్యన్ సినిమా నవంబర్ 7న రిలీజ్ కాబోతోంది. అక్టోబర్ 31 సినిమా తమిళ్లో రిలీజ్ అయింది. హీరోయిన్ మానస మాట్లాడుతూ.. నాకు ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ గారికి నిర్మాతలకి థాంక్యూ. సినిమా చూడటానికి చాలా బ్యూటిఫుల్ గా ఉంటుంది. శ్రద్ధ గారు సినిమాలో చూడడానికి చాలా అందంగా ఉన్నారు. విష్ణు గారు ప్రతి మాట మనసు నుంచే మాట్లాడుతారు. నేను ఇందులో చేసిన క్యారెక్టర్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది.

## తెర

# 'జటాధర 'బిగ్ స్క్రీన్ పై చూడదగ్గ సినిమా



**జటాధర కథ ఫస్ట్ టైం మీ దగ్గరికి వచ్చినప్పుడు ఎలా ఫీలయ్యారు?**

- చిన్నప్పుడు మనం జానపద, చందమామ కథలు వినుంటాం. బ్యాంకులో లేని సమయంలో ధనాన్ని భూమిలో పాతి ఒక బంధనం వేసి దానికి ఒక పిశాచి కాపలాగా ఉంటుంది అని ప్రచారంలో ఒక కథ ఉండేది. ఈ కథకు అలాంటి ఒక జానపదం ఆధారం. అలాంటి కథని ప్రజెంట్ టైం లోకి వచ్చి తీసుకొచ్చి చాలా ఇంట్రెస్టింగ్గా ప్రజెంట్ చేశారు.

**ప్రీరిలీజ్ ఈవెంట్లో మీరు చాలా ఎమోషనల్‌గా మాట్లాడారు.. అలా ఎప్పుడు చెప్పలేదు కదా.. ప్రత్యేకమైన కారణం ఉందా?**

- ఎప్పుడు అలా చెప్పలేదు కాబట్టి చెప్పాను ( నవ్వుతూ) ఇండస్ట్రీలో చాలా మందికి తెలుసు. అయితే తెలియని వాళ్ళకి తెలుస్తుందని అలా చెప్పాను. నేను కొన్ని ఈవెంట్స్ కి కొత్తవారిని సపోర్ట్ చేయడానికి వెళుతున్నప్పుడు అక్కడ కూడా నాకు నాకైతే ఈజీగా ఉంటుంది,

**జటాధర మీ క్యారెక్టర్ ఎలా వుంటుంది?**

- ఇందులో ఘోస్ట్ హంటర్ గా కనిపిస్తా. అయితే తనకి దెయ్యాలు వున్నాటంటే నమ్మకం వుండదు. దేవునిపై నమ్మకం వుంటుంది. సైన్స్ ని నమ్ముతాను. అలా ఎందుకనేది సినిమాలో చాలా ఆసక్తికరంగా వుంటుంది.

**మైథాలజీ జానర్ సినిమాలకి చాలా మంచి రెస్పాన్స్ వస్తుంది కదా.. ఈ సినిమా చేయడానికి అదే కారణమా?**

- లేదండి. ఇప్పుడున్న ట్రెండు రెండేళ్ల తర్వాత ఉంటుందో లేదో చెప్పలేం. దాన్నిబట్టి ఒక సబ్జెక్టు సెలెక్ట్ చేసుకోవడం అనేది ఉండదు. నా కెరీర్ లో ఎప్పుడూ అలా చేయలేదు. కో ఇన్సిడెంట్ ఇప్పుడీ జానర్ ట్రెండ్ లో వుంది. టీజర్ ట్రైలర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. బిజినెస్ కూడా చాలా బాగుంది.

**నార్త్ నుంచి తెలుగులోకి తీసుకురావడం ఎలా అనిపించింది?**

- ఇది తెలుగు సినిమా. కాకపోతే ప్రొడ్యూసర్స్ నార్త్ నుంచి వచ్చారు. తెలుగు సినిమా చేద్దామని వచ్చారు. నాతో, నానితో కలిసి సినిమా చేద్దామని వచ్చారు. ఒక కథ చెప్పారు. నాకు అంతగా నచ్చలేదు. కొన్ని రోజుల తర్వాత మీ దగ్గర ఏదైనా కథ ఉంటే చెప్పమన్నారు. అప్పుడు ఈ కథని మేము డెవలప్ చేస్తున్నాం .అలా చెప్పినప్పుడు వాళ్ళకి నచ్చింది.

**సోనాక్షిగారితో వవర్క్ చేయడం ఎలా అనిపించింది?**

- సోనాక్షి చాలా అద్భుతమైన నటి. తన లుక్స్ సౌత్ ఇండియన్ లాగే ఉంటాయి. తన నటన అందరినీ ఆకట్టుకుంటుంది. ధనపిశాచి క్యారెక్టర్ కి చాలా వాల్యు యాడ్ చేశారు.

**శిల్పా శిరోద్కర్ గురించి?**

- శిల్ప గారు శోభ అనే పాత్రలో కనిపిస్తారు. అద్భుతంగా నటించారు. చాలా హెవీ పెర్ఫార్మన్స్ ఉన్న క్యారెక్టర్ అది. సినిమా తర్వాత తనకి చాలా మంచి అవకాశాలు వస్తాయి.

**మ్యూజిక్ ఎలా ఉంటుంది?**

రాజీవ్ చాలా అద్భుతంగా చేశాడు. ఇందులో శివతాండవం ఎపిసోడ్ వుంటుంది. అది థియేటర్స్ లో గ్రేట్ ఎక్స్పీరియన్స్ ఇస్తుంది.

**ఇందులో వీఎఫ్ ఎక్స్ వర్క్ ఎలా ఉంటుంది?**

- ఇది పూర్తిగా విజువల్ ఎఫెక్ట్స్ మీద ఆధారపడిన సినిమా అయితే కాదు. సోనాక్షి సిన్హా ఉండే పోర్షన్లో విఎఫ్ఎక్స్ వర్క్ ఉంటుంది. అది కూడా చాలా అద్భుతంగా వచ్చింది

**మీ జర్నీ ఎలా అనిపిస్తుంది?**

- నా ఫస్ట్ సినిమా ఎస్ఎంఎస్ చేసిన రోజున నేను 20 సినిమాలు చేస్తానని అనుకోలేదు. ఈ జర్నీ నాకు ఆనందాన్ని ఇస్తుంది. నేను ప్రతి సినిమాకి 100 ఇచ్చాను. అనిపిస్తుంది.

**నెక్స్ట్ సినిమాలు గురించి?**

- రాహుల్ రవీంద్రన్ తో ఒక సినిమా వుంది. ఇప్పుడు వరకు అలాంటి కాన్సెప్ట్ వరల్డ్ సినిమాల్లో రాలేదు. కాన్సెప్ట్ పరంగా అది ఒక బాహుబలి లాంటి సినిమా. అలాగే పుల్లెల గోపీచంద్ బయోపిక్ కూడా చేయాలి.

# కుంభమేళా ఫేమ్ మోనాలిసా కథానాయికగా 'లైఫ్'

కుంభమేళాలో పూసలమ్ముతూ విశాలమైన కనులతో సోషల్ మీడియా ద్వారా అందరినీ ఆకట్టుకున్న మోనాలిసా తెలుగులో కథా నాయికగా మారింది. సాయిచరణ్ హీరోగా వెంగ మాంబ క్రియేషనర్స్ బేనర్ పై రూపొందుతున్న ఈ చిత్రానికి లైఫ్ అని టైటిల్ ఫిక్స్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్లో నిర్మాత అంజన్న మాట్లాడుతూ.. ఈరోజు సినిమాను



ప్రారంభించాం. అలాగే రెగ్యులర్ షూటింగ్ కూడా జరుగుతుంది. సరికొత్త ప్రయోగంగా లైఫ్ సినిమాను ఆరంభించాం. కుంభమేళాలో చిన్న వ్యాపారం చేసి ఇండియా మొత్తం ప్రజాదరణ పొందిన అమ్మాయితో సినిమా చేస్తే క్రేజ్ వస్తుందని అనుకున్నాను. అనుకున్నట్లుగా దర్శకుడు చెప్పిన కథ నచ్చడంతో మోనాలిసా ను హీరోయిన్ గా ఎంపిక చేశాం. ఈ చిత్ర కథ సాఫ్ట్ వేర్ ఉద్యోగుల జీవితాల్లో చోటుచేసు కుంటున్న ఘటన ఆధారంగా వుంటుంది. ఈ ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రముఖులందరికీ పేరు పేరునా దన్యవాదాలు తెలియజేస్తున్నాను. హీరో సాయి చరణ్ మాట్లాడుతూ.. దర్శకుడుని నేను కలిసిన రోజునే కథకు సరిపోతావని చెప్పారు. యూత్ కు బాగా కనెక్ట్ అయ్యే కథాంశంతో లైఫ్ చిత్రం రూపొందుతోంది. ఇందులో చక్కటి సందేశం కూడా ఇమిడి వుంది. అందరికీ ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని అన్నారు.సీనియర్ నటుడు సురేష్ మాట్లాడుతూ.. నిర్మాత అంజన్న గారు దొంగాట సినిమా డిస్ట్రిబ్యూటర్ గా నాకు పరిచయం. ఓరోజు నాకు ఫోన్ చేసి సినిమా చేస్తున్నాను. కోరుకుంటున్నాను.మోనాలిసా మాట్లాడుతూ.. హైదరాబాద్ కు రావడం చాలా ఆనందంగా వుంది. నాతో తెలుగు సినిమా చేయడం చెప్పలేని ఆనందంగా ఉంది. ఇప్పుడు తెలుగు రాదు కానీ తెలుగు త్వరలో నేర్చుకుంటా, హీరోయిన్ గా చేస్తున్న లైఫ్ సినిమా అందరికీ మంచి లైఫ్ ఇస్తుందని భావిస్తున్నాను. ఈ సందర్భంగా దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు.

# 'ది గర్ల్ ఫ్రెండ్' స్ఫూర్తినిచ్చింది : అబ్దుల్ వహాబ్



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జం టీటీటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇంటెన్స్, ఎమోషనల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి వ్యవహిస్తున్నారు. సరికొత్త ప్రేమ కథగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఈ నెల 7న హిందీతో పాటు తెలుగులో.. ఈ నెల 14న, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో ఈ చిత్రానికి పనిచేసిన ఎక్సిపీరియన్స్ తెలియజేశారు మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వహాబ్.తెలుగులో నేను ఒప్పుకున్న మొదటి సినిమా.'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమా తర్వాత ఖుషి, హాయ్ నాన్న సినిమాలు చేశాను. ఇవన్నీ ప్రేమ కథా చిత్రాలే. వీటిలో 'ది గర్ల్ ఫ్రెండ్' కథలో ఇంటెన్సిటీ ఎక్కువగా ఉంటుంది. వరుసగాప్రేమ కథా చిత్రాలకు సంగీతాన్ని అందిస్తూ వచ్చాను. ఇప్పుడు వేరే జానర్ మూవీస్ కు ఆఫర్స్ వస్తున్నాయి.

నేను సింగర్ నుంచి మ్యూజిక్ డైరెక్టర్‌గా మారాను. అందుకే నా సినిమాల్లో ఒక పాటైనా పాడమని మేకర్స్ అడుగుతుంటారు. త్వరలో మాస్, బీట్ సాంగ్స్ కూడా చేయబోతున్నా. అలాంటి మూవీస్ అవకాశాలు వస్తున్నాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.